ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 14.07.2025 | సంపుటి : 11 సంచిక : 356 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## నేడు రాష్ట్ర వ్యాప్తంగా
# కొత్త రేషన్ కార్డుల పంపిణీ



తుంగతుర్తి నుంచి ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి

### రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు

హైదరాబాద్(జనంసాక్షి): పేదలకు ఆహార భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. అర్హులైన పేదలందరికీ తెల్లరేషన్ కార్డులను నిరంతరం అందించే ప్రక్రియ ద్వారా ఎప్పటికప్పుడు కొత్త రేషన్ కార్డుల మంజూరుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో జరిగే సభా కార్యక్రమంలో పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి 3,58,187 కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. దీంతో అదనంగా 15,53,074 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనున్నది. మొదటి దశలో సిఎం రేవంత్ రెడ్డి 2,03,156 కొత్త కార్డులు మంజూరు కార్యక్రమాన్ని నారాయణపేట జిల్లాలో ప్రారంభించిన విషయం తెలిసిందే. తుంగతుర్తి సభలో కొత్త రేషన్ కార్డుల జారీతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 89,95,282 నుంచి 95,56,625 కు చేరుకుంటుంది. లబ్ధిదారుల సంఖ్య 2,81,47,565 మంది నుంచి 3,09,30,911 మంది వరకు పెరుగుతుంది.




#### వెబ్ సైట్ ద్వారా వివరాలు


ఇప్పటి వరకు మంజూరైన కొత్త కార్డులతో పాటు కుటుంబ సభ్యుల జోడింపు వివరాలను పౌర సరఫరాల శాఖ వెబ్ సైట్ ద్వారా సులభంగా తెలుసుకోవచ్చు. కార్డు నెంబర్ లేదా మీసేవలో దరఖాస్తు చేసుకున్న సమయంలో జనరేట్ అయ్యే రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా అధికారిక వెబ్‌సైట్‌లో కార్డును నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ కార్డులో కుటుంబసభ్యుల పూర్తి వివరాలు చూపిస్తాయి. రిఫరెన్స్ నెంబర్ లేదా కార్డు నెంబర్‌ను ఎంటర్ చేయాలి. జిల్లా పేరును సెలెక్ట్ చేసి చేస్తే వివరాలు తెలుస్తాయి. వెబ్ సైట్ లో రేషన్ కార్డు స్థితి తెలియకపోతే స్థానిక మండల ఆఫీసుల్లో తమ దరఖాస్తు స్టేటస్ తెలుసుకోవచ్చు.

# తీన్మార్ మల్లన్న కార్యాలయంపై జాగృతి కార్యకర్తల దాడి

- గాల్లోకి గన్‌మెన్ కాల్పులు
- నాపై హత్యాయత్నం జరిగింది
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

- హత్యాయత్నాలతో బీసీ ఉద్యమం ఆగదు,దాడులకు భయపడేది లేదని వెల్లడి
- కార్యాలయంలో ఫర్నీచర్, అద్దాలు ధ్వంసం
- ఖండించిన జర్నలిస్ట్, ప్రజా సంఘాలు





జాగృతి కార్యకర్తల దాడిలో తీన్మార్ మల్లన్న కార్యాలయంలో ధ్వంసమైన ఫర్నీచర్, ఫ్లోర్‌పై రక్తపు మరకలు..

బోడుప్పల్(జనంసాక్షి): మేడిపల్లిలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై మరోసారి దాడి జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జాగృతి కార్యకర్తలు ఆయన ఆఫీస్ పై దాడి చేశారు. మేడిపల్లిలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై మరోసారి దాడి జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జాగృతి కార్యకర్తలు ఆయన కార్యాలయంపై దాడి చేశారు. మల్లన్న కార్యాలయంలో ఉన్న ఫర్నిచర్, అద్దాలను ధ్వంసం చేశారు. దాడి సమయంలో పరిస్థితిని అదుపు చేసేందుకు మల్లన్న గన్‌మెన్ గాల్లోకి 5రౌండ్ల కాల్పులు జరిపాడు. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఆ ప్రాంతంలో హై టెన్షన్ వాతావరణం నెలకొ నడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆఫీస్‌పై దాడి జరగడంతో సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. తీన్మార్ మల్లన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మిగతా 2లో..

## మల్లన్నపై చర్యలు తీసుకోండి

- మండలి చైర్మన్,డీజీపీలకు ఎమ్మెల్సీ కవిత ఫిర్యాదు
- తీన్మార్ మల్లన్న నాపై చాలా దారుణమైన వ్యాఖ్యలు చేశారు
- ఆయనను వెంటనే సీఎం రేవంత్ అరెస్ట్ చేయించాలి
- వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్‌ను కలుస్తామని వెల్లడి



హైదరాబాద్(జనంసాక్షి): తనపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చాలా దారుణమైన వ్యాఖ్యలు చేశారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మల్లన్నపై శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఆమె ఫిర్యాదు చేశారు. విచక్షణాధికారాలు

మిగతా 2లో..



### నటుడు కోట శ్రీనివాసరావు
## కన్నుమూత

ప్రముఖుల నివాళి

ప్రధాని మోదీ, సీఎం రేవంత్, కేసీఆర్ తదితరుల సంతాపం

ముగిసిన అంత్యక్రియలు

హైదరాబాద్(జనంసాక్షి): ప్రముఖ నటుడు కోటా శ్రీనివాసరావు కన్నుమూశారు. 83 ఏండ్ల వయస్సున్న ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు ఫిల్మ్‌నగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడి చారు. 1978లో ప్రాణం ఖరీదు సినిమాతో

మిగతా 2లో..

# మహిళా సాధికారత కోసం ఎంత దూరమైనా వెళ్తాం

ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా మహిళాభివృద్ధికి వెనుకాడం



- బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపడుతాం
- ప్రతి నియోజకవర్గంలో మైక్రో ఇండస్ట్రీస్ పెట్టి మహిళలు వ్యాపారాలు చేసుకునే విధంగా ప్రొత్సహిస్తాం
- లక్షెట్టిపేట బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మంచిర్యాల ప్రతినిధి(జనంసాక్షి): మహిళాసంఘాలకు సోలార్ విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టుల కేటాయింపుపై ప్రత్యేక దృష్టి సారించాం, మహిళా సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంత దూరమైనా వెళుతుంది, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్క మల్లు అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం ప్రసంగించారు. జనాభాలో సగభాగమైన మహిళలకు గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వడ్డీ లేని రుణాలు ఇవ్వగా పదేళ్లపాటు పరిపాలించిన టిఆర్ఎస్ వడ్డీ లేని రుణాల పథకాన్ని గాలికి వదిలేసింది, తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వడ్డీ లేని రుణాల పథకం అన్నారు ప్రారంభించిం దని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వ రులను చేసామని మేము ప్రకటించినప్పుడు ఇది సాధ్యమా అని కొద్దిమంది అవహేళన చేశారు కానీ మొదటి సంవత్సరంలోనే లక్ష్యానికి మించి 21, 600 కోట్ల రూపాయలు వడ్డీలేని రుణం చెక్కులను మహిళా సంఘాలకు అందజేశామని తెలిపారు. ఈనెల 12 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తామని అందులో భాగంగా ఆదివారం మంచి

మిగతా 2లో..



## లష్కర్ బోనాలు షురూ..

బోనం సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహాకాళి బోనాల జాతరకు హాజరయ్యారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు సీఎంకు వేదాశీర్వచనాలిచ్చారు. సీఎం వెంట మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ ఉన్నారు. రాష్ట్రంలో ప్రజలందరికీ మంచి జరగాలని అమ్మవారిని రేవంత్‌రెడ్డి ప్రార్థించారు. మహాకాళి బోనాల జాతర ఘనంగా సాగుతోంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఆదివారం బోనాలు, ఫలహారబండ్ల ఊరేగింపు, 14న రంగం, పోతరాజుల గావు, అంబారీపై అమ్మవారి ఊరేగింపు జరగనుంది. ఆలయ పరిసరాల్లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. – హైదరాబాద్(జనంసాక్షి):

## బీసీ రిజర్వేషన్లపై ఇతరులు లబ్ధికి యత్నించడం సరికాదు

కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయం

క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకం

ఖండించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్(జనంసాక్షి): ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు, క్యూ న్యూస్‌పై దాడి ఘటనపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ రెండింటినీ ఆయన ఖండించారు. కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయమన్నారు. క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకమని.. గన్‌మన్ కాల్పులపై విచారణ జరుగుతోందని తెలిపారు. కాంగ్రెస్ కృషి ఫలితమే బీసీ బిల్లు, రిజర్వేషన్లు అని మహేశ్‌కుమార్ చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై ఇతరులు లబ్ధికి యత్నించడం సమంజసం కాదన్నారు.

# మా నిధులు మాకే..



సింగరేణి నిధులను ఈ ప్రాంతంలోనే ఖర్చుపెట్టేలా చట్టం తెస్తాం:మంత్రి వివేక్

మందమర్రి(జనంసాక్షి): సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కోసం కేటాయించే డీఎంఎఫ్టీ నిధులు ఈ ప్రాంతంలోనే ఖర్చు చేసేలా త్వరలో చట్టం తీసుకువస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆయన బురదగూడెం, సుభాష్ నగర్ కాలనీలో పర్యటించారు. కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సింగరేణిలో నూతన గనుల ఏర్పాటు కోసం ముఖ్యమంత్రితో మాట్లాడినట్లు చెప్పారు. గడిచిన ఏడాది సింగరేణి సంస్థ రికార్డు స్థాయిలో లాభాలు ఆర్జించిందని పేర్కొన్నారు. జిల్లాలోని జైపూర్‌లో మరో 850 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. నైపుణ్య కేంద్రాల ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. సింగరేణి ఒప్పంద కార్మికులకు వేతనాల పెంపు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు

## సామన్య పౌరులపై పేలిన తూటాలు

గాజాలో నీటి కోసం ఎదురుచూస్తున్న వారిపై కాల్పులు.. 19 మంది మృతి

డెయిర్ అల్ బలా(జనంసాక్షి): గాజాలోని సామన్య పౌరులపై ఇజ్రాయెల్ దాడులు పాశవికంగా కొనసాగుతున్నాయి. తాగునీటి కోసం ఓ ప్రాంతంలో గుమిగూడిన జనంపై ఆదివారం జరిపిన దాడిలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు చిన్నారులు కూడా ఉన్నారు. ఈ మేరకు అక్కడి ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. తాజా మరణాలతో ఇప్పటి వరకు మృతి చెందిన వారి సంఖ్య 58 వేలు దాటిందని తెలిపాయి. ఇజ్రాయెల్ కాల్పుల విరమణ చేపట్టాలని ప్రతిగా తమ వద్ద బందీలుగా ఉన్న ఆ దేశ పౌరుల్ని విడుదల చేయాలన్న నిబంధనతో ఇరు వర్గాల

మిగతా 2లో..

దలైలామా వారసుడి ఎంపిక..

## భారత్‌తో బంధంలో సమస్యగా మారింది

భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం

న్యూఢిల్లీ(జనంసాక్షి): టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయం చైనా భారత్ సంబంధాలలో ఓ సమస్యగా మారిందని భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం పేర్కొంది. భారత్‌లోని కొందరు వ్యక్తులు దలైలామా వారసత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యు జింగ్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు.

మిగతా 9లో..



## అన్ని కోచ్‌లకు సీసీకెమెరాలు



రైల్వేశాఖ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ(జనంసాక్షి): ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తూ భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని రైలు బోగీల ద్వారాల వద్ద సీసీటీవీ కెమెరాలు అమర్చాలని నిర్ణయించింది. ఈ మేరకు రైల్వేశాఖ ఉన్నతాధికారి

మిగతా 2లో..

## ఓటరు జాబితాల సమగ్ర సవరణ ఇక దేశవ్యాప్తంగా ?

బిహార్ ఓటర్ల జాబితాలో బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్ దేశస్థులు..!




2లో

జనంసాక్షి www.janamsakshi.org
సోమవారం 14.07.2025

# తీన్మార్ మల్లన్న కార్యాలయంపై జాగృతి కార్యకర్తల దాడి



జర్నలిస్ట్ సంఘాలు, ప్రజా సంఘాలు ఈ దాడిని తీవ్రంగా ఖండిచాయి. మీడియా సంస్థలపై దాడులు చేయడం సరికాదని తీన్మార్ మల్లన్న అన్నారు. తీవ్రంగా స్పందించిన తీన్మార్ మల్లన్న క్యూ న్యూస్ కార్యాలయంపై తెలంగాణ జాగృతి సంస్థ కార్యకర్తలు దాడికి పాల్పడడం తెలిసిందే. దీనిపై తీన్మార్ మల్లన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత అనుచరుల దాడిలో తన చేతికి కూడా గాయమైందని వెల్లడించారు. తన గన్ మన్ నుంచి తుపాకీ లాక్కుని కాల్పులు జరిపేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఇటువంటి దాడులతో బీసీ ఉద్యమం ఆగిపోతుందనుకుంటే అది పొరపాటేనని అన్నారు. బీసీల సమస్యలపై తాము ప్రభుత్వంతో పోరాడుతుంటే కవితకు ఎందుకు భాధ అని మల్లన్న ప్రశ్నించారు. కుటుంబ సభ్యులు కేసీఆర్, కేటీఆర్ పై ఉన్న అసహనాన్ని కవిత తమపై ప్రదర్శిస్తామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ఇలాంటి దాడులకు పురిగొల్పిన కవిత ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అయినా, తాను ఇటువంటి



దాడులకు భయపడేది లేదని, మూడేళ్లలో మిమ్మల్ని రాజకీయంగా పాతాళానికి తొక్కడం ఖాయం అని హెచ్చరించారు. అంతకు ముందు, ఓ కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ... కవితను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు జాగృతి కార్యకర్తలను తీవ్ర ఆగ్రహానికి గురిచేసినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో వారు తీన్మార్ మల్లన్నకు చెందిన క్యూ న్యూస్ కార్యాలయంపై దాడికి దిగినట్టు సమాచారం ఇలాంటి చర్యలతో బీసీ ఉద్యమం ఆగిపోతుందనుకుంటే అది భ్రమేనని మల్లన్న చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.''ఉదయం 11.30 గంటల ప్రాంతంలో 30 మంది దాడికి పాల్పడ్డారు. మా గన్‌మెన్లు ఎంత నిలవరించినా వినకుండా లోపలికి వచ్చారు. కవిత అనుచరుల దాడిలో నా చేతికి గాయమైంది. నా గన్‌మెన్ నుంచి తుపాకీ లాక్కుని కాల్పులు జరిపేందుకు యత్నించారు. ఈ తరహా దాడులు చేసినంత మాత్రాన బీసీలు, అణగారిన వర్గాలను అధికారంలోకి తీసుకొచ్చేందుకు మేం చేసే ప్రయత్నం ఇసుమంత కూడా తగ్గదు. మరింత రెట్టించిన ఉత్సాహంతో ముందుకెళ్తాం. ఇలాంటి వాటికి నేను భయపడను. రాసి పెట్టుకోండి.. రానున్న మూడేళ్లలో మిమ్మల్ని రాజకీయంగా పాతాళానికి తొక్కే బాధ్యత మాది. బీసీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో మేం పోరాడుతున్నాం. ప్రభుత్వం మా సలహాలను స్వీకరిస్తోంది.. పొరపాట్లు జరిగితే సరిచేసుకుంటోంది. ఈ విషయంలో కవితకు ఎందుకు బాధ?ఉనికి కోసం అయితే కేసీఆర్‌ను అడగాలి. కేసీఆర్, కేటీఆర్‌పై ఉన్న ఫ్రస్ట్రేషన్ మాపై చూపిస్తామంటే కుదరదు. 10 ఏళ్లు ఈ రాష్ట్రాన్ని మీ కుటుంబం దోచుకుతిన్నది. ఇలాంటి దాడులతో మరింత దిగజారి ప్రజల్లో చులకన కావడం తప్ప ఇంకేమీ ఉండదు. సహచర ఎమ్మెల్సీపై దాడులకు ప్రేరేపించిన కవిత ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి. మా కార్యాలయంలో పడిన రక్తపు మరకల సాక్షిగా ప్రజాక్షేత్రంలోకి వెళ్తాం" అని తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు.

## మల్లన్నపై చర్యలు తీసుకోండి

ఉపయోగించి ఆయన్ను ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో మహిళలకు ప్రత్యేకమైన గౌరవం ఉంటుంది. బోనం ఎత్తుకున్న ఆడబిడ్డను అమ్మవారిలా చూసే సంస్కృతి మనది. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో మహిళలు రాజకీయాల్లోకి వస్తూ ప్రజా సమస్యలపై మాట్లాడుతున్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తులు పరుషపదజాలంతో విమర్శలు చేస్తే వచ్చేవాళ్లు కూడా వెనక్కి తగ్గే పరిస్థితి ఉంటుంది. ఉచ్ఛరించలేని దారుణమైన వ్యాఖ్యలను మల్లన్న చేశారు. ఆడబిడ్డలు రాజకీయాల్లోకి రావద్దా?ఏదైనా ఉంటే అంశం ప్రాతిపదికన మాట్లాడాలి తప్ప ఏం మాటలివి? దాదాపు ఏడాదిన్నరగా బీసీ సమస్యలపై తెలంగాణ జాగృతి తరఫున పోరాటం చేస్తున్నాం. ఏ రోజూ తీన్మార్ మల్లన్నను ఒక్క మాట కూడా అనలేదు. నన్ను ఆయన ఎందుకు అలా అన్నారో తెలియదు.తెలంగాణ ప్రజలు పరుష పదజాలాన్ని సహించరు. మల్లన్న చేసిన వ్యాఖ్యలకు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు జాగృతి కార్యకర్తలు వెళ్లారు. సామాన్యులపై కాల్పులు జరిపేంత క్రూరత్వం ఎందుకు?ఇది ప్రజాస్వామ్యం. దీనిలో అనేకమంది ప్రజల జీవితాలు ముడిపడి ఉన్నాయి. జాగృతి ఎన్నో కార్యక్రమాలు చేసింది.. అందులో బీసీ ఉద్యమం ఒకటి. ఇంకా చాలా కార్యక్రమాలు చేస్తాం. నాలాంటి వాళ్లను కోట్లాది మందిని తయారు చేస్తా. తక్షణమే తీన్మార్ మల్లన్నను సీఎం రేవంత్ అరెస్ట్ చేయించాలి. మల్లన్న చేసిన వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్‌ను కలుస్తాం" అని కవిత అన్నారు.

డీజీపీకి కవిత ఫిర్యాదు

తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై డీజీపీకి కవిత ఫిర్యాదు చేశారు. పెద్ద ఎత్తున జాగృతి కార్యకర్తలతో ఆమె డీజీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



## అన్ని కోచ్‌లకు సీసీకెమెరాలు..

ఒకరు వెల్లడించారు. రైల్వేశాఖ తీసుకున్న ఈ నిర్ణయం ప్రయాణికుల భద్రతను గణనీయంగా మెరుగుపరుస్తుందని, ప్రయాణికుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అరాచకాలకు పాల్పడుతున్న దుండగుల, వ్యవస్థీకృత ముఠాలను నిరోధించగలవని తెలిపారు. రైల్వే కోచ్‌లకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటును ప్రయోగాత్మకంగా ఇటీవల నార్తరన్ రైల్వే పరిధిలో చేపట్టారు. అక్కడ విజయవంతమవడంతో దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టూ, పలువురు ఉన్నతాధికారులు శనివారం సమీక్ష నిర్వహించినట్లు అధికారి వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న 74 వేల కోచ్‌లు, 15 వేల లోకో కోచ్‌లకు సీసీకెమెరాల ఏర్పాటు వైష్ణవ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది."ప్రతి రైల్వేకోచ్ ద్వారాల వద్ద డోమ్ ఆకృతిలో సీసీ కెమెరాలు ఉంటాయి. లోకో కోచ్‌లకు ద్వారాలతోపాటు ముందు, వెనుకతో కలిపి ఆరు సీసీకెమెరాలు అమరుస్తారు." అని రైల్వేశాఖ అధికారి వెల్లడించారు. 100 కిలోమీటర్ల వేగంతో వెళ్లినా అత్యంత నాణ్యతతో ఫుటేజీ వచ్చేలా జాగ్రత్తలు పాటించాలి అశ్వినీ వైష్ణవ్ అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. చీకటిలోనూ వీడియో క్వాలిటీ బాగుండేలా అధునాతన సీసీకెమెరాలను అమర్చాలని ఆయన దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. అందుకు అవసరమైతే కృత్రిమమేధని కూడా వినియోగించాలని కోరినట్లు తెలుస్తోంది.

## పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌కు అధ్యక్షపదవి..
# అవి వదంతులే..

**వార్తలను తీవ్రంగా ఖండించిన ప్రధానమంత్రి షహబాజ్ షరీఫ్**

**ఇస్లామాబాద్(జనంసాక్షి):** పాకిస్తాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీని గద్దె దింపేసి ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ ఆ పదవిని చేపట్టాలని భావిస్తున్నారంటూ వస్తున్న వార్తలను ప్రధానమంత్రి షహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు.అవన్నీ కేవలం వదంతులేనంటూ కొట్టిపారేశారు. జర్దారీ ఐదేళ్ల పూర్తి కాలం కొనసాగుతారన్నారు.'ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ దేశాధ్యక్ష పదవిపై ఎన్నడూ ఆసక్తి వ్యక్తం చేయలేదు. ప్రస్తుతానికి అటువంటి ప్రణాళిక కూడా ఏదీ లేదు'అని ఆయన స్పష్టం చేశారు. మునీర్, జర్దారీ మధ్య సానుకూల సంబంధాలున్నాయి. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి గౌరవముంది. పాకిస్తాన్ అభివృద్ధి, పురోగమనమే వీరిద్దరి లక్ష్యం కూడా'అని ప్రధాని వివరించారు.'జర్దారీ, మునీర్, షరీఫ్‌లే లక్ష్యంగా తప్పుడు జరుగుతోంది. దీని వెనుక విదేశీ శక్తులున్న సంగతి మాకు తెలుసు. జర్దారీ స్థానంలో ఆర్మీ చీఫ్ మునీర్ రానున్నారంటూ వస్తున్న వార్తలు పూర్తి అసత్యాలు. దీనిపై ఎలాంటి చర్చలు జరగలేదు. అటువంటి యోచన కూడా లేదు' అంటూ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి మొహ్సిన్ నక్వీ ఎక్స్‌లో చేసిన ప్రకటన అనంతరం ప్రధాని ఈ మేరకు వివరణ ఇవ్వడం విశేషం. ప్రధాని పదవిని షహబాజ్‌కు, అధ్యక్ష బాధ్యతలను జర్దారీకి అప్పగించేందుకు అధికార కూటమిలో గతేడాది ఒప్పందం కుదిరింది. ఆ మేరకు జర్దారీ ఐదేళ్ల కాలానికి దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

## ట్రంప్ యంత్రాంగానికి ఫెడరల్ కోర్టు షాక్

**కాలిఫోర్నియాలో వలసదారుల అరెస్టులు ఆపాలని ఆదేశాలు**

**లాస్ ఏంజెలెస్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వలసదారులను ఎక్కడపడితే అక్కడ ఆపి తనిఖీలు చేపట్టడం, అరెస్టులు చేయడం తక్షణమే ఆపేయాలని ఫెడరల్ జడ్జి ఒకరు ఆదేశాలు జారీ చేశారు.ప్రస్తుత ప్రభుత్వం దక్షిణ కాలిఫోర్నియా ప్రాంతంలోని హిస్పానిక్‌లు, లాటినోలను పథకం ప్రకారం వేధిస్తోందని గత వారం లాస్ ఏంజెలెస్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో వలసదారుల తరఫున పలు పిటిషన్లు దాఖలయ్యాయి.గుర్తింపు కార్డులు చూపినా ఇద్దరు అమెరికా పౌరులను మరో ముగ్గురు వలసదారులను ఎటువంటి వారెంట్లు లేకుండా అధికారులు నిర్బంధంలోకి తీసుకున్నారని ఆరోపించారు. కేవలం శరీరం రంగు ఆధారంగా అరెస్టులు చేయడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. విచారణ చేపట్టిన జడ్జి మామె ఈ ఫ్రిమ్‌పాంగ్ శుక్రవారం పలు ఆదేశాలను వెలువరించారు. లాస్ ఏంజెలెస్ సహా కాలిఫోర్నియాలోని ఏడు కౌంటీల పరిధిలో వలసదారుల అరెస్టులు, సోదాలను నిలిపివేయాలన్నారు. అంతేకాదు, వలసదారులను నిర్బంధించిన లాస్ ఏంజెలెస్ డిటెన్షన్ కేంద్రంలోకి అటార్నీ ప్రవేశించకుండా ఫెడరల్ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సైతం రద్దు చేశారు.

## ఇరాన్ అధ్యక్షుడి హత్యకు ఇజ్రాయెల్ యత్నం..

**ఇరాన్ ఆరోపణలు**

**టెహ్రాన్(జనంసాక్షి):**ఇటీవల ఇరాన్‌లోని అణ్వాయుధ స్థావరాలు, ముఖ్య నేతల నివాసాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. అయితే బీరుట్‌లో హెజ్‌బొల్లా నాయకుడు నస్రల్లా ను హత్య చేసిన విధంగానే ఇరాన్‌పై దాడుల సమయంలో ఇజ్రాయెల్..తమ దేశాధ్యక్షుడిని హత మార్చడానికి ప్రయత్నించిందని ఐఆర్‌జీసీ కు సంబంధించిన వార్తా సంస్థ పేర్కొంది. జూన్ 16న టెహ్రాన్‌లోని ఓ భవనంలో నిర్వహించిన ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సమావేశానికి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగర్ గాలిబాఫ్, న్యాయవ్యవస్థ చీఫ్ మొహ్సేని ఏజీ, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారని వార్తాసంస్థ తెలిపింది.ఉన్నతాధికారులు సమావేశంలో ఉన్న సమయంలో ఆ భవనంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడిందని వార్తాసంస్థ వెల్లడించింది. అందులోని వారు తప్పించుకునే వీలు లేకుండా భవనానికి ఉన్న ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్‌లను లక్ష్యంగా చేసుకొని.. ఆరు క్షిపణులను ప్రయోగించిందని ఆరోపించింది. దాడులతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పటికీ అధికారులు ముందుగానే సిద్ధం చేసుకున్న అత్యవసర హాచ్ ద్వారా తప్పించుకోగలిగారని తెలిపింది. అక్కడి నుంచి తప్పించుకుంటున్న సమయంలో ఇరాన్ అధ్యక్షుడు సహా పలువురికి గాయాలు అయినట్లు తెలిపింది.

## సామన్య పౌరులపై పేలిన తూటాలు

మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. అయితే, ఆ దిశగా పరోగతి సాధించేందుకు మాత్రం వారు ముందుకు రావడం లేదు.గత వారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా పర్యటనకు వెళ్లారు. అక్కడ ట్రంప్ యంత్రాంగంతో చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో కొత్త వివాదం తెరమీదకి వచ్చింది. గాజా స్ట్రిప్ నుంచి తమ బలగాలను వెనక్కి తీసుకునేందుకు ఇజ్రాయెల్ నిరాకరించింది. దక్షిణ గాజాలో తమ సైన్యాన్ని కొనసాగించాలని భావిస్తోంది. దీనిపై హమాస్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. తాత్కాలిక కాల్పుల విరమణ ముగిసిన తర్వాత ఇజ్రాయెల్ మళ్లీ యుద్ధాన్ని కొనసాగించాలని చూస్తోందని, అందుకే



బలగాల ఉపసంహరణకు అంగీకరించడం లేదని వాదిస్తోంది.మరోవైపు హమాస్ పూర్తిగా లొంగిపోయినప్పుడే యుద్ధానికి ముగింపు పలుకుతామని ఇజ్రాయెల్ తెగేసి చెబుతోంది. కానీ, హమాస్ అందుకు నిరాకరిస్తోంది. తమ వద్ద బందీలుగా ఉన్న 50 మందిలో సగం మంది మాత్రమే బతికి ఉన్నారని చెబుతోంది.

## మహిళా సాధికారత కోసం ఎంత దూరమైనా వెళ్తాం

ర్యాలలో వడ్డీ లేని రుణం చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆమ్ ఆద్మీ బీమా పథకం కింద మహిళా సంఘాలకు భద్రత, మహిళా సంఘాలకు రుణ సదుపాయం కల్పించి వారితో బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దెకు ఇప్పించినట్టు తెలిపారు. మొత్తం 600 బస్సులు ఇప్పించే కార్యక్రమంలో భాగంగా ఇప్పటికీ 150 బస్సులలో ఆర్టీసీకి అనుసంధానం చేసి లీజు మొత్తం కోటి రూపాయల చెక్కును ఇటీవల ఆర్టీసీ నుంచి మహిళా సంఘాలకు అందజేశామని డిప్యూటీ సీఎం తెలిపారు. మిగిలిన 450 బస్సులను త్వరలో ఆర్టీసీకి లీజుకు ఇప్పిస్తామని అన్నారు. మహిళా సంఘాలతో క్యాంటీన్లో, పెట్రోల్ బంకులు, ప్రతి ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకోవడానికి స్థలాలు ఇచ్చామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మైక్రో ఇండస్ట్రీస్ పెట్టుకొని మహిళలు వ్యాపారాలు చేసుకునే కార్యక్రమాలు చేపట్టినట్టు డిప్యూటీ సీఎం వివరించారు. సాధారణ ఎన్నికల ముందు ఆదిలాబాద్ జిల్లా కు ఏసిసి అధ్యక్షుడు ఖర్గే వచ్చినప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది మేము



అడిగిన పనులు చేయాలని జిల్లా ప్రజలు, కాంగ్రెస్ నాయకులు కోరిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు.సీఎం రేవంత్ రెడ్డి తో పాటు యావత్ క్యాబినెట్ ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లా అభివృద్ధికి దృష్టి సారిస్తామని తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమం తీసుకునే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపడతామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం తెలిపారు. ఆనాడు రాష్ట్రంలోని రాచరిక పాలనలో, రాష్ట్ర మొత్తం దోపిడీ జరుగుతుంటే టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎదిరించి ప్రజాస్వామ్యంతో కూడిన పాలనను తీసుకురావడంలో ఆదిలాబాద్ జిల్లా ప్రజల పాత్ర మరువలేనిది అన్నారు. ఎన్నికల ముందు పీపుల్స్ మార్చ్ పేరిట తాను పాదయాత్ర చేపట్టగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు తన అడుగులు అడుగు వేసిన జ్ఞాపకాలు ఇంకా పచ్చగా తేలి ఆడుతున్నాయి అన్నారు. నాటి పిసిసి అధ్యక్షుడిగా సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ పెట్టి ఆదిలాబాద్ జిల్లా నుంచి శంఖారావాన్ని పూరించగా, సీఎల్పీ నేతగా పీపుల్స్ మార్చ్ పాదయాత్రను ఆదిలాబాద్ నుంచి ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఏ ఏ వాగ్దానాలు చేశామో అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. గుట్ట నిండాలక్ష మంది పైగా ప్రజలు తరలిరావడం చూస్తుంటే ఆశ్చర్యమేస్తుంది, ప్రజల గుండెల్లో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు స్థానం పదిలం చేసుకున్నారని ఈ జన సందోహాన్ని చూస్తుంటే స్పష్టం అవుతుంది అన్నారు. ప్రేమ్ సాగర్ రావు నిండు నూరేళ్లు జీవించాలని వెనుకబడిన ప్రాంతమైన మంచిర్యాల జిల్లా అభివృద్ధికి వారి సేవలు అవసరమని డిప్యూటీ సీఎం తెలిపారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు 70 లక్షల రైతు కుటుంబాల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. అధికారులకి వచ్చినమూడు నెలల వ్యవధిలోనే 21 వేల కోట్లు రైతు రుణమాఫీ తెలిపారు. 93 లక్షల కుటుంబాలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నారు. రైతు సోదరులకు ఇన్సూరెన్స్, ప్రకృతి విపత్తుతో పంట నష్టం జరిగితే పరిహారం, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ తో ప్రజా ప్రభుత్వం అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు.రాష్ట్రంలోని 51 లక్షల కుటుంబాలకు 200 యూనిట్లు కొరకు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తున్నామని, ఇల్లు లేని పేదల కోసం ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నాం మొదటి సంవత్సరం రాష్ట్రంలో 4.50 లక్షల ఇల్లు 22, 500 కోట్లతో ఇందిరం నిర్మాణం మొదలు పెట్టామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 500 కే గ్యాస్ సిలిండర్, గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన షాది ముబారక్ వంటి సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాలకు అదనంగా 55 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. పేద విద్యార్థులకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో విద్యను బోధించేందుకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ స్థాపిస్తున్నాం, రైతులకు పెట్టుబడి సాయం, చదువుకున్న యువతకు ఉద్యోగాలు, ఉద్యోగాలు రాని వారికి స్వయం ఉపాధి పథకాలు తీసుకువస్తున్నట్టు తెలిపారు. గతంలో అటవీ అధికారులతో ఇబ్బందులు పడిన గిరిజనులు వారి భూములు సాగు చేసుకునేందుకు ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. ఈ పథకం కింద ఉచితంగా సోలార్ పంపుసెట్లు, స్ప్రింక్లర్లు, డ్రిప్పు, ఉద్యాన శాఖ ద్వారా ఉచితంగా అవకాడో వెదురు వంటి మొక్కలను పంపిణీ చేస్తామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం మనందరికీ రూపాయి రూపాయి పోగుచేసి ప్రజల కోసమే ఖర్చు పెడతామని తెలిపారు. తనకు మదిర నియోజకవర్గమైన తో మంచిర్యాల అంటే అంతే ప్రత్యేక స్థానం తన గుండెల్లో ఉంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

## నటుడు కోట శ్రీనివాస్‌రావు
# కన్నుమూత

సినీరంగ ప్రవేశం చేసిన కోటా 750కిపైగా చిత్రాల్లో నటించారు. తన 4 దశాబ్దాల సినీ ప్రయాణంలో విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా ఎన్నో విలక్షణ పాత్రలు పోషించారు. తొమ్మిది నది పురస్కారాలు అందుకున్న ఆయనను 2015లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం అందించింది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కోటా ప్రసాద్ ఉన్నారు. 2010 జూన్ 21న రోడ్డుప్రమాదంలో ప్రసాద్ మృతిచెందారు. కోటా మృతి పట్ల సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.1942 జులై 10న కృష్ణాజిల్లా కంకిపాడులో కోటా శ్రీనివాసరావు జన్మించారు. బాల్యం నుంచి నాటకాలంటే చాలా ఆసక్తి కనబడిరిచేవారు. 1978లో 'ప్రాణం ఖరీదు'తో సినీరంగంలోకి అరంగ్రేటం చేశారు. కోట శ్రీనివాసరావుకు దర్శక నిర్మాత క్రాంతికుమార్ తొలి అవకాశం ఇచ్చారు. తన నటన, డైలాగ్ డెలివరీతో విశేష గుర్తింపు తెచ్చుకున్నారు. ఒకే రకమైన పాత్రలకు పరిమితం కాకుండా, హాస్యం, విలనిజం, సెంటిమెంట్, పౌరాణికం ఇలా ఏ తరహా పాత్రనైనా తనదైన శైలిలో పండించారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళం భాషల్లోనూ పలు చిత్రాల్లో నటించారు. సినిమాల్లోకి రాకముందు స్టేట్‌బ్యాంకులో పనిచేశారు. సినిమాల్లోనే కాదు.. రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేసుకున్నారు. 1990లలో బీజేపీలో చేరిన ఆయన 1999-2004 వరకు విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా పనిచేశారు. వృద్ధాప్య సమస్యల కారణంగా ఇటీవల కాలంలో సినిమాలకు దూరంగా ఉంటున్నారు. 2023లో వచ్చిన 'సువర్ణ సుందరి' ఆయన చివరి చిత్రం. ప్రతిఘటన, గాయం, తీర్పు, లిటిల్ సోల్జర్స్, గణేష్, చిన్నా, ఆ నలుగురు, పెళ్లైన కొత్తలో చిత్రాలకు గాను నంది అవార్డులు అందుకున్నారు.

కోటను ఓవర్‌నైట్‌లో స్టార్‌ను చేసిన సినిమా ఏదంటే..

కెరీర్ మొదట్లో స్టేజీపై నాటకాలు ప్రదర్శించే ఈయన.. అంచలంచెలుగా ఎదుగుతూ తెలుగు సినిమా విలనిజానికి కొత్త



భాష్యాన్ని నేర్పాడు. అయితే ప్రారంభంలో సినిమాల అవకాశాల కోసం అందరిలాగే కోట శ్రీనివాసారావు కూడా కష్టపడేవాడు. ప్రాణం ఖరీదు, కుక్క అనే సినిమాల్లో చిన్ని చిన్న వేషాలతో కెరీర్ మొదలుపెట్టి, వందేమాతరం సినిమాలో మంచి పాత్రను సంపాదించాడు. అయితే ఇవన్నీ కాకుండా తను సినీ పరిశ్రమలో పాతుకపోవడానికి కారణమైన సినిమా గురించి కోట ఓ సందర్భంలో చెప్పారు. నా కెరీర్‌కు కీలకమైన సినిమా ప్రతిఘటన . ఇది నా కెరీర్‌ను స్టాండ్ చేసుకోవడానికి ఉపయోగపడింది. వందేమాతరం సినిమా చేస్తున్నప్పుడు టి.కృష్ణ నాకు ఈ సినిమా గురించి చెప్పాడు. అయితే మొదట కథ చెప్పినప్పుడు నా పాత్ర ఇందులో కూడా చిన్నదే. పార్టీ అధ్యక్షుడుగా ఒకే సన్నివేశం రాశారు నా కోసం. సోదరి సోదరిమణులారా అని ప్రసగించాల్సిన సీన్ అది. ఇక ఆ డైలాగ్‌ను నా శైలిలో తెలంగాణ యాసలో చెప్పేసరికి టి.కృష్ణ అది బాగా నచ్చింది. అప్పుడు అక్కడ వున్న రచయిత పీఎల్ నారాయణకు చెప్పి నా మీద అదే శైలిలో మరో నాలుగైదు సీన్లు రాయమని చెప్పారు టి.కృష్ణ. రాత్రంతా కూర్చుని నా కోసం ఎనిమిది సన్నివేశాలు ప్రిపేర్ చేశారు. షూటింగ్ పూర్తయింది.. సినిమా విడుదలైంది. ఇక ఈ సినిమా తెచ్చిన పేరు గురించి అందిరికి తెలిసిందే. ఓవర్‌నైట్‌లో ప్రతిఘటన సినిమా నన్ను స్టార్‌ను చేసింది. ఆ తరువాత వెనుతిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు' అని చెప్పుకొచ్చారు.ప్రముఖ నటుడు కోట



శ్రీనివాసరావు మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. విభిన్న పాత్రలను పోషించి, ప్రేక్షక హృదయాల్లో తన స్థానాన్ని పదిలపరుచుకున్న విలక్షణ వెండితెర నటుడు కోట శ్రీనివాసరావు అని అన్నారు. వారి మరణంతో సినీమా రంగం ఒక గొప్ప నటున్ని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. స్వర్గస్తులైన కోట శ్రీనివాసరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కేసీఆర్ ప్రార్థించారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కోట శ్రీనివాసరావుకు కన్నీటి వీడ్కోలుసినీ ప్రముఖులు, అభిమానుల కన్నీటి వీడ్కోలు మధ్య ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు అంత్యక్రియలు ముగిశాయి. ఫిల్మ్‌నగర్‌లోని ఆయన నివాసం నుంచి మహాప్రస్థానం వరకు అంతిమ యాత్ర జరిగింది.ఇందులో అభిమానులు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యుల సమక్షంలో పెద్ద మనవడు శ్రీనివాస్ అంతిమ సంస్కారాలు చేశారు. తన విలక్షణ నటనతో తెలుగు సినీ ప్రియులకు చేరువైన కోట శ్రీనివాసరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిందే. ఈ రోజు ఉదయం ఫిల్మ్‌నగర్‌లోని తన నివాసంలో ఆయన కన్నుమూశారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు కోట శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

**ప్రధాని మోదీ సంతాపం**

ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల ప్రధాని నరేంద్రమోదీ సంతాపం తెలిపారు. ఆయన మరణం బాధాకరమన్నారు.ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. "కోట శ్రీనివాసరావు గారి మరణం బాధాకరం. సినిమా పట్ల ఆయనకు ఉన్న ప్రతిభ, బహుముఖ ప్రజ్ఞతో ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోతారు. తన అద్భుతమైన ప్రదర్శనలతో కొన్ని తరాల ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సామాజిక సేవలో ముందు ఉండటమే కాకుండా పేదల అభ్యున్నతి కోసం కృషి చేశారు. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఓం శాంతి" అని ప్రధాని మోదీ పోస్ట్ పెట్టారు.

## ఓటరు జాబితాల సమగ్ర సవరణ ఇక దేశవ్యాప్తంగా ?

**బిహార్ ఓటర్ల జాబితాలో బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్ దేశస్థులు..!**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టే రాజ్యాంగబద్ధమైన అధికారం ఎన్నికల సంఘానికి ఉందని సుప్రీం కోర్టు ఇటీవల స్పష్టం చేసిన విషయం తెలిసిందే.ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగానూ ఈ కసరత్తు చేపట్టేందుకు ఎన్నికల సంఘం సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బిహార్‌లో మాదిరే.. వచ్చే నెలలో దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియ నిర్వహించేందుకు స్థానిక ఎన్నికల యంత్రాంగాన్ని ఈసీ సమాయాత్తం చేస్తున్నట్లు సమాచారం.దేశంలోని చాలావరకు రాష్ట్రాలు 2002-04 మధ్యకాలంలో ఓటరు జాబితాల సమగ్ర సవరణ చేపట్టాయి. ఈ క్రమంలోనే తాజాగా కొన్ని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులు (సీఈవో) తమ రాష్ట్రాల్లో చివరి సారి సమగ్ర సవరణ చేపట్టిన అనంతరం ప్రచురించిన ఓటర్ల జాబితాను అందుబాటులోకి ఉంచుతున్నారు. దేశ రాజధాని దిల్లీలో చివరి సారి 2008లో ఈ ప్రక్రియ నిర్వహించగా.. ఆ ఓటర్ల జాబితాను సీఈవో వెబ్‌సైట్‌లో ఉంచారు. ఉత్తరాఖండ్‌లో 2006లో చేపట్టగా.. ఆ ఏడాది లిస్ట్ కూడా రాష్ట్ర సీఈవో వెబ్‌సైట్‌లో కనిపిస్తోంది.బిహార్ ఓటరు జాబితాల సవరణ వ్యవహారం ఈ నెల 28న సుప్రీం కోర్టులో మరోసారి విచారణకు రానుంది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా ఈ కసరత్తు నిర్వహణపై ఎన్నికల సంఘం తుది నిర్ణయం తీసుకుంటుందని ఓ అధికారి వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలను సమగ్రంగా సమీక్షించి.. విదేశీ అక్రమ వలసదారులను తొలగించనున్నట్లు ఈసీ గతంలోనే ప్రకటించింది. బంగ్లాదేశ్, మయన్మార్ సహా విదేశీ అక్రమ వలసదారులపై వివిధ రాష్ట్రాల్లో కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ ప్రక్రియ ప్రాధాన్యం సంతరించుకుంది..

**బిహార్ ఓటర్ల జాబితాలో బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్ దేశస్థులు..!**

బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ప్రారంభించిన ఓటర్ల జాబితా సవరణ రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే.రాష్ట్రంలోని ఓటర్ల జాబితాలో అనేక మంది బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్ దేశస్థులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అధికార వర్గాలు తెలిపినట్లు పలు ఆంగ్ల మీడియాల్లో కథనాలు వెలువడుతున్నాయి కథనాల ప్రకారం.. ఈసీ చేస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ సర్వేలో బంగ్లా, నేపాల్, మయన్మార్ దేశాలకు చెందిన అనేక మంది ప్రస్తుతం రాష్ట్రంలో నివాసముంటున్నారని తేలింది. వీరంతా ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు వంటి వాటిని అక్రమ మార్గాల ద్వారా పొందినట్లు తెలుస్తోంది. సర్వే కోసం వెళ్లే క్షేత్ర స్థాయి అధికారులు ఇలాంటి వారిని అనేక మందిని గుర్తించినట్లు సమాచారం. వీటన్నింటినీ ఆగస్టు 1 నుంచి పరిశీలిస్తామని అధికార వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత అనర్హులను జాబితా నుంచి తొలగిస్తామని వెల్లడించాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటరు జాబితా సవరణ చేయడం రాష్ట్రంలో తీవ్ర చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే.

# శాంతి సామరస్యతే గెలుస్తాయి





### మంత్రి సీతక్క

### గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ స్వర్ణోత్సవాలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఎప్పటికైనా శాంతి సామరస్యతే గెలుస్తాయని మంత్రి సీతక్క అన్నారు. గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ స్వర్ణోత్సవాల సందర్భంగా గాంధీ భవన్ లో మహాత్మా గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు - స్వదేశీ మేళ లో భాగంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాలకు మంత్రి సీతక్క పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ స్వర్ణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఏర్పాటు చేసి 50 సంవత్సరములు పూర్తయిందని, ఈ సందర్భంగా మహాత్మా గాంధీ ఆలోచన విధానాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. 1500 గాంధీ విగ్రహాలను ఏర్పాటు చేసి వారి త్యాగాన్ని, ఆలోచన విధానాన్ని దేశానికి సమాజానికి గుర్తు చేస్తున్నారన్నారు. ఎప్పటికైనా భారతదేశానికి గాంధీ సిద్ధాంతమే శ్రీరామరక్ష అని, శాంతియుత మార్గంలోనే మనకు విజయం వరిస్తోందని తెలిపారు. గాంధీ బాటలోనే మనమంతా నడిచి నియంతలను దుర్మార్గులను తరిమి కొట్టామని, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నాయకత్వంలో గాంధీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గారి ఆలోచన విధానాన్ని గ్రామ గ్రామానికి తీసుకెళ్తున్నామన్నారు. అందులో భాగంగా జై బాపూ, జై భీమ, జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మహనీయుల దారిలోనే నడిచి ప్రజలకు మేలు చేస్తామని, ఎప్పటికైనా శాంతి సామరస్యతే గెలుస్తాయని తెలిపారు.

# కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారి శక్తి పీఠం దర్శనం

### ప్రత్యేక ప్యాకేజీ టూర్ ప్రకటించిన ఆర్టీసీ




సుల్తాన్ బజార్, జూలై 13 : కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారి శక్తి పీఠం దర్శనార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల సౌకర్యం కోసం ప్రత్యేక టూర్ ప్యాకేజీని తీసుకువస్తుందని హైదరాబాద్ డిపో1 మేనేజర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఈ నెల 18న సాయంత్రం 5 గంటలకు ఎంజీబీఎస్ నుండి సూపర్ లగ్జరీ బస్సు బయల్దేరుతుందని ఆయన వివరించారు. ఈ సర్వీస్ మొదటగా గానుగపూర్‌లో ఉన్న శ్రీ దత్తాత్రేయ స్వామి దర్శనం ముగించుకొని 19న సాయంత్రానికి కొల్హాపూర్ చేరుకుటుందని తెలిపారు. మహాలక్ష్మి శక్తి పీఠం దర్శన అనంతరం పండరీపూర్‌కు చేరుకుంటుందన్నారు . 20వ తేదీన శ్రీ విఠలేశ్వర స్వామి దర్శన అనంతరం సాయంత్రానికి తుల్జాపూర్ చేరుకుంటుంది. భవాని మాత దర్శన అనంతరం 21వ తేదీన తెల్లవారుజామున 4 గంటలకు ఎంజీబీఎస్ చేరుకుంటుందన్నారు. కొల్హాపూర్ మహాలక్ష్మి దర్శనానికి వెళ్ళదలచిన ప్రయాణికులు ఈ సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ముందస్తు రిజర్వేషన్ ఆన్‌లైన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. సమీపంలోని బుకింగ్ ఏజెంట్ దగ్గర కూడా టికెట్స్ బుక్ చేసుకోవచ్చని అన్నారు. ఈ సర్వీస్ నెంబర్ 95595 కాగా, ఒక్కోక్కరికి టికెట్ ధర రూ. 3 వేలుగా నిర్ణయించడం జరిగిందని ఆయన వివరించారు.

# ప్రభుత్వ హాస్టళ్లలో సీట్లు దొరక్క బీసీ విద్యార్థుల ఇక్కట్లు

### సీఎంకు ఆర్.కృష్ణయ్య లేఖ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్‌లో సహా జిల్లాల్లోని బీసీ హాస్టళ్లలో సీట్లు లభించక బీసీ విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. వెంటనే ప్రభుత్వం 20 శాతం సీట్లను పెంచాలని, కొత్తగా 100 బీసీ హాస్టల్స్‌ను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా హాస్టళ్లు మంజూరు చేసి బీసి విద్యార్థులను ఆదుకోవడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి లేఖ రాశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో హాస్టల్ సీట్లు లభించక విద్యార్థులు కాచిగూడ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లలో నిద్రపోతున్నారని, అక్కడే స్నానాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కమిషన్ కార్యాలయం నిర్లక్ష్యం మూలంగా విద్యార్థుల జీవితాలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అధికారులు సమస్య తీవ్రతను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం లేదని, మహబూబ్ నగర్, నల్గొండ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మెదక్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు పెట్టుకున్నారని తెలిపారు. సీట్లు రాక విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారని, ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని ప్రస్తుతం కొనసాగుతున్న హాస్టళ్లల్లో 20 శాతం సీట్లు పెంచాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు.

# హైడ్రా జిల్లాలకు విస్తరింపజేసి అమలు చేయండి

### తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు నంద్యాల వెంకట్ గౌడ్



**నర్సంపేట జూలై13( జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో నాటి కాకతీయ రాజులు ఆనాటి పరిపాల కనుగుణంగా ఎత్తైన కొండలను గుట్టలను మలిచి గొల్ల కట్టు చెరువులుగా నిర్మాణం చేశారని కాకతీయ రాజులు ఆనాటి ఇంజనీరింగ్ విధానం రాతి కట్టడాలు గొలుసు కొట్టడానికి 850 సంవత్సరాలు అయినా కూడా చెక్కుచెదరకుండా తెలంగాణ రాష్ట్రంలో రామప్ప పాకాల మరియు ఇతర జిల్లాలలో వారు నిర్మాణం చేసినటువంటి గొలుసు కట్టు చెరువులు ఇప్పటికి కూడా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు రైతులకు త్రాగునీరు సాగునీరు అందిస్తున్నాయని వారి తర్వాత ఏర్పడుతున్నటువంటి ప్రభుత్వాలు బ్రిటిష్ పరిపాలన నైజం పరిపాలనలో కూడా ప్రజల అవసరాల కోసం నిర్మాణం చేశారని ముఖ్యంగా కాకతీయులత నాటి నిర్మాణం చేసినటువంటి చెరువులే ఇప్పటి ప్రజలకు జీవనాధారంని వాటిని కొన్ని వందల సంవత్సరాలు కనుక రాష్ట్ర మొత్తం మీద నాటి చెరువులో కుంటలు ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమైనాయని వాటి స్థానంలో నేటి ప్రభుత్వం హైడ్రా పేరుతో గొప్ప కార్యక్రమం చేపట్టిందని ఇట్టి కార్యక్రమాన్ని కొన్ని వర్గాలు దూరం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాయని హైడ్రా అనేది తెలంగాణకి తప్పనిసరి అవసరమని లేకుంటే నాటి పాలకులు నిర్మాణం చేసినటువంటి చెరువులు కుంటలు ప్రభుత్వ స్థలాలు కొన్ని వందల వేల ఎకరాలు అన్యాక్రాంతమైనయని పై విషయాలు గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తరించి కుంటలు చెరువులు ప్రభుత్వ స్థలాలు పాఠశాల స్థలాలు స్మశానవాటికలు చెరువు అనుకోనున్నటువంటి కాలు స్థలాలు అన్యక్రాంత మైతున్నాయని కావున పై అంశాలను ప్రజలందరూ పరిగణలోకి తీసుకొని రానున్న రేపటి తరానికి ముందు తరాలు అందించిన సంపదను తిరిగి ఇవ్వాలంటే అన్యాక్రాంతమైన అన్యాక్రాంతం అవుతున్న వాటిని రక్షించి భావితరాలకు అందించాలని హైడ్రాను తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించి ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్ లో అడ్రస్ స్పెషల్ ఫోర్స్ ఏర్పాటు చేసి వారసత్వ సంపదలను కాపాడాలని ప్రభుత్వాన్ని హైడ్రా ఇంకా ముందుకు తీసుకుపోవాలని హైడ్రాకి తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని హైడ్రా మున్ముందు మంచి కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్నన పొందాలని హైడ్రా కమిషనర్ రాష్ట్ర ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం ఇతర పార్టీలు మద్దతు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక తెలియజేస్తుంది

# ఏఐఎస్ఎఫ్ నాయకులపై బీజేపీ, సంఘ్ పరివార్ దాడులను ఖండించాలి

### దాడికి యత్నించిన బీజేవైఎం దుండగులను అరెస్ట్ చేయాలి

### ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** నాగోల్, బండ్లగూడ లోని నవ చేతన విజ్ఞాన కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ శిక్షణా తరగతుల సందర్భంగా పాలస్తీనా పై ఇజ్రాయెల్,అమెరికా చేస్తున్న మారణకాండను ఆపాలని డిమాండ్ చేస్తూ నవ చేతన విజ్ఞాన కేంద్రం రోడ్డు ముందు నిరసన కార్యక్రమం చేపడితే, దుష్ట బీజేపీ దాని అనుబంధ సంఘం అయిన బీజేవైఎం దుండగులు అక్రమంగా,దుర్మార్గంగా ఏఐఎస్ఎఫ్ నాయకులను నిరసన చేయకుండా అడ్డుకోవడం అప్రజా స్వామికమని, ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకున్న సంఘ్ పరివార్ దుండగులను అరెస్ట్ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర లు మాట్లాడుతూ బీజేపీ దాని అనుబంధ సంఘాలు నీచ పన్నాగాలకు తెరలేపారని ధ్వజమెత్తారు. ప్రపంచ శాంతిని కోరుకునే కమ్యూనిస్టు పార్టీ సంఘాలపై విషాన్ని వెదజల్లి ఇబ్బందులకు గురిచేయాలని, ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని అమలుచేయాలనే నీచ సంస్కృతికి ఆజ్యం పోస్తున్నదని వారు ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యయుతంగా నిరసన చేసే హక్కును అడ్డుకోవడం బీజేపీ అజెండానా అని వారు ప్రశ్నించారు. దాడులకు పాల్పడితే తాము చూస్తూ ఊరుకునేది లేదని,తాము కూడా దాడులకు పాల్పడే మనో ధైర్యం ఉందని, కానీ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు గుర్తొస్తున్నాయని, అందుకే సంయమనం పాటిస్తున్నామని వారు అన్నారు. దాడికి యత్నించిన బీజేవైఎం నేతలను గుర్తించి పోలీసులు తక్షణమే అరెస్ట్ చేయాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు.

# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

### నకిలీ పత్తి విత్తన వ్యాపారిపై పి. డి యాక్ట్ కేసు నమోదు

### కొమరంభీం ఎస్పీ కంతిలాల్ పాటిల్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో జులై 13 ( జనం సాక్షి) :** జిల్లాలో చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను ఉపేక్షించలేదని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పోలీసు అధికారి కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఆదివారం మీడియా ప్రకటన జారీ చేశారు. జిల్లాలో గత కొంతకాలంగా యదేచ్ఛగా నకిలీ పత్తి విత్తన వ్యాపారం నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గోరంట్ల సురేష్ బాబు పై పి.డి. యాక్ట్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎలాంటి చట్ట విరుద్ధ, అసాంఘిక, సైబర్ నేరాలకు , అనుమతి లేని గొలుసు వ్యాపారాలు నిర్వహించ వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు హెచ్చరించారు. జిల్లాల గల పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేకదిగా వేసి ఉంచినట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ప్రజలకు ఇబ్బంది కలిగించే, నష్టపరిచే కార్యకర్తలకు పాలు పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, అవసరమైతే డయల్ 100 కు కాల్ చేసి తెలపాలని కోరారు.

# అమ్మవారికి బోనం సమర్పించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ, మంకాళ, ఇమామ్‌గూడ తదితర ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించిన మహంకాళి అమ్మవారి బోనాల జాతరల్లో మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి భక్తులతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా స్థానికులతో మమేకమై సంబరాల్లో పాల్గొన్న ఆమె, తెలంగాణ సాంస్కృతిక విలువలకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోనాల ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బోనాల ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. దేశ విదేశాలలో సైతం బోనాల జాతర జరుపుకుంటున్నారంటే అందుకు తెలంగాణ ఉద్యమమే కారణమన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బోనాల జాతర తెలంగాణలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో తెలంగాణ ప్రజలను చల్లగా చూడాలని ఆమె వేడుకున్నారు. పాడిపంటలతో తెలంగాణ సుభిక్షంగా ఉండే విధంగా అమ్మవారు చూడాలని ఎమ్మెల్యే అన్నారు.

# 1975 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక..

### అందరూ రిటైర్డ్ ఉద్యోగులే




**హైదరాబాద్ (జనంసాక్షి) :** గోషామహల్ ప్రభుత్వ పాఠశాల 1975వ బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులలో ఒకరైన పదవి విరమణ పొందిన అదనపు ఎస్పి కెఎం మధు నివాసంలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు తమ పాఠశాల స్మృతులను నెమరు వేసుకున్నారు. ఇందులో అత్యధికులు పదవి విరమణ పొందిన వారు కావడంతో వారు తమ ఉద్యోగ బాధ్యతలు ఇతరత్రా వాటిపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా కేఎం మధు మాట్లాడుతూ 50 ఏళ్ల తర్వాత పలు విభాగాల్లో పదవి విరమణ పొందిన ఆనాటి పాత మిత్రులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 1975 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులం అత్యధికలం ఇక్కడ సమావేశం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ విజయ్ మృతి భారత విప్లవోద్యమానికే తీరనిలోటు

### సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం సదానందం





**హైదరాబాద్ (జనంసాక్షి) :** యుసిసిఆర్ఐ(యం.యల్)ముఖ్య (రాష్ట్ర) నాయకులు కామ్రేడ్ శిష్టా విజయ్(శర్మ)74 మృతి భారత విప్లవద్యమానికే తీరని లోటు అని సిపిఐ(మాస్ లైన్) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం సదానందం ఆదివారం రోజు పంపిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మృతి కి సంతాపాన్ని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చాలాకాలంగా కిడ్నీ వ్యాదితో గత కొద్ది రోజులుగా డయాల్సి స్ తో బాదపడుతూ 2025, జూలై-12, రాత్రి 9 గంటలకు తన చివరి శ్వాస నొదిలారని గుర్తు చేశారు. ఎందరో వృత్తి విప్లవకారులు గా తీర్చి దిద్దిన ఫలితంగా నేడు తను కూడ విప్లవ రాజ కీయాల్లో కొనసాగడానికి కారణం అయ్యారని అన్నారు. తనకు ఆయన తన మొదటి రాజకీయ గురువుగా గడ్డం సదానందం ప్రకటించారు. సిద్ధాంత రాజకీయ బోదనలు, ఆయన నిర్మాణ కృషి, విప్లవ ఆకాంక్ష, భారత జనతా ప్రజా తంత్ర విప్లవానికై ఆయన త్యాగం హిమాలయాల కంటే ఉన్నత మైనదని కొనియాడారు. విజయ్ సార్ విప్లవ కృషికి రెడ్ సెల్యూట్, లాలాసలాం తెలి య జేస్తున్నామని అన్నారు. ఆయన బోధించిన విప్లవ నైతిక విలువలను జీవిత కాలమంతా పాటిస్తామని ఈ సందర్భంగా ప్రతినబూనారు. అది కామ్రేడ్ విజయ్ కి తను అందించే వినమ్ర అశ్రు నివాళి అని తెలియజేస్తూ బావోద్వే గానికి గురయ్యారు. తన 16వ యేట (1990) నుండి 2017 వరకు తల్లి తండ్రులనూ, కుటుంబాలను మరిపించిన విజయ్ సార్ లాంటి పీడిత వర్గాల ప్రతినిధి ఇక లేరని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని వెల్లడించారు. మార్క్సిజం- లెనినిజం-మావో ఆలోచనా విధానంను బోదిం చి, దానిని భారత నిర్దిష్ట పరి స్థితులకు ఎలా అప్లై చేసు కోవాలో, పార్టీ నిర్మాణం, ఐక్య సంఘటణ, ఎత్తుగడలను రంగరించి పోసి, వివిధ రంగాల ప్రజలను ఎలా ఆర్గనైజ్ చేయా లో ముఖ్యంగా కార్మిక వర్గంలో ఎలా పని చేయాలో, బలపం పట్టి నేర్పించిన తమ విప్లవ గురువు అస్తమించాడని తెలిసాక జీర్ణం చేసుకోవడానికి కష్టంగా ఉందని సదానందం తన మనోవేదనను, బాదను పత్రిక ముఖంగా తెలియ జేశారు. ఆయన ఆశయాల సాధనకై చివరికంటా కృషి సల్పుతామని, అదే కామ్రేడ్ విజయ్ తమ నుండి కోరు కున్నారని గుర్తుచేశారు. దాన్ని నిజాయితీగా అమలు జరుప టమే తమ ముందున్న కర్తవ్యం అని,సూర్యచంద్రులు ఉన్నంత వరకూ ఈ సృష్టి నడిచినంత వరకు, పీడిత తాడిత ప్రజా నీకానికి ముఖ్యంగా కార్మిక వర్గానికి వేగుచుక్కై దారి చూపుతాయని కొనియాడారు. బ్రాహ్మణోత్తముల కడుపున జన్మించి, రాడికల్ హ్యూమని స్ట్ గా మారి, అనంతరం కమ్యూనిస్టు విప్లవ కారుడిగా మారిన కామ్రేడ్ ఎస్.వి.ఎస్. తమ్ముడిగా ఆయన ద్వారా మహత్తర తెలంగాణ ప్రజల సాయుధ పోరాటం (1946 -51) కు నాయకత్వం వహిం చిన భారత విప్లవోద్యమ నాయకులు అమరులు కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వ రరావు (డివి), సహచర కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి (టి.యన్)ల రాజకీయాలతో ప్రేరణ పొందిన విజయ్ సార్, యుసిసిఆర్ఐ (యం.యల్) నాయకుడు కామ్రేడ్ బాస్కర్ అయ్యర్ తో కలిసి, కేంద్ర ప్రభుత్వ ఎన్.ఎఫ్.సి కొలువు ను విడిచిపెట్టి, కమ్యునిస్టు విప్లవ జీవితాన్ని ఎంచుకుని సమ సమాజ స్థాపనకై,వృత్తి విప్లవకారుడిగా మారాడని అన్నారు. డివి- టియన్ లు మరణించిన జూలై మాసం లోనే, అదీకూడా జూలై 12 నే తన చివరి శ్వాస నొందారని గుర్తుచేశారు. రహస్య జీవితం గడుపుతున్న విజయ్ బ్రాహ్మణోత్తముడని, ఆయన తన బ్రాహ్మణీయ బావజాలంలోని అంటరాని తనం, అస్పృశ్యతలను ఏవగించుకొని, ఆదిపత్యపు, విషపూరిత, దోపిడీ పూరిత, మోసపూరిత దుర్మార్గాలపై చివరికంటా పోరాడి, స్త్రీలు పురుషులు మనుషులందరూ సమానమని చాటిన గొప్ప నాయకుడని అన్నారు. అయన ఒక కరుడు గట్టిన కమ్యునిస్టు విప్లవ కారుడిగా, కఠినమైన కమ్యూనిస్టు విప్లవ జీవన విదానాన్ని ఆచరించి, ఎందరికో ఆదర్శంగా నిలిచార ని కొనియాడారు. కామ్రేడ్ విజయ్ ఎన్నో నిర్భం దాలను, ఆటుపోట్లను, చిత్ర హింసలను బరించి, చావు అంచలదాక వెళ్ళి వచ్చారని, విప్లవం పట్ల గల అకాంక్షా దీక్ష యే అతన్ని మామూలుగా మార్చాయని, అది అయన విప్లవ రాజకీయ సిద్ధాంత బలమేనని స్పష్టం చేశారు. ఆయన విడిచి వెళ్ళిన ఆశ యాలను తుదికంతా కొనసాగి స్తామని తెలియజేస్తూ గడ్డం సదానందం విప్లవ జోహార్లు అర్పించారు. ఆదివారం మద్యాహ్నం 1:30 గంటలకు నాగోల్ బండ్లగూడ కరెంట్ స్మశాన వాటికలో కామ్రేడ్ విజయ్ గారి అంత్య క్రియలు అమరవీరుల ఆశయాలను కొనస్తాం,అమర్ హై కామ్రేడ్ విజయ్ సార్ అనే విప్లవ నినాదాల హోరుతో ఘణంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పార్టీ,వివిధ ప్రజా సంఘాల నాయకులు కుటుంబ సభ్యులు బంధు మిత్రులు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
14 జూలై 2025
తెలంగాణ

# పోషక ఆహార లోపం.. మానవాళికి శాపం



ఇప్పుడు ఎక్కడ చూసినా కూడా నాసిరకం పదార్థాలు, వస్తువులు కనిపిస్తున్నాయి.తినే పదార్థాలను కూడా కల్తీ చేస్తున్నారు. నాణ్యమైన, మేలు రకాలైనటువంటి పదార్థాలు కానీ, వంగడాలు కానీ మనకు బయట దొరకడం లేదు. పండించే పంటలలో కూడా దేశవాళి కంటే హైబ్రిడ్ రకాలను పండిస్తున్నారు.ఎక్కువ దిగుబడి కోసం అనేక పెస్టిసైడ్స్‌ను పిచికారి చేస్తున్నారు.వీటిని తీసుకోవడం ద్వారా కూడా పిల్లలనుండి మొదలుకొని పెద్దల వరకు అనేక పోషకాహార లోపాలు కనిపిస్తున్నాయి. మనం పండించే పంటలు, పదార్థాలను తీసుకోవడం తగ్గించిన మాట అటు ఉంచితే ఫాస్ట్ ఫుడ్ పదార్థాలకు, బయట హొటల్‌లు బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో దొరికే పదార్థాలకు అలవాటు పడి ఎటువంటి పోషక విలువలు లేనటువంటి పదార్థాలను మనం రోజువారి జీవితంలో తింటు న్నాం. మనం తినడమే గాక పిల్లలకు కూడా వాటినే అలవాటు చేస్తున్నాం. దీని ద్వారా అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. పిల్లల పెరుగుదల అంతర్జాతీయంగా జనాభాలో పోషకాహార స్థితి మరియు ఆరోగ్యానికి ముఖ్యమైన సూచికగా గుర్తించబడింది. తక్కువ ఎత్తు ఉన్న పిల్లల శాతం అనగా తక్కువ వయస్సు గల వారు పుట్టినప్పటి నుండి మరియు పుట్టుకకు ముందు కూడా పోషకాహార లోపం మరియు అంటువ్యాధుల యొక్క సంచిత ప్రభావాలను ప్రతిబింబిస్తుంది.అందువల్ల ఈ కొలత పేద పర్యావ రణ పరిస్థితులకు సూచనగా లేదా పిల్లల ఎదుగుదల సంభావ్యత యొక్క దీర్ఘకాలిక పరిమితిగా అర్థం చేసుకోవచ్చు.వయస్సుకి తగ్గ బరువు లేని పిల్లల శాతం ఎక్కువ గా వుంది.ఇది తీవ్రమైన బరువు తగ్గడం, కుంగిపోవడం వంటి వాటిని సూచిస్తుంది.అందువల్ల, తక్కువ బరువు అనేది ఒక మిశ్రమ సూచిక, దానిని అర్థం చేసుకో వడం కష్టం. తల్లిదండ్రులు తమ వంతు కృషి చేసినప్పటికీ, పిల్లలు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పోషకాహార లోపాలతో బాధపడు తున్నారు. చాలామంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. పేదవారిలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. పోషకాహార లోపంతో ఉన్న మహిళలకు పుట్టే పిల్లలు కూడా బలహీనంగానే ఉంటున్నారు.దీనికి కారణం మహిళలకు సరైన పోషకాహారం అందకపోవడమేనని నిపుణులు భావిస్తున్నారు. వలసలు ఈ పరిస్థితికి ఒక ముఖ్య కారణం అని అభిప్రాయపడు తున్నారు. పిల్లలలో పోషకాహార లోపం వారి మొత్తం అభివృద్ధి మరియు ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తుంది.ఆహారం నుండి అవసరమైన ప్రాథమిక పోషకాలను శరీరం గ్రహించలేనప్పుడు ఇవి సంభవి స్తాయి. ఇది శారీరక ఎదుగుదల మరియు మానసిక అభివృద్ధిలో అసాధారణతలకు దారితీయవచ్చు.కొంతమంది పిల్లలు పోషకాహార లోపాలు వున్న కూడా సాధారణంగా కనిపిస్తారు. తల్లిదండ్రులు వారిని గుర్తించడం కష్టం.లక్షణాల గురించి మనకు తెలియకపోతే పిల్లలకు పోషకాహార లోపాలు ఉన్నాయో లేదో నిర్ధారించడం సులభం కాదు.ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణ మరియు నిర్లక్ష్యం చేయబడిన వైద్య సమస్యలలో ఇది ఒకటి. శరీరంలో తగినంత అవసరమైన ఖనిజాలు, విటమిన్లు మరియు ఇతర సేంద్రీయ మూలకాల కారణంగా ఇటువంటి వ్యాధులు సంభవిస్తా యి. అంతేకాకుండా, ఆరోగ్యకరమైన ఆహారం యొక్క కొరత మరియు ఆహార వినియోగంపై సరైన అవగాహన లేనప్పుడు శరీరం లోని కొన్ని భాగాలు కుడా లోపానికి గురికావచ్చు.విటమిన్ డి, విటమిన్ బి9 మరియు విటమిన్ బి 12 లోపాలను కలిగి ఉన్నప్పుడు కొన్ని వ్యాధులు సంభవిస్తాయి.బలహీనమైన ఆహారం లేదా తక్కువ పోషకాహారం తీసుకోవడం గుండె సమస్యలకు దారి తీస్తుంది.అదనంగా,అధిక వినియోగం వాపును ప్రేరేపిస్తుంది.ఇది స్ట్రోక్ వంటి గుండె జబ్బులకు దారితీస్తుంది.పోషకాలు ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మరియు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడంలో సహాయపడతాయి.పోషకాహార లోపం మరియు లోపం ద్వారా వచ్చే వ్యాధులను నివారించడానికి తప్పనిసరిగా ఆరోగ్యకర మైన మరియు పోషకమైన ఆహారాన్ని తీసుకోవాలి. ఎందుకంటే అవి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి మరియు దీర్ఘకాలంలో గుండె సమస్యలకు దారితీస్తాయి.అంతేకాకుండా, పోషకాలు మనుగడకు ముఖ్యమైనవి.పోషకాహార లోపాలు ఉన్నప్పుడు ఆ లోపాల ద్వారా అనేక శరీర భాగాలపైన ప్రభావం పడే అవకాశం ఉంది.అన్ని అనారోగ్యాలు మరియు రుగ్మతలను నివారించడానికి ఇవే కారణం.అనేక వ్యాధులతో సతమతమావుతున్న వెళ ఆరోగ్య బీమాను తీసుకుంటే మంచిది.ఇది వైద్య ఖర్చులు,ఆరోగ్య సమస్యలు మరియు ఇతర వైద్య అత్యవసర పరిస్థితుల కారణంగా ఉత్పన్నమయ్యే ఖర్చులను కవర్ చేస్తుంది. కాబట్టి భారీ ఖర్చులను భరించాల్సిన అవసరం లేదు.పోషకాహార లోపం వల్ల హృదయ సంబంధ వ్యాధులు, ప్రధానంగా గుండె జబ్బులు మరియు స్ట్రోక్,మధుమేహం, మస్కుల్లో స్కెలెటల్ డిజార్డర్స్, ముఖ్యంగా ఆస్టియో ఆర్థరైటిస్ మరియు ఎండోమెట్రియం, రొమ్ము మరియు పెద్దప్రేగు యొక్క క్యాన్సర్.తక్కువ బరువు కలిగి వుంటారు.తక్కువ బరువు ఉన్న పిల్లలలో మరణాల ప్రమాదం పెరుగుతుంది.తీవ్రమైన తక్కువ బరువు ఉన్న పిల్లలలో ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది. పోషకాహార లోపమును నివారించేందుకు పోషకాహారాన్ని మెరుగుపరచటం,ఆరోగ్య సంరక్షణను మెరుగు పరచటం, పోషకాహార విద్య, పునరుత్పత్తి, వయసులోని మహిళలు, కౌమార బాలికల పోషికతను మెరుగుపరచేందుకు అనేక పద్ధతులను అవలంబిస్తున్నారు. జబ్బుపడ్డప్పుడు కాని కోలుకున్నాక పిల్లలకు ఆహారమివ్వటం,చిన్న పిల్లలకు అనగా 2 సంవత్సరాల వయసున్న పిల్లలకు సూక్ష్మ పోషకాల పోషకాహార లోపము లోటును భర్తీ చేయాలి.వ్యక్తులు, సమాజము మరియు ప్రభుత్వాల మద్దతు, చొరవ దీని నివారణకు అవసరము.పోషకాహార లోపమును నివారించేందుకు ప్రభుత్వం అన్నిస్థాయిలలో జాతీయ స్థాయి నుండి గ్రామస్థాయివరకూ వివిధ పథకాల ప్రణాళికలు మరియు అమలు దీనికి అవసరం.ఆరోగ్య సంరక్షణను మెరుగు పరచటం, వ్యాధి నిరోధక శక్తిని పెంచటం కోసం మంచి పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను అందించాలి.ప్రాథమిక దశలోనే సాధారణ వ్యాధుల నిర్ధారణ మరియు సత్వర చికిత్స వంటివి చేయడం ఒక మంచి ఆరోగ్య పరిరక్షణా విధానం సమాజములో ఉండాలి.పోషకాహార లోపాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించటం, చికిత్స అందివ్వటం కూడా చాలా ముఖ్యం.నిర్ణీత వ్యవధిలో కడుపులోని నులి పురుగులను నిర్మూలించటం, ప్రాథమిక దశలోనే సాధారణ వ్యాధుల నిర్ధారణ మరియు సత్వర చికిత్స వంటివి చేయాలి.పోషకాహార లోపాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించటం, చికిత్స అందివ్వటం కూడా చాలా ముఖ్యం.సాధారణ ఆహార పధార్థాల పోషకాహార నాణ్యత, ముఖ్యంగా స్థానికంగా లభించే తక్కువధర అహార పదార్థాలు. పిల్లలకు తల్లి పాలివ్వటం మరియు అనుబంధ అహారాన్నివ్వటం యొక్క ప్రాముఖ్యత, తీసుకునే మొత్తము ఆహారపు మాంసకృత్తుల విలువను పెంచేందుకు గాను సరియైన పరిమాణా ల్లో పాలు,గుడ్లు, మాంసము మరియు ధాన్యాలను కలపాల్సిన అవసరము ఉంటుంది.జబ్బు పడ్డప్పుడు పిల్లలకు, పెద్దలకు ఆహారాన్ని ఇవ్వాల్సిన ప్రాముఖ్యతను తెలుసుకోవాలి. పిల్లలకు వ్యాధి నిరోధకశక్తిని పెంచడం,దైనందిన జీవితములో సక్రమమైన పారిశుధ్యాన్ని పాటించే ప్రాముఖ్యత, పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు వివిధ అహార పదార్థాల ద్వారా క్యాలరీలు, మాంసకృత్తులు మరియు సూక్ష్మ పోషకాలైన ఐరన్, విటమిన్ ఎ, మరియు జింకు మొదలైన వంటి వాటిని తీసుకోవటం ద్వారాలోటు భర్తీ చెయ్యవచ్చు.తద్వారా గర్భిణీ స్త్రీలు, శిశువులు మరియు చిన్నపిల్లలను పోషకాహార లోపానికి గురయ్యే ప్రమాదం నుంచి కాపాడవచ్చు. కౌమర, యవ్వన స్త్రీలలో బరువు తక్కువ అని కనుగొన్నప్పుడు ఆహారము ఎక్కువగా తీసుకోవాలి. సూక్ష్మపోషకాల ను ఎక్కువగా తీసుకోవాలి.రోజువారీ తీసుకునే కూరగాయలు, ఫలాల వాడకాన్ని పెంచాలి. పశు ఉత్పత్తులైన పాలు, చేపలు, గుడ్లు తీసుకోవాలి.విటమిన్ ఎ తో కూడిన పాలు, ఐరన్ మరియు విటమిన్లతో కూడిన పిండి మొదలైనవి లభించేటట్లు తీసుకోవాలి. అయోడైజ్ ఉప్పును ఉపయోగించాలి.అవసరమైన సూక్ష్మపోషకాలు ఆహారపదార్థాల ద్వారా లభించనట్లయితే వైద్యుల సలహామేరకు కొన్ని మందులు ఉపయోగించి ఆ లోటును భర్తీ చెయ్యాలి.గర్భంతో ఉన్నప్పుడు పిండ అభివృద్ధి కొరకు మరియు భవిష్యత్తులో చనుబాలిచ్చేందుకు చాలినంత బరువు పెరిగే విధంగా ఆహారాన్ని అధికంగా తీసుకోవాలి.ఐరన్,ఫొలి కామ్లపు బిళ్ళలను తరచూ మింగాలి.

చనుబాలిస్తున్నప్పుడు ప్రతిరోజూ అదనంగా పోషకాలతో కూడిన సమతుల్య భోజనానికి సమానంగా తినాలి.విటమిన్- ఎ లోపము ఉన్న ప్రదేశాలలో పెచ్చుమోతాదు విటమిన్- ఎ బిళ్ళలను ప్రసవమయిన వెంటనే, ప్రసవమయిన ఎనిమిదివారాల లోపు తీసుకోవాలి.చనుబాలలోని విటమిన్ -ఎ సారం పెరుగుతుంది మరియు తల్లీపిల్లలను వ్యాధిగ్రస్తులు కాకుండా సహాయపడుతుంది. జబ్బుపడ్డప్పుడు పిల్లలకు చాలినంత పోషాకాహారం అందించాలి. జబ్బు పడ్డప్పుడు పిల్లలకు, పెద్దలకు వేడి గా వున్న ఆహారాన్ని ఇవ్వాలి.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సంక్షేమము పిల్లల సంక్షేమ కోసం కొన్ని పథకాల ద్వారా ముక్యంగా గర్భస్థ స్త్రీలలో అప్పుడే పుట్టిన పిల్లలనుండి మొదలుకొని ఐదు సంవత్సరాల లోపు వారికి అన్ని రకాల పోషక విలువలు ఉన్నటువంటి ఆహార పదార్థాలను అందించడం జరుగుతుంది. మహిళలకు, పిల్లలకు ప్రతిరోజు పాలు,గుడ్ల తోపాటు మరిన్ని పోషక విలువలతో కూడిన ఆహారాన్ని కూడా అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నారు.మన ఇంటి వద్ద అనేక పోషక విలువలతో కూడినటువంటి పదార్థాలను తీసుకోవాలి.పండ్లు, కూరగాయలు,పాలతో పాటు డ్రై ఫ్రూట్స్ ఎక్కువగా తీసుకోవాలి. అలాగే ఆయా సీజన్లలో దొరికే ఆహార పదార్థాలతో పాటు మల్టీ విటమిన్లు లభించేటువంటి ఆహారాలను తీసుకోవాలి. అప్పుడే మన ఆరోగ్యాన్ని మనము కాపాడుకోగలు గుతాం. వీలైతే మన ఇంటి పరిసరాలలో మనకు రోజు అవసరం ఉండేటువంటి కొన్ని కూరగాయలను పెంచుకోవాలి.పెరటి తోట ఉన్నట్లయితే అక్కడ వివిధ రకాలైనటువంటి పండ్ల చెట్లను పెంచుకొని వాటి ద్వారా వచ్చేటువంటి పండ్ల ను తినాలి. ఇలా మనకు కావలసినటువంటి పోషక విలువలున్న ఆహార పదార్థాలు మనమే తయారు చేసుకుంటే మంచిది. మంచి ఆహారంతో మంచి ఆరోగ్యం వస్తుంది కాబట్టి పోషక విలువలు ఉన్నటువంటి వాటిని అందరూ తీసుకోని,ఆరోగ్యంగా జీవించాలి.



డాక్టర్ మోటె చిరంజీవి
సామాజికవేత్త, విశ్లేషకులు
సెల్ : 9949194327

గ్రంథాలయ-సమాచార శాస్త్రంలో

# నీతి సంబంధిత సమస్యలు

గ్రంథాలయ మరియు సమాచార శాస్త్రం (లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సైన్స్ - ఎల్‌ఐఎస్) సమాజంలో సమాచారాన్ని సేకరించడం, నిర్వహించడం, సంరక్షించడం, వినియోగదారులకు అందించడం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తిస్తుంది. ఈ ప్రక్రియలో నీతి సంబంధిత సమస్యలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఆధునిక డిజిటల్ యుగంలో సమాచార స్వేచ్ఛ, గోప్యత, సమానత్వం, మేధో సంపత్తి హక్కులు, సాంస్కృతిక సున్నితత్వం వంటి అంశాలు గ్రంథాలయ నిపుణులకు సవాళు గా నిలుస్తున్నా యి. ఈ వ్యాసం ఈ నీతి సమస్యలను విశ్లేషణాత్మకంగా పరిశీలిస్తూ, వాటిని పరిష్కరించేం దుకు గ్రంథాలయ నిపుణులు అనుసరించాల్సిన మార్గాలను చర్చిస్తుంది.

గ్రంథాలయ మరియు సమాచార శాస్త్రం సమాజంలో సమాచారాన్ని సేకరించడం, నిర్వహించడం, సంరక్షించడం, వినియోగదారులకు అందించడం వంటి బాధ్యతలను నిర్వహిస్తుంది. ఈ ప్రక్రియలో నీతి సూత్రాలు కీలక పాత్ర పోషిస్తాయి. గ్రంథాలయ నిపుణులు సమాచార స్వేచ్ఛ, న్యాయం, సమానత్వాన్ని ప్రోత్సహించడం ద్వారా సమాజంలో గౌరవాన్ని పొందుతారు. అయితే, డిజిటల్ యుగంలో అనేక నీతి సవాళ్లు ఎదురవుతున్నాయి. సమాచార స్వేచ్ఛ అనేది గ్రంథాలయ శాస్త్రంలో ప్రధాన సూత్రం. అమెరికన్ లైబ్రరీ అసోసియేషన్ (ఏఎల్ఏ) వంటి సంస్థలు ప్రతి వ్యక్తికి సమాచార యాక్సెస్ హక్కును నొక్కిచెప్పాయి. కానీ, సెన్సార్‌షిప్ ఈ స్వేచ్ఛకు అడ్డంకిగా నిలుస్తుంది. రాజకీయ, మతపరమైన, సామాజిక కారణాల వల్ల కొన్ని దేశాలలో పుస్తకాలు లేదా డిజిటల్ కంటెంట్ నిషేధించ బడతాయి. ఈ పరిస్థితిలో గ్రంథాలయ నిపుణులు సమాచార స్వేచ్ఛను కాపాడాలా లేక స్థానిక చట్టాలను పాటించాలా అనే నీతి సందిగ్ధంలో చిక్కుకుంటారు. ఈ సవాలును అధిగమించడానికి, వినియోగదారుల హక్కులను సమర్థిస్తూ, సమాజంలో సమతుల్యతను కాపాడే ప్రయత్నం చేయాలి. డిజిటల్ గ్రంథాలయాలు, ఆన్‌లైన్ డేటాబేస్‌ల పెరుగుదలతో వినియోగదారుల గోప్యత మరో ముఖ్యమైన నీతి సమస్యగా ఉద్భవించింది. గ్రంథాలయాలు వినియోగదారుల డేటాచదివిన పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, శోధన చరిత్రసేకరిస్తాయి. ఈ డేటా దుర్వినియోగం లేదా మూడవ పక్షాలకు అమ్మబడే ప్రమాదం ఉంది. ఉదాహరణకు, కోవిడ్-19 సందర్భంలో వైరస్ జన్యు మార్పిడి (మ్యూటేషన్) సమాచారం దొంగిలించడానికి ఫార్మా కంపెనీల మధ్య పోటీ ఉంది. కొన్ని ఆన్‌లైన్ గ్రంథాలయ సేవలు వినియోగదారుల డేటాను వాణిజ్య సంస్థలకు అందించడం ద్వారా గోప్యతను ఉల్లంఘిస్తాయి. ఈ సమస్యను ఎదుర్కోవడానికి, గ్రంథాలయ నిపుణులు కఠినమైన డేటా రక్షణ విధానాలను అమలు చేయాలి, వినియోగదారులకు వారి డేటా వినియోగం గురించి స్పష్టమైన సమాచారం అందించాలి. సమాచారం అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలనేది గ్రంథాలయ శాస్త్రంలో ప్రాథమిక సూత్రం. అయితే, ఆర్థిక, సామాజిక, సాంకేతిక అసమానతలు ఈ లక్ష్యానికి అడ్డంకులుగా నిలుస్తాయి. గ్రామీణ ప్రాంతాలలో గ్రంథాలయ సౌకర్యాలు పరిమితంగా ఉండటం, డిజిటల్ గ్రంథాలయాలకు ఇంటర్నెట్ యాక్సెస్ లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. ఈ అసమానతలను తగ్గించడానికి, వివిధ సామాజిక వర్గాలకు సమాచారం అందేలా కార్యక్రమాలు రూపొందించాలి. ఉచిత ఇంటర్నెట్ సౌకర్యాలు, సమాచార సాక్షరత కార్యక్రమాలు, బహుభాషా వనరులు అందించడం ద్వారా సమానత్వాన్ని ప్రోత్సహించవచ్చు.

మేధో సంపత్తి హక్కులు, ముఖ్యంగా కాపీరైట్, మరో ముఖ్యమైన నీతి సమస్య. గ్రంథాలయాలు సమాచారాన్ని అందించే క్రమంలో కాపీరైట్ చట్టాలను గౌరవించాలి. డిజిటల్ కంటెంట్‌ను లైసెన్స్ ఒప్పందాలు లేకుండా పంచుకోవడం లేదా పుస్తకాలను అనధికారికంగా కాపీ చేయడం నీతి విరుద్ధం. అయితే, విద్యా పరమైన ఉపయోగం కోసం కాపీరైట్‌లో మినహాయింపులు (ఫేయిర్ యూస్) ఉన్నాయి. గ్రంథాలయ నిపుణులు ఈ చట్టాలను సమతుల్యం చేస్తూ, సమాచారాన్ని అందుబాటులో ఉంచాలి.

గ్రంథాలయాలు వివిధ సాంస్కృతిక, భాషా, సామాజిక నేపథ్యాల వినియోగదారులకు సేవలు అందిస్తాయి. కొన్ని సాహిత్య రచనలు లేదా సమాచార వనరులు నిర్దిష్ట వర్గాలను కించపరిచేలా ఉండవచ్చు. గ్రంథాలయ నిపుణులు వైవిధ్యాన్ని గౌరవించే సమాచారాన్ని ఎంచుకోవడంలో జాగ్రత్త వహించాలి, సెన్సార్‌షిప్‌ను నివారించే సమతుల్య విధానం అవలంబించాలి. డిజిటల్ యుగంలో, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా తప్పుడు సమాచారం వ్యాప్తి ఒక సమస్య. నమ్మదగిన వనరులను ఎంచుకోవడం, సమాచార సాక్షరతను నేర్పడం గ్రంథాలయ నిపుణుల బాధ్యత. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత గ్రంథాలయ సాధనాలు (చాట్‌బాట్‌లు, శోధన ఇంజన్‌లు) పక్షపాతం లేకుండా సమాచారం అందించేలా చూడాలి.

ఈ నీతి సమస్యలను పరిష్కరించడానికి, గ్రంథాలయ నిపుణులు ఏఎల్ఏ లైబ్రరీ బిల్ ఆఫ్ రైట్స్, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ లైబ్రరీ అసోసియేషన్స్ (ఐఎఫ్ఎల్ఏ) నైతిక మార్గదర్శకాలను అనుసరించాలి. నైతిక శిక్షణ, నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి కార్యక్రమాలు అవసరం. సమాచార స్వేచ్ఛ, గోప్యత, సమానత్వం, మేధో సంపత్తి హక్కులు, సాంస్కృతిక సున్నితత్వం వంటి అంశాలు గ్రంథాలయ నిపుణులకు సవాళ్లుగా నిలుస్తాయి. డిజిటల్ యుగంలో ఈ సవాళ్లు మరింత తీవ్రమవుతున్నాయి. నీతి సూత్రాలను ఆచరణలో పెట్టడం, వినియోగదారుల హక్కులను కాపాడడం, సమాచార సాక్షరతను ప్రోత్సహిం చడం ద్వారా గ్రంథాలయ నిపుణులు తమ వృత్తి గౌరవాన్ని కాపాడాలి. ఈ విధంగా, గ్రంథాలయ శాస్త్రం సమాజంలో నీతి ఆధారిత సమాచార వ్యవస్థగా కొనసాగుతుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# ఫ్రాన్సెస్కా అల్బనీస్‌పై ఆంక్షలు ఎత్తివేయాలి



పాలస్తీనా భూభాగాల్లో మానవ హక్కుల ఉల్లంఘనలను దర్యాప్తు చేయడానికి ఐక్యరాజ్యసమితి నియమించిన ప్రత్యేక రిపోర్టర్, స్వతంత్ర నిపుణురాలు ఫ్రాన్సెస్కా అల్బనీస్‌పై అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో ప్రెసిడెన్షియల్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం ఆంక్షలు విధించడం అప్రజాస్వామికం. యునైటెడ్ స్టేట్స్ మరియు ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా రాజకీయ మరియు ఆర్థిక యుద్ధ ప్రచారం నిర్వహిస్తున్నారన్న నెపంతో ఆమెపై ఆంక్షలు విధించడం ఏ రకంగానూ సమంజసం కాదు. ప్రజాస్వామ్యం గురించి అనునిత్యం నీతులు వల్లిం చే అమెరికా సాక్ష్యాత్తు ఐక్యరాజ్య సమితి స్వతంత్ర నిపుణురాలిపై ఈ రకం గా ఆంక్షలు విధించి విషమ పరిస్థితులకు గురిచేయడం కడు గర్హనీయం. ఒక రకంగా అంతర్జాతీయ సంస్థల ఉద్దేశ్యాలను, లక్ష్యాలను అమెరికా ధ్వంసం చేస్తూ అప్రజాస్వామ్యానికి నిదర్శనంగా నిలుస్తూనే ఉంది అని చెప్పవచు

ఐక్యరాజ్యసమితి కౌన్సిల్‌లోని దేశాలు ఆయుధ నిషేధం విధించాలని, ఇజ్రాయెల్‌తో వాణిజ్య మరియు ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలని ఫ్రాన్సెస్కా అల్బనీస్ పిలుపునిచ్చారు. గాజాలో ఇజ్రాయెల్ ప్రవర్తనను జాతి నిర్మూలన చర్యలు మరియు అంతర్జాతీయ చట్ట ఉల్లంఘనలుగా ఆమె అభివర్ణించారు. వృత్తి ఆర్థిక వ్యవస్థ నుండి జాతి విధ్వంసం వరకు అంటూ ఫ్రాన్సెస్కా అల్బనీస్ నివేదికను ప్రచురించారు. 'ఆయుధ తయారీదారుల నుండి ఆర్థిక సంస్థల వరకు 48 మంది కార్పొరేట్ వ్యక్తులను ఇజ్రాయెల్ ప్రభుత్వంతో వారి సహకారం ఆధారంగా లాభాన్ని ఆర్జించారు' అని ఆమె నివేదికలో ఆరోపించారు. దీనిని సహించని అమెరికా అన్యాయంగా ఆమెపై ఆంక్షలు విధించి తన దమననీతిని బట్టబయలు చేసుకోవడం కడు విడ్డూరంగా ఉంది.

ఐక్యరాజ్యసమితి వ్యవస్థలో ఫ్రాన్సెస్కా అల్బనీస్‌ని పదవి నుండి తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్న అమెరికా ఒత్తిడి ప్రచారం చిట్టచివరికి విఫలమైన తర్వాత ఈ రకమైన ఆంక్షలు ముందుకు వచ్చాయి అని స్పష్టంగా అర్థం అవుతుంది. ఆమెపై ఇలా అన్యాయంగా ఆంక్షలు విధించడం అంతర్జాతీయ మానవ హక్కుల వ్యవస్థను మరింతగా బలహీనపరుస్తుంది అని చెప్పవచ్చు. స్పెషల్ రిపోర్టర్లపై ఈ రకమైన ఏకపక్ష ఆంక్షలను అమెరికా విధించడం ఏమాత్రం సమంజసం కాదు. ఫ్రాన్సెస్కా అల్బనీస్ ఇప్పుడు ఆస్తుల ఫ్రీజింగ్ మరియు ప్రయాణ ఆంక్షలను ఎదుర్కొనడం బాధాకరం. 'ఈ ఆంక్షలు నన్ను తిరగకుండా నిరోధించవచ్చు. సాధారణంగా నాతో నిమగ్నమయ్యే వ్యక్తులపై ఈ ఆంక్షలు ప్రభావాన్ని చూపిస్తాయి. అమెరికా నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా ఉన్న మానవ హక్కుల పరిరక్షకులకు ప్రమాదక రమైన సంకేతంగా నిలిచింది' అని ఫ్రాన్సెస్కా అల్బనీస్ పేర్కొనడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు.

అమెరికా తనపై ఆంక్షలు విధించడాన్ని ఫ్రాన్సెస్కా అల్బనీస్ ఖండించి ఈ ఆంక్షల చర్యను 'అపరాధ భావన'గా అభివర్ణించారు. 'శక్తివంతులు శక్తి లేని వారి కోసం మాట్లాడే వారిని శిక్షించడం బలానికి సంకేతం కాదు. ఆది అపరాధానికి సంకేతం. తనపై అమెరికా విధించిన ఆంక్షలను మాఫియా తరహా బెదిరింపు పద్ధతులను తలపిస్తున్నాయి' అని ఫ్రాన్సెస్కా అల్బనీస్ పేర్కొనడం గమనార్హం. విమర్శకులను శిక్షించే ప్రయత్నంలో భాగంగానే అమెరికా ఈ తరహా ఆంక్షలు విధిస్తూనే ఉంది అని అవగతం అవుతుంది.

ప్రపంచ సమస్యలపై నివేదించడానికి ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి నియమించిన నిపుణులలో ఫ్రాన్సెస్కా అల్బనీస్ ఒకరుగా ఉన్నారు. మానవ హక్కుల మండలి యొక్క ప్రత్యేక విధానాలు అని పిలువబడే దాని కింద ప్రత్యేక రిపోర్టర్లను నియమిస్తారు. కౌన్సిల్ ఆదేశాన్ని నెరవేర్చడంలో స్పెషల్ రిపోర్టర్లు ఒక ముఖ్యమైన పాత్రని పోషిస్తున్నారు. వారు ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల సమస్యలను పర్యవేక్షించడానికి మరియు నివేదించడానికి నియమించబడిన స్వతంత్ర నిపుణులుగా కొనసాగుతారు. వారు జెనీవాలోని కౌన్సిల్‌కు మరియు అలాగే న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీకి క్రమం తప్పకుండా నివేదిస్తారు. ఈ నిపుణులు వారి వ్యక్తిగత హొదాలో పనిచేస్తారు.

ఫ్రాన్సెస్కా అల్బనీస్ ఒక అంతర్జాతీయ మానవ హక్కుల న్యాయవాది. ఆమె జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ ఇంటర్నేషనల్ మైగ్రేషన్‌లో అనుబంధ స్కాలర్ మరియు మధ్యప్రాచ్యంలో నిపుణురాలు. ఆమె ఆక్రమిత పాలస్తీనా భూభాగాల్లో మానవ హక్కులపై ఐక్యరాజ్యసమితి ప్రత్యేక నిపుణురాలుగా కొనసాగుతున్నారు. 2023 అక్టోబర్‌లో గాజాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ఆమె ఇజ్రాయెల్ యుద్ధ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ శాంతి కోసం కృషి చేస్తూనే ఉన్నారు.


గాజా ప్రాంతంలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ నిరాటకంగా కొనసాగిస్తున్న యుద్ధాన్ని 'జాతిహత్య'గా ఫ్రాన్సెస్కా అల్బనీస్ అభివర్ణించా రు. ఇజ్రాయెల్ నిరాటకంగా కొనసాగిస్తున్న యుద్ధోన్మాదాన్ని 'ఆధునిక చరిత్రలో అత్యంత క్రూరమైన మారణహొమాలలో ఒకటి' అని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలిని ఉద్దేశించి ఆమె పేర్కొనడం గమనార్హం. 'తనపై అమెరికా ఆంక్షలు అన్యాయాన్ని తలపిస్తున్నాయి. అన్యాయాలకు వ్యతిరేకంగా కలిసి ఉద్యమిద్దాం. అంతర్జాతీయ పరిశీలకులు గాజా లోపల సంక్షోభంపై దృష్టి పెట్టాలి. అందరి దృష్టి గాజా పైనే ఉండాలి. అక్కడ పిల్లలు తమ తల్లుల చేతుల్లో ఆకలితో చనిపోతున్నారు. వారి తండ్రులు మరియు తోబుట్టువులు ఆహారం కోసం వెతుకుతూ బాంబులతో ముక్కలు ముక్కలుగా చిదిమివేయబడ్డారు. నేను మాట్లాడుతుండగా గాజాలో ప్రజలు పిట్టల్లా చనిపోతూనే ఉన్నారు. ఇది చాలా బాధాకరం. ఐక్యరాజ్యసమితి పూర్తిగా జోక్యం చేసుకోలేకపోతోంది' అని ఫ్రాన్సెస్కా అల్బనీస్ ఆవేదనను వ్యక్తీకరిం చడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. తక్షణమే ఈ మారణకాండపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐ.సి.సి) విచారణ జరపాలి అని ఆమె నినదిస్తూనే ఉన్నారు. ఇజ్రాయిల్ యుద్ధ నేరాలపై ఐ.సి.సి ప్రాసిక్యూషన్లకు అడ్డుకునేందుకే ఈ ఆంక్షలని విధిస్తున్నారు అని చాలా స్పష్టంగా అర్థమవుతూనే ఉంది. ఇకనైననూ ఇజ్రాయిల్ పాలస్తీనాలో యుద్ధ విరమణ దిశగా అడుగులు వేయాల్సిన అవసరం తప్పకుండా ఉంది.

అంతర్జాతీయ సంస్థలు నియమించిన వ్యక్తులపై దాడులు, ఆంక్షలు మరియు బెదిరింపులను నియంత్రించాల్సిన అవసరం తప్పకుండా ఉంది. శాంతి కోసం కృషి చేస్తున్న ఫ్రాన్సెస్కా అల్బనీస్‌పై ఆంక్షలు విధించడం పట్ల ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తం అవుతూనే ఉంది. ఆంక్షలు ప్రమాదకర మైన ప్రమాణాలను నెలకొల్పుతాయని ఐక్యరాజ్య సమితి నిపుణు లు హెచ్చరిస్తూనే ఉన్నారు. ప్రత్యేక రిపోర్టర్, స్వతంత్ర నిపుణురాలు ఫ్రాన్సిస్కా అల్బనీస్‌పై అమెరికా ఆంక్షలను వెనక్కి తీసుకోవాలని ఐక్యరాజ్యసమితి సహా అనేక సంస్థలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. అంతిమంగా ఫ్రాన్సిస్కా అల్బనీస్‌పై తక్షణమే ఆంక్షలను ఎత్తివేయాల్సిన అవసరం తప్పకుండా ఉంది. ఈ దిశగా ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు ఉద్యమించాల్సిన అవసరం తప్పకుండా ఉంది.



జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

# భాగ్యాన్ని అందిస్తూ యోగ్యంగా సాగిన కవిత్వం - జీవ గణితం"




మనిషి పుట్టుక నుంచి మరణం వరకు అతని జీవితంలోని ప్రతి అంశంతో అనివార్య అనుబంధం కలిగిన ఏకైక విషయం గణితం. పాస్కల్ ప్రకారం, ఆత్మ యొక్క ఉత్తమ అభ్యాసం గణితం. ఇది విశిష్ట తార్కిక విధానంతో, అనిశ్చిత విషయాలను బహిర్గతం చేసి, నిశ్చిత సత్యాలుగా అందించే సామర్థ్యం కలిగి ఉంది. మానవుడు తన నిత్యజీవితంలో ఎదుర్కొనే సమస్యలను గణిత భాషలోకి తర్జుమా చేసి, పరిష్కారాలను కనుగొనడం ప్రాచీన కాలం నుండి అమలులో ఉన్న శాస్త్రీయ విధానం. ఈ సారవంతమైన పునాదులపై పుట్టిన సాహిత్య సమాహారమే 'జీవ గణితం' కవితా సంపుటి. దీని సృజనకర్త జనం మెచ్చిన సాహితీవేత్త రేడియం.

పద్యం పరమార్థాన్ని నేతల మరణాలకు, కరుణా కటాక్షాలకు పరిమితం చేయడం ద్రోహమని గుర్తుచేస్తూ, "తిరుగుబాటుకు ధైర్యం ఇచ్చేది పద్యం, జనం బాటకు ప్రగతి గీతం పాడేది పద్యం, శ్రమజీవన సారం పద్యం, ప్రజల ఆకాంక్ష పద్యం" అని పద్యానికి అద్వితీయ స్థానాన్ని కల్పిస్తున్నాడు ఈ కవి. యుగాలు గడిచినా తడి ఆరని 'స్నేహం' గురించి 'మిత్రలాభం' కవితలో, మిత్రత్వం తెలియని వాడు రాయిలా నిర్జీవంగా ఉండిపోతాడని, మనిషి బాధలను తీర్చి, ఓదార్చే శక్తి స్నేహానికి మాత్రమే సొంతమని, మలయపవనంలాంటి స్నేహాన్ని పూలతోటలా సంరక్షించుకోవాలని హితవు చెప్తున్నాడు. 'తంతు ఒక్కటే' కవితలో, "పసుపుతాడు, పసుపు బట్టలు, రోల్డ్ గోల్డ్ నగలతో ఒకచోట పెళ్ళి జరిగితే, పుత్తడి పుస్తెల తాడు, పట్టువస్త్రాలు, మోయలేనంత బంగారు నగలతో మరోచోట ఇంకో పెళ్ళి జరుగుతోంది" అని, పెళ్ళి ఎలా జరిగినా వధూవరులు ఆశల దీపాలుగా, ఆకాశంలో వెలిగే రవిబింబంలా మారాలని ఆశీర్వదిస్తున్నాడు.

"వెన్నెలను తరిమి తరిమి / మింగే రక్కసిలాగుంది / వానలో తడిసిన రాత్రి" అంటూ భయంకరమైన రాత్రిని వర్ణిస్తూ, బలిసిన దున్నలా ఉన్న ఆ రాత్రిలో హింసాత్మక పంజాను విసురుతున్నా, "భయంలేని రాత్రులకై / అమ్మ అభయహస్తం / చల్లని వెన్నెల జోలలో / నిద్రపుచ్చుతుంది" అంటూ ఓదార్పు మాటలతో రాత్రి పాషాణం కరిగి, తెల్లవారగానే ఉషోదయ గీతాలు వినిపిస్తాయని కవి ఆశిస్తున్నాడు. ఈ కవితలో హద్దులేని భావుకత వర్షంలా కురుస్తుంది. సాధారణ విషయాలను అసాధారణంగా చిత్రిస్తూ, పేదల కళ్ళలో నీరుగా మారే ఉప్పు, కష్టజీవుల చెమటలో ఉండే ఉప్పు, కానీ వారి బ్రతుకులు చప్పగానే ఉంటాయని, ఉప్పుపై పన్ను విధించిన తెల్లవాళ్ళను, ఉప్పు కోసం సత్యాగ్రహం చేసిన మహాత్మాగాంధీని గుర్తుచేస్తూ, ఉప్పు పట్ల గౌరవాన్ని పెంచుతున్నాడు.

ఈ సంపుటిలోని కవితలు మనిషి జీవితాన్ని కావ్యంలా చిత్రిస్తాయి. "గెలవడం, ఓడడం, పోరాడడం... ఈ మూడు ముక్కల ఆట స్వరూపమే మనిషి జీవితం" అని, "పురోగమనం, తిరోగమనం, అనురాగ గమనం" జ్ఞాన సంపదకు మూలాలని వర్ణిస్తూ, కవి మాటలు సూక్తుల్లా నిలిచిపోతాయి. 'మాటల దారులు' కవితలో, మనిషి జీవితం జెండాలా రెపరెపలాడాలంటే, మాటలు రెండైనా జీవనదిలా ప్రవహించాలని, హింసను అంతం చేయడానికి రెండు మాటలు చాలని, మనుషులంతా ఆ మాటలను ఉచ్చరించే సందర్భం కోసం సమాయత్తం కావాలని, అలా జరిగితే మనిషి మహొన్నత మానవ రూపంలో పునర్జన్మ పొందుతాడని ఆశిస్తున్నాడు. "మట్టి లేకపోతే / మనిషి లేనే లేడు / మనసు లేకపోతే / మనిషే కాడు" అంటూ, రక్తమాంసాలు మాత్రమే చాలవని, మానవ సంబంధాలకు మధుర పరిమళాలు అందించే మనసు అవసరమని ఆకాంక్షిస్తున్నాడు.

వేమనను "ఆటవెలదికి రాజు, చిరుపదాల తెలుగు జిలుగుల సాహిత్య శోభ, నీతి మాటల వైతాళికుడు, మానవ సంఘ ప్రవక్త" అని వర్ణిస్తూ, 'విశ్వదాభిరామ వినురవేమ' పద్యాలు గొంతులు సవరించుకుంటాయి. గుల్జార్ కవిత్వ గులాబీల సొగసులను 'గుల్దస్తా' కవితలో, "సినీ జగత్తు / పాటల తోటమాలి / పూల సుగంధం" అని ఆవిష్కరిస్తున్నాడు. నేతాజీ జైహింద్ ప్రస్తావన స్వాతంత్ర్య ఉద్యమ దృశ్యాలను, చేగువేరా స్మరణ రక్తానికి కొత్త శక్తిని, డొక్కా సీతమ్మ వివరాలు వజ్రాల రాసుల్లా, కాళోజి పేరు తెలంగాణ అస్తిత్వాన్ని ఢంకాలా ధ్వనింపజేస్తాయి.

'శాలాకిలహరి' కవిత, వృత్తిని నమ్ముకుని బ్రతికే శిల్పి ఔన్నత్యానికి హారతులు పడుతుంది. "వా డు కర్మజీవి / కర్తకు క్రియకు అనుసంధానమైన వాడు / అతని బ్రతుకులో నవ్వులు చిందవు / ఎదుటివాడిని నవ్వుల్లో ముంచుతాడు" అంటూ, రూపశిల్పి చాతుర్యాన్ని హిమాలయాల ఎత్తుకు చేర్చి, అక్షరాలతో అభిషేకం చేస్తుంది. 'నాకు యుద్ధం కావాలి' కవితలో, "అణు ఇంధనం మిగలని యుద్ధం, శాంతి స్థాపనకోసం శ్రమించే యుద్ధం" కావాలని కవి కోరుతున్నాడు. 'రాత్రి రమణి' కవితలో, "ఆగిపో రాత్రి / నిలబడిపో చంద్రుడా / ఈ ప్రేమ మైదానంలో / వెన్నెల స్నానం చేయాలి" అంటూ, వెన్నెల చినుకుల్లో తడుస్తూ పాఠకులను ఆనందంలోకి ఆహ్వానిస్తున్నాడు. 'మారని చిత్రాలు' కవితలో, "కీలు గుర్రం అగ్రరాజ్యపు ఉగ్రరూపం / కొయ్య గుర్రం చిన్నరాజ్యపు చిందులు వేసే రూపం" అని, అగ్రరాజ్యాల పైశాచిక రాజకీయ క్రీడలను బహిర్గతం చేస్తూ, కులం పోట్లు, కరెన్సీ నోట్లు, ఓట్ల జాతరలో మానవత్వం తారుమారవుతుందని, ఓటరు విజ్ఞతతో నూతన దీపాలు వెలిగిస్తాడని ఆశిస్తున్నాడు. 'జీవ గణితం' కవితలో, "సంకలనాల, వ్యవకలనాల మధ్య / అనుబంధాలు, అసూయజ్వాలలు / గుణకారాల, భాగాహారాల మధ్య / ఉన్నత శిఖరాలు, అధోపతనాలు" అంటూ, జీవితం గణితంతో ప్రయాణిస్తుందని, లెక్కలు తప్పితే ముప్పులు తప్పవని హెచ్చరిస్తున్నాడు. 'నగ్న సత్యం' కవితలో, "బాధలు అగర్ బత్తీ / సుఖాలు సుర్ సుర్ బత్తీ / రెండు కాలిపోయేవే / రెండు మరణందాకా వెంట వుండేవే" అంటూ, జీవితం పడవ దరి చేరేదాకా సాగితేనే పుట్టుక పరమార్థం సఫలమవుతుందని సూత్రీకరిస్తున్నాడు.

బురదపేటలో పుట్టి, గద్వాల కోటలో చదివి, కవితా కోటలో విహరిస్తూ, ప్రగతిశీల బాటలో నడిచే రేడియం, ఈ సంపుటిలో సాహిత్య పంటను మనోహరంగా విస్తరించాడు. ప్రజల బాధల్లో తడిచి, తపించే ఈ కవి, అస్తమించని సూర్యుడ్ని కలానికి కాపలాగా నిలిపి, మానవ జీవితాలు రసాత్మకం కావాలని, తన శ్వాసను ఆకుల ఔన్నత్యానికి అంకితం చేస్తూ, అక్షరాలతో హామీపత్రాలు రాస్తున్నాడు. ఈ సాహితీవేత్తను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.



సాహిత్య ప్రపూర్ణ డాక్టర్ కె.జి. వేణు,
98480 70084

## ఇందిరమ్మ రాజ్యంలో నెరవేరుతున్న సొంతింటి కళ

- కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూడ వీరేష్



**కేశంపేట, జూలై 13 (జనం సాక్షి) :** ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన నిరుపేదలందరికీ సొంతింటి కళ నెరవేరుతుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూడ వీరేష్ అన్నారు. మండల పరిధిలోని కొనాయిపల్లి గ్రామంలో గ్యార కవిత సురేష్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వీరేష్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల చిరకాల ఆకాంక్షను నెరవేర్చాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో మండలంలో పెద్ద మొత్తంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయన్నారు. అనంతరం లబ్దిదారు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సోప్పరి జంగయ్య, నాయకులు కర్రెడ్ల నరసింహారెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్, జంగయ్య, మహేష్ పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**కాప్రా, జూలై 13 (జనం సాక్షి) :** క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దృఢత్వానికి ఎంతగానో దోహదపడతాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఎంఎన్ఆర్ బ్యాట్మెంటల్ కోర్ట్ విస్టా బ్యాడ్మింటన్ ప్రీమియర్ లీగ్ లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని నిలుపుతాయి అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూం డిగ్నిటీ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి



**కాప్రా, జూలై 13 (జనం సాక్షి) :** కాప్రా డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ డబుల్ బెడ్ రూమ్ డిగ్నిటీ కాలనీ మంజీరా నీటి ప్రారంభోత్సవానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వంత నిధులతో కాప్రా డివిజన్ -1 బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు బైరి నవీన్ గౌడ్ గారు నీటి కలెక్షన్ ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఆయన అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అభిమానులు, కాలని వాసులు పాల్గొన్నారు.

# రాజ్యాంగంపై బీజేపీకి నమ్మకం లేదు

- మాజీ పార్లమెంట్ సభ్యులు సుభాషిణి ఆలీ




**గద్వాల నడిగడ్డ, జూలై 13 (జనం సాక్షి) :** భారత రాజ్యాంగంపై బీజేపీ నమ్మకం లేదని అందుకనే రాజ్యాంగం అమలులో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నదని మాజీ ఎంపీ సుభాషిణి ఆలీ అన్నారు.ఆవాజ్ రాష్ట్ర 3 వ మహాసభల సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని మక్కా మసీదు నుండి ర్యాలీ ప్రారంభించి,పట్టణ పుర విధులలో ర్యాలీ నిర్వహించి,తేరు మైదానంలో ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికూర్ రెహమాన్ సభాధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెపికి రాజ్యాంగం పట్ల నమ్మకం లేదని అందుకే, రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి అమలులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.సి ఏ ఏ, ఎన్ ఆర్ సి చట్టం వల్ల మైనార్టీ హక్కులకు భంగం కలిగిందని, అందుకనే పరదచాటున ఉన్న మైనార్టీ మహిళలు తమ హక్కుల కోసం రోడ్ల పైకి వచ్చి ఉద్యమాలు చేస్తున్నారని అన్నారు. మైనారిటీ ల దేశభక్తిని ఎవరు గుర్తించవలసిన అవసరం లేదని,తాము భారతదేశ పౌరులమని అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా తమకు సర్వ హక్కులు కల్పించారని అన్నారు.స్వశక్తి తో అన్ని రంగాలలో మహిళలు ముందుకు వెళు తుంటే బీజేపీ మాత్రం మహిళ హక్కులను నిరాకరిస్తున్నదని, విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాతంత్ర హక్కులను హరిస్తే తిరగబడతామని హెచ్చరించారు.భేటీ పడవో భేటీ బచావో అంటూ నినాదాలు ఇస్తున్న బీజేపీ తాను అధికారంలో ఉన్న యు పి బీహార్,మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రలలో ఆడ పిలల్లపై జరుగుతున్న అరాచకాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు.దళిత, ఆదివాసి మహిళలపై దుర్మార్గలు ఆగడం లేదని బీజేపీ అధికారం లో ఉన్న రాష్టాలలో వారి దురాగాతలకు అంతం లేదని విమర్శించారు. ఉత్తరప్రదేశ్ లో యోగి ఆదిత్యనాథ్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆకలి,పేదరికం, నిరుద్యోగం పెరిగిందని వాటి నుండి తప్పించుకోవడానికి మతాన్ని అడ్డం పెట్టుకుంటున్నారని విమర్శించారు.మోడీ గారు అంబానీలు, ఆదానిలకు ఉద్యోగాలు ఇచ్చి, దేశ సహజ వనరులను దోచుకోవడానికి అవకాశం ఇచ్చారని, రైతులు కూలీలకు కార్మిక వర్గాన్ని మాత్రం దోపిడీ పిడనకు గురి చేస్తూ వారిని దోచుకుంటున్నారని విమర్శించారు. తమ ఆర్థిక రాజకీయ దోపిడీని కప్పిపుచ్చుకోవడానికి విద్వేష రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారని విమర్శించారు.రాజ్యాంగాన్ని అంతం చేసి మతోన్మాదాన్ని మనువాదాన్ని అమలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. మనుస్మృతి పుట్టినప్పటి నుండి మరణించే వరకు మహిళలకు హక్కులను నిరకరించిందని అన్నారు. ఎంత పేదరికంలో ఉన్న హక్కులకు భంగం వాటిల్లితే చూస్తూ ఊరుకోరాదని,ప్రజలు జాగృతం అయి సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు ఇచ్చారు. బీజేపీని నడిపిస్తున్న ఆర్ ఎస్ ఎస్ తన ఆలోచనలను ప్రభుత్వ విధానాలలో అమలు పరుస్తున్నదని, అందులో భాగంగా శాస్త్రీయ విద్యకు తిలోదకాలు ఇచ్చి మత ప్రాతిపదికన అంశాలు విద్యలోకి చొప్పించ్చిందని విమర్శించారు.ఢిల్లీలో రామ్ లీలా మైదానంలో నెహ్రూ అంబేద్కర్ బొమ్మలను ధ్వసం చేసిన ఆర్ ఎస్ ఎస్ కు, భారత స్వాతంత్ర పోరాటంలో పాల్గొనని బీజేపీ కి రాజ్యాంగం గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు.రాజ్యాంగం అందరికి సమాన హక్కులు కల్పించిందని,కానీ సమానత్వాన్ని ఇవ్వడంలో బీజేపీ నిరాకరిస్తున్నదని విమర్శించారు.భౌతిక దాడులు కేవలం మైనారిటీ లపై ఎందుకు చేస్తున్నారో ఎస్సి,ఎస్టి బీసీ ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. కులాలు,మతాలు, జాతుల మధ్య విభజన వాదాన్ని సృష్టించి తద్వారా రాజకీయ ప్రయోజనం పొందుతున్న బిజెపి ఆలోచనా విధానాలను ప్రజలు తెలుసుకోవాలన్నారు. అమాయక ముస్లిం మైనార్టీలపై అక్రమ కేసులు బనాయించి వారిని దేశద్రోహులుగా చిత్రికరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదువేల మైనారిటీ పాఠశాలలను మూసివేశారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా ఉంటే తమ ఆటలు సాగవని, రాజ్యాంగాన్ని మార్చలేమని గుర్తించి ప్రజల మధ్య విద్వేష రాజకీయాలను సృష్టిస్తున్నారని విమర్శించారు. అటల్ బీహారి వాజపేయ్ మైనారిటీలు లేకపోతే ప్రభుత్వాలు సైతం నిలబడవు అన్న మాటలు బీజేపీ నాయకులు గుర్తు చేసుకోవాలన్నారు. నాడు కాంగ్రెస్ ప్రకటించిన ఏమర్జెని సైతం నేడు,బీజేపీ మత పరంగా విభజించి గొడవలు సృష్టించి రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నదని విమర్శించారు.సెక్యులరిజం కోసం నిలబడాలంటే దమ్ము, ధైర్యం ఉండాలని మైనారిటీలుగా మేము నిలబడాతము మీకు ఆ దమ్ము ఉందా ? అని ప్రశ్నించారు. మైనారిటీలను ఎంత అనగదొక్కితే అంత ఉవ్వేతున్న దేశ భక్తి తో భారతదేశ అభివృద్ధి కోసం పనిచేస్తారని అన్నారు.ఈ సందర్భంగా ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్బాస్ మాట్లాడుతూ మైనార్టీలు విద్య ఆర్థిక రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్నారని, మైనార్టీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని, ఏ రాజకీయ పార్టీ వచ్చిన మైనార్టీలను ఓటు బ్యాంకు రాజకీయాలుగా వాడుకుంటున్నారని అన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ దేశంలో లౌకిక విలువల పరిరక్షణ కోసం,ప్రజల మధ్య ఐక్యత పెంచడం కోసం ఆవాజ్ రాష్ట్ర మహాసభలు జరగాలని ఆ దిశగా విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జ్ సరిత మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ పార్టీ సానుకూలంగా ఉన్నదని, విద్యా,ఉద్యోగ,రాజకీయ రంగాలలో జనాభా ప్రాతిపాదికన రాజకీయ అవకాశాలు కల్పించి,సంక్షేమ పథకాలు అమలుకు ప్రయత్నం చేస్తున్నదని అన్నారు.ఈ బహిరంగ సభకు గద్వాల జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాస్, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి జబ్బార్,బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట రాములు, జేఏసీ నాయకులు మధుసూదన్ బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి ఆవాజ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రహమాతుల్ల,మాజీ కౌన్సిలర్ ఇస్సాక్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు తాహేర్, పాలమూరు అధ్యయన వేదిక ఇక్బాల్ పాషా,పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు సుభాన్, టీపీఎఫ్ శంకర ప్రభాకర్, బి ఆర్ ఎస్ వి రాష్ట్ర నాయకులు కుర్వ పల్లయ్య,బి ఆర్ఎస్ నాయకులు గంజిపేట రాజు,సీఐటీయూ వివి నరసింహ,ఉప్పేర్ నరసింహ,మహిళా సంఘం నర్మదా, మౌలానా ఫహీం,పాస్టర్ వసంత్ కుమార్,టవర్ మక్బూల్, దౌలత్, వివిధ సామాజిక ప్రజా సంఘాలు,రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు



**హయత్‌నగర్, జూలై 13 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ కాస్మోపాలిటన్ కాలనీ పార్క్ లో ప్రజల విశ్రాంతి, ఆరోగ్య పరిరక్షణ కోసం వ్యయం 7.60 లక్షల రూపాయలతో చేసిన మిగులు పార్క్ సుందరీకరణ పనులను జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి, స్థానిక కాలనీ వాసులతో కలిసి రిబ్బన్ కట్ చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నూతనంగా వాకింగ్ ట్రాక్ నిర్మాణం, గ్రీనరీ అభివృద్ధి కోసం మొక్కలు నాటారు, పార్క్ పరిసరాల స్వచ్ఛత, అందమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయడమైనదని వారు తెలిపారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని, ప్రగతితో ప్రజల జీవన ప్రమాణం పెరుగుతుందని వారు గుర్తు చేశారు. ప్రజల ఆరోగ్యానికే కాదు, కుటుంబ సమయానికి, పిల్లల ఆటలకు అనువైన వాతావరణం కోసం ఈ అభివృద్ధి పనులు చేయడం జరిగిందని వారు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగుపరుచుకోవడానికి ఈ పార్క్ లోని చెట్లను ఉపయోగించుకోవాలని వారు పేర్కొన్నారు. కాలనీ లో ఉన్న ఓపెన్ స్పేస్ గల బేస్మెంట్ గ్రౌండ్లో నూతన బోర్, చైన్ లింక్ మెష్ ఏర్పాటుకు 15.00 లక్షల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని త్వరలోనే వాటి పనులు మొదలవుతాయని వారు అన్నారు. పార్కు లో అసాంఘిక కార్యక్రమాల విషయంలో పక్కన ఉన్న వీకర్ సెక్షన్ కాలనీ తో ఉన్న విభేదాల విషయం పై ప్రత్యేక చొరవ తీసుకొని జటిలమైన సమస్యను పరిష్కరించినందుకు, పార్క్ అభివృద్ధి కొరకు కృషి చేసిన కార్పొరేటర్ కు కాలనీ వాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు రుద్ర లక్ష్మీనరసింహ, పి శ్రీనివాసరావు, గిరిజాల శ్రీకాంత్, గంజి సత్తయ్య, భాస్కర్, జ్ఞానేశ్వర్, సుధాకర్ రెడ్డి, రమేష్, సీతయ్య, రాజవర్ధన్ రెడ్డి, మల్లేష్ గౌడ్, గట్టుమల్లు, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సిరిపురం ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో అన్నంలో పురుగులు



**మర్పల్లి, జూలై 13 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని సిరిపురం గ్రామంలోనీ ఎస్సీ హాస్టల్లో విద్యార్థులకు పెట్టిన అన్నంలో పురుగులు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహంతో పురుగులు ఉన్న అన్నాన్ని పారబోయించారు. ఆదివారం విద్యార్థులకు చికెన్ తో భోజనంతో వడ్డించారు. అన్నంలో మాత్రం నల్లగా పురుగులు వచ్చాయి. దీంతో కొంతమంది విద్యార్థులు పురుగులను గమనించి వారి తల్లిదండ్రులకు తెలుపగా, సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పురుగులతో కూడిన అన్నాన్ని తమ పిల్లలు తిని ఏదైనా జరగరాని జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రభుత్వం సూచించిన మెను ప్రకారమే వడ్డించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

## బీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి కృషి చేయాలి


- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య



**శంకర్‌పల్లి, జూలై 13 (జనం సాక్షి) :** బీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం అధ్యక్షుడు బండమీది వెంకటయ్య సమక్షంలో శంకర్ పల్లి మండల కమిటీ నూతన కార్యవర్గం ఎన్నికయింది. నూతన కార్యవర్గ సభ్యులకు ఆదివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య సమక్షంలో నియామక పత్రాలు అందజేశారు. శంకర్ పల్లి మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా మన్నె వెంకటేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా వడ్ల నరసింహ చారి, మండల ప్రధాన కార్యదర్శిగా మంగలి సంపత్ కుమార్ నియమితులైనట్లు ప్రకటించారు. వారికి నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ గ్రామ గ్రామాన మరియు మండలాల కమిటీలు ఏర్పాటుచేసి బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్క బీసీ కులస్తులు యువత కృషి చేయాలని సూచించారు.కుల మతాలకు అతీతంగా అందరిని సమన్వయ పరుస్తూ మండల కమిటీలు గ్రామ కమిటీలు యువత కమిటీలు మహిళా కమిటీలు వేయడం ద్వారా బీసీలు ఐక్యమత్యం అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల సత్తా చాటాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీసీ కులస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.శంకర్ పల్లి మండల కమిటీ ఏర్పాటు చేయడం వల్ల చేవెళ్ల నియోజకవర్గం అధ్యక్షుడు బండమీది వెంకటేష్ ను జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య అభినందించారు.

# ఫామ్‌హౌస్ రాజకీయాలు మానుకోవాలి

- కాంగ్రెస్ ది గడీల పాలన కాదు ప్రజా పాలన
- ఎమ్మెల్సీ కవితపై మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల ఆగ్రహం



**కేశంపేట్, జూలై 13 (జనం సాక్షి) :** ఎమ్మెల్సీ కవిత తన తండ్రి కెసిఆర్ చేసే ఫామ్ హౌస్ రాజకీయాలు మానుకొని రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు చేస్తున్న సంక్షేమాన్ని కళ్ళు తెరుచుకొని చూడాలని మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హితవు పలికారు. మండల పర్యటనలో భాగంగా కాకునూరు గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఎమ్మెల్సీ కవిత తీవ్ర స్థాయిలో విమర్శించడంపై కొత్తపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు రాణి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి విశాల మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగేళ్ల పాటు తెలంగాణ జాగృతి పేరుతో హడావిడి చేసిన కవిత ఆ తర్వాత ఎందుకు తమ కార్యక్రమాలను కొనసాగించ లేకపోయారో చెప్పాలన్నారు. జాగృతి పేరుతో మీరు చేసే అక్రమాలను భరించలేక జనం జాగృతం అయి మీ పార్టీని ఇంటికి పంపారన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని కవితక్క ఏలాంటి టెన్షన్ పడాల్సిన అవసరం లేదన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ పార్టీ దుకాణం పూర్తిగా బంద్ కాబోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారాలను మాని మీ పార్టీలో దయ్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. మండలానికి వచ్చిన మిమ్మల్ని మీ పార్టీలోనే పలకరించే దిక్కు లేదని ముందు ఇంట గెలిచి రచ్చ గెలవాలన్నారు. ఇది గడీల పాలన కాదని ప్రజాపాలన అని అన్నారు. బీసీ రిజర్వేషన్లు తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, బీసీ రిజర్వేషన్లకు బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ బి బ్లాక్ అధ్యక్షురాలు అనసూయమ్మ మాట్లాడుతూ... లిక్కర్ రాణి కవిత కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ఆరోపణలు చేయొద్దన్నారు. నిత్యం ప్రజల కోసం పనిచేసే తమ నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ఇష్టాను సారంగా మాట్లాడితే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయి కవితది కాదన్నారు. మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రాణి మాట్లాడుతూ.... బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ ఊరిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చారో చెప్పాలన్నారు. గ్రామాల్లో పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లను ఇస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీ దేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మహిళల కోసం మీరు చేసిందేమిటో చెప్పాలని సవాల్ విసిరారు. అధికారంలో ఉన్నప్పుడు మహిళల కోసం ఏం మాట్లాడని నువ్వు రేవంత్ రెడ్డిని విమర్శించడం సరైన పద్ధతి కాదన్నారు. మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న రేవంత్ రెడ్డిని జాగృతి కార్యక్రమాల పేరుతో విమర్శిస్తే మీకు తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ సమావేశంలో అరుణ, సుజాత, కళమ్మ ఆస్మా, లలిత , సువర్ణ, లక్ష్మి , మణెమ్మ నర్సమ్మ, చెన్నమ్మ పాల్గొన్నారు.

## అంతర్గత మురుగు కాల్వల నిర్మాణానికి కృషి



**కేశంపేట, జూలై 13 (జనం సాక్షి) :** మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో అంతర్గత మురుగు కాలువల నిర్మాణానికి కృషి చేయనున్నట్లు మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ పట్లూరి జగదీశ్వర్ తెలిపారు. కొత్తపేట, ముధార్ పూర్ కాలనీలలో మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేను కోరగా స్పందించిన ఎమ్మెల్యే మురుగు కాలువలు ఎక్కడ నిర్మించాల్సిన అవసరం ఉందో ప్రతిపాదనలు పంపాలన్నారు. పిఆర్ ఏఈ నర్సింగ్ రావు తో కలిసి జగదీశ్వర్ గ్రామంలో మురుగు కాలువల నిర్మాణానికి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పట్లూరి మహేశ్వర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంజయ్య, నాయకులు రంగు శంకర్ ఉస్మాన్, శ్రీధర్ పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
14 జూలై 2025

# తెలంగాణలో కర్ణాటక కాలుష్యం చిచ్చు..

- కడేచూర్ పరిశ్రమల కాలుష్యం
- కలుషితం అవుతున్న నీరు
- వ్యాధుల బారిన పడుతున్న సరిహద్దు గ్రామాల ప్రజలు
- పరిశ్రమలు మూసివేయాలి
- అఖిలపక్ష నాయకులు, బిఆర్ఎస్ యువనాయకుడు శివరాజ్ పాటిల్



**కృష్ణ, జూలై 13 (జనం సాక్షి) :** కర్ణాటక పరిశ్రమలు తెలంగాణ గ్రామాల్లో కాలుష్యం చిచ్చు రేపుతున్నాయి.కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లాలోని కడిచూర్ - బాడిహాల్ ప్రాంతాల్లో నెలకొల్పిన పరిశ్రమల పరిధిలో పని చేస్తున్న రసాయనిక కంపెనీల కారణంగా తీవ్రమైన కాలుష్యం ఏర్పడుతున్నది. సరిహద్దు ప్రాంతమైన తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లాలోని కృష్ణ మండల గ్రామాల ప్రజలకు రానున్న రోజుల్లో తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. మండలంలోని చెగుంట, ఐనాపూర్, (ఎస్కేపల్లి) సూకూర్ లింగంపల్లి, అలంపల్లి, కున్సీ, గుర్జాల్ వంటి గ్రామాల్లో ప్రజలు ప్రమాదంలో పడుతు న్నారు. “మదర్ ఎర్త్” అనే పెద్ద కంపెనీ నాలుగు రాష్ట్రాల నుండి ఆసుపత్రుల మలినాలను తెచ్చి రసాయనాల ఉత్పత్తి చేస్తోంది. ఈ కంపెనీ నుండి తీవ్రమైన దుర్వాసన, విషవాయువులు విడుదలవుతున్నాయి. అంతేకాకుండా కాలుష్యజలాలను వాగులలో వదలడం వల్ల మురికి నీరు గ్రామాల వరకూ ప్రవహిస్తోంది. దాంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు ఎక్కువగా కాలుష్యం విషవాయువుతో తలనొప్పులు, వాంతులు, శ్వాసకోశ సంబంధ సమస్య అనేక అనారోగ్యాల పాలు అవుతు న్నారు.ప్రజలు ఇంటి తలుపులు, కిటికీలను మూసేసుకొని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పరిశ్రమల సమస్యపై కృష్ణ మండల అఖిలపక్ష నాయ కుల ఆధ్వర్యంలో,ఆందోళనకు సిద్ధమవుతున్నారు. బిఆర్ఎస్ యువనాయకుడు శివరాజ్ పాటిల్ నేతృత్వంలో తెలంగాణ మత్స్య,పాడి పరిశ్రమ, క్రీడాయువజన శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరికి వినతి పత్రం సమర్పించారు. అలాగే తెలంగాణ ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కి ఒక ప్రతిని పంపించారు.

**ప్రజల డిమాండ్లు**

కాలుష్యాన్ని వ్యాప్తి చేస్తున్న కంపెనీలపై తక్షణ విచారణ జరిపిపర్యావరణ అనుమ తుల పునఃసమీక్ష చేసి తక్షణ కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తు న్నారు.,అవసరమైతే కాలుష్యకారక పరిశ్రమలను తాత్కాలికంగానిలిపివేయాలని కోరుతున్నారు.కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి శాశ్వత పరిష్కారం చూపాలని కాలుష్యం బారి నుంచి రక్షించాలని కోరుతున్నారు.

# యువత వ్యాపార రంగాల్లో రాణించాలి

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సదాశివపేట, జూలై 13 (జనం సాక్షి) :** యువత వ్యాపార రంగాలను ఎంచుకొని ఆర్థికంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సదాశివపేట మండల పరిధి మద్దికుంట చౌరస్తాలో నిర్వాహకులు అబ్దుల్ హర్షద్, మహమ్మద్ అజరుద్దీన్ లు నూతనంగా ఏర్పాటు చేసిన దేసి డక్కన్ దాబాను శనివారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతా గోపాల్, మద్దికుంట మాజీ సర్పంచ్ ఆరిఫ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఆరిఫ్, డెక్కన్ దేసి దాబా నిర్వాహకులు పాల్గొన్నారు.

# కరాటేతో ప్రతి ఒక్కరికీ ఆత్మరక్షణ



**మక్తల్, జూలై 13 (జనంసాక్షి) :** మాస్టర్ బుడోకాన్ కరాటే డు స్పోర్ట్స్ ఆధ్వర్యంలో మక్తల్ పట్టణంలోని బాలల ఉన్నత పాఠశాల గ్రౌండ్ ఆవరణలో ఆల్ ఇండియా చీఫ్, ఎగ్జామినర్ సయ్యద్ ఇస్మాయిల్, ఇన్స్ ట్రక్టర్ బ్లాక్ బెల్ట్ టు డాన్ మహమ్మద్ ఆరిఫ్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ ను విజయవంతంగా నిర్వహించారు. సుమారు 50 మందికి పైగా విద్యార్థులు కరాటే గ్రేడింగ్ టెస్టులో పాల్గొనగా పదిమందికి ఎల్లో బెల్ట్, పదిమందికి ఆరెంజ్ బెల్ట్, 8 మందికి బ్లూ బెల్ట్, ఇద్దరికీ మెరూన్ బెల్ట్, బ్రౌన్ బెల్ట్ ఆరు మందికి, చివరగా అత్యున్నతమైన బ్లాక్ బెల్ట్‌ను 14 మందికి అందజేశారు. ఈ సందర్భంగా మాస్టర్ సయ్యాద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ కరాటే కేవలం ఆత్మ రక్షణకు మాత్రమే వినియోగించాలని, కరాటే తో శారీరక మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ మాస్టర్ ఇస్మాయిల్, హమీద్, విద్యార్థుల తల్లిదండ్రులు బలరాం, హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం పక్కా..

- స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజాపాకు మెజార్టీ స్థానాలు
- మోడీ పాలనకు ఆకర్షితులవుతున్న యువత
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుఅదెల్లి రవీందర



**సంగారెడ్డి, జూలై 13 (జనం సాక్షి) :** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకొని భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ బీజేపీ మండల సమావేశం మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి అదెల్లి రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు మోడీ పాలనను కోరుకుంటున్నారని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం పక్క అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని యువత మోడీ పాలనను కోరుకుంటున్నారని ఆయన అన్నారు. అధికారంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. ఎన్నికల సమయంలో పథకాల హామీతో తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్నారని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. బిఆర్ఎస్ పార్టీ తెలంగాణలో విశ్వాసం కోల్పోయిందని. ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా భారతీయ జనతా పార్టీ ని ప్రజలు ఆదరిస్తున్నారని అన్నారు. త్వరలో జరగబోయే సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పిటిసిలు అలాగే మున్సిపాలిటీ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని రవీందర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎల్లయ్య, మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, వేమరెడ్డి, ప్రధానకార్యదరషులు, శక్తి కేంద్రం ఇంచార్జ్ లు పాల్గొన్నారు.

# గౌడ కులస్తుల బోనాలలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సదాశివపేట, జూలై 13 (జనం సాక్షి) :** పట్టణంలోని గౌడ కులస్తుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆషాడ మాస బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు డప్పు వాయిద్యాల మధ్య మహిళలు పెద్ద ఎత్తున బోనాల ఊరేగింపు గాంధీ చౌక్ మీదిగా దుర్గమ్మ గుడి వరకు నిర్వహించి, అనంతరం గ్రామదేవతలు, పోచమ్మ గుడి, దుర్గమ్మ గుడి లో అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. అనంతరం గౌడ కులస్తులు ఎమ్మెల్యేనీ శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు. బోనాల ఊరేగింపులో మాజీ మున్సిపల్ చైర్మన్ అపర్ణ శివరాజ్ పాటిల్ ,మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్, చింత సాయినాథ్, సిహెచ్ శ్రీనివాస్ గౌడ్, నాగరాజు గౌడ్ ,రమేష్ గౌడ్, నరసింహ గౌడ్, శంకర్ గౌడ్ ,పెద్ద గౌడ్, గౌడ యూత్ సభ్యులు, మహిళలు ఉన్నారు.

# జర్నలిస్టుల నిర్మాణానికి కృషి చేస్తా ..



**తూప్రాన్, జూలై 13 (జనం సాక్షి) :** ముప్పిరెడ్డిపల్లి శివారులో జర్నలిస్టులకు ఇచ్చిన నిర్మాణానికి కృషి చేస్తానని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు ను తూప్రాన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కంఠాయపాలెం వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గైనిభైటి భాస్కర్ గౌడ్, సీనియర్ జర్నలిస్ట్ లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్ బిజెపి నాయకులు కలిసి ముప్పిరెడ్డిపల్లి లోని జర్నలిస్ట్ లకు ఇళ్ల నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కు, జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి నీ కలిసి మంజూరి చేయిస్తా అని ఉమ్మడి తూప్రాన్ మండల విలేకరులకు ఎంపీ హామీ ఇచ్చారు. కాగా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావును మర్యాద పూర్వకంగా తూప్రాన్ ప్రెస్ క్లబ్ నాయకులు ఆదివారం కలిసి పరామర్శించారు. గత వారం రోజుల క్రితం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో శస్త్ర చికిత్స అనంతరం కోకాపేట లోని అతని స్వగృహంలో కలిసి ప్రజా క్షేత్రంలో సేవ చేయడానికి తొందరగా కోలుకోవాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ తెలిపారు. శాస్త్ర చికిత్స అనంతరం శనివారం ఉదయం కుట్లు ఇప్పి ఇంటికి చేరుకున్న విషయం తెల్సుకుని ఎంపీ నీ తూప్రాన్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్ తో కలిసి తూప్రాన్ ప్రెస్‌క్లబ్ నాయకులు ఎంపీనీ పరామర్శించారు.


# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



**సదాశివపేట, జూలై 13 (జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతికి బోనాలు, వేడుకలు ప్రతీకలుగా నిలుస్తాయని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని మహంకాళి అమ్మవారి బోనాలు వేడుకల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ స్థానిక నాయకులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండేందుకు, ఆషాడ మాసంలో గ్రామదేవతలకు బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో బోనాలు వేడుకలకు ప్రాముఖ్యత పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతాగోపాల్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పులి మామిడి రాజు, నాయకులు చింత సాయినాథ్, మాజీ కౌన్సిలర్ లు ఇంద్రమోహన్ గౌడ్, సాతాని శ్రీశైలం, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల మాణిక్ రావు,నాయకులు గారెల తుల్జారాం, వాదోని రాజు, మన్నే విజయ్, ఆలయ కమిటీ సభ్యులు నల్ల నల్ల శంకర్, చాపల హనుమంతు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ తల్లి అందరినీ చల్లగా చూడాలి

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



**తూప్రాన్, జూలై 13 (జనం సాక్షి) :** ముత్యాలమ్మ తల్లి సమస్త ప్రజానీకాన్ని అందరినీ చల్లగా చూడాలని అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో ఉండేటట్లు చూడాలని ప్రార్థించినట్లు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు .మనోహరాబాద్ మండలం కేంద్రంలో బోనాల ఉత్సవాల సందర్భంగా ఆయన ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏడాది గ్రామా ప్రజలు అమ్మ వాళ్లకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పిస్తున్నారన్నారు. పురాతనం నుండి వస్తున్న సంప్రదాయాలను ఆచరించడం మన కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్ల ఫోరం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, జావేద్, శశిభూషణ్ రెడ్డి, రమేష్ ,వీరు, శంకర్ నవీన్, వెంకట్, వెంకటేష్, సత్తిరెడ్డి, రింకు, శ్రీనివాస్, గ్రామ పెద్దలు పుర ప్రముఖులు గ్రామస్తులు పాల్గొన్నారు.


# మహంకాళి అమ్మవారికి బంగారు ఆభరణాలు



**సదాశివపేట, జూలై 13 (జనం సాక్షి) :** పట్టణంలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి బంగారు ఆభరణాలను పులిమామిడి రాజు దంపతులు అందజేశారు. ఆషాడ మాసం పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని మహంకాళి అమ్మవారి బోనాల వేడుకల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పులిమామిడి రాజు దంపతులు అమ్మవారికి ఒడిబియ్యం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి బంగారు ఆభరణాలు అందించారు. అనంతరం పూలి మామిడి రాజు మాట్లాడుతూ అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లోడి విశ్వనాథం, ఆలయ కమిటీ సభ్యులు నల్ల శంకర్, హనుమంతు, బగిలి విష్ణు, నర్సింలు, తాలెల్మ రాము, బోయిని రమేష్, బామిని రవి, రాగం అనిల్, సోమశేఖర్, పిఎన్ఆర్ యువసేన సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం

- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి



**బిజినేపల్లి, జూలై 13 (జనం సాక్షి) :** నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి తెలిపారు. మండలంలోని నంది వడ్డెమాన్లో ఆదివారం 37 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 30 మందికి పత్రాలు అం దజేసి పలువురు లబ్దిదారుల ఇంటి నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం నిరుపేదలకు ఇండ్లు ఇవ్వకుండా పదేళ్ళ పాటు మాయమాటలు చెప్పి మోసం చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రజల అవసరాల అనుగుణంగా పాలన సాగిస్తూ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రేషన్ కార్డులు, రూ.2 లక్షల రుణమాఫీ, రూ.5 వందలకే గ్యాస్ సిలిండర్, 2 వందల యూనిట్ల ఉచిత విద్యుత్, ఫ్రీబస్ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కతలప్ప, పంచాయతీ కార్యదర్శి లింగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, డీసీసీ ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, నజీర్, రేమొదుల రమేష్, అవుల రాములు, వీరశేఖరాచారి, వేమ వెంకట్రాములు, రామకృష్ణ, రామచందర్, జయకృష్ణ, అమృత్ రెడ్డి, రాగి మధుసూదన్ రెడ్డి, నరేందర్ గౌడ్, పండ్ల పాష, ముక్తార్, భగవంత్ గౌడ్, కత్తె ఈశ్వర్, చెన్నయ్య, ఆయా గ్రామాల మండల నాయకులు పాల్గొన్నారు.

# చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా మత్స్యకార సహకార సొసైటీ ఉపాధ్యక్షుడు తుమ్మల అల్లు అర్జున్



**బిజినేపల్లి, జూలై 13 (జనంసాక్షి) :** మత్స్యకారులు అందుబాటులో ఉన్న చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లాభపడాలని జిల్లా మత్స్యకార సహకార సొసైటీ ఉపాధ్యక్షుడు తుమ్మల అలోజీ అన్నారు. మండలంలోని ఖానాపూర్ లోని టైనీ ఫిన్స్ ఫిషరీస్ చేప విత్తనాల ఉత్పత్తి కేంద్రాన్ని జిల్లాలోని ఆయా గ్రామాల మత్స్యకార సహకార సొసైటీల సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించి పరిశీలించి మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో చేప విత్తన ఉత్పత్తి కేంద్రాల్లో టెక్నిషియన్గా పదేళ్ల అనుభవంతో నిర్వాహకులు ఇక్కడ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసి నాణ్యమైన చేవ పిల్లల ఉత్పత్తి చేపట్టడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఉప్పునీటిలో ఉత్పిత్తి చేసే చేప విత్తనాలను వ్యయ ప్రయాసాలకు ఓర్చి తెచ్చి చెరువుల్లో వదిలితే అవి సరైనా తూకం రాకపోవడంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఎక్కడ కూడా చేప విత్తనాల ఉత్పత్తి కేంద్రం లేకపోవడంతో మధ్య దళారుల ద్వారా రూ. లక్షలు వెచ్చించి నాసిరకం చేప పిల్లలతో తీవ్రంగా నష్టం వాటిల్లిందన్నారు. ఈప్రాంత వాతావరణంలో, ఇక్కడి నీటిలోనే చేప విత్తనాల ఉత్పత్తి చేపట్టడం వల్ల వాటిని చెరువుల్లో వదిలిన వెంటనే ఒకే విదమైన వాతావరణం, నీళ్ళు కావడం వల్ల చేప పిల్లలు ఆరోగ్యవంతంగా ఎదిగి పది నెలల కాలంలోనే కిలో నుంచి కిలోన్నర తూకం వస్తాయా అన్నారు. అంతేకాకుండా రవాణా చార్జీలు, కాలం తగ్గి చేపపిల్లల మరణాలను నివారించుకోవడం వల్ల తక్కువ మోతాదులో చేపవిత్తనాలను కొన గోలు చేసి పెటుబడి ఖర్చులను కూడా తగ్గించుకోవచ్చన్నారు. ఒకవేళ చేపపిల్లల ఎదుగుదల సక్రమంగా లేకుంటే అందుబాటులో ఉండే నిర్వహక లను నిలదీసి నష్టపరిహారం పొందవచ్చని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోనే పెద్ద ఎత్తున చేప పిల్లల విత్తన కేంద్రం మన ప్రాంతంలో ఉం డడం గొప్ప విషయమన్నారు. ఈసందర్భంగా నిర్వహకులు స్వరూప్ సింగం శెట్టి, రితేష్ కుమార్ సింగ్ లు మాట్లాడుతూ దేశంలోనే అత్యదినంగా మంచినీటి చెరువులు తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నాయని, వాటిలో సరైన అవగాహనతో చేపల పెంపంకం చేపడితే మత్స్యకారులు అధిక ఆదాయం పొందవచ్చని అన్నారు. చేప పిల్లల ఉత్పత్తిలో నాణ్యత ప్రమాణాలకు ఎక్కడ కూడా రాజీ పడకుండా ఉత్పత్తి చేస్తున్నామని అన్నారు. చేపల పెం పకంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు ఎంత విస్తీర్ణం చెరువులో ఎన్ని చేప పిల్లలు వదలడం మంచిదని పలువురు మత్స్యకార సొసైటీల సభ్యులు నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫిషరీస్ సొసైటీ సెక్రటరీ వెంకటస్వామి, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తెప్ప తిరుపతయ్య, మండల అధ్యక్షుడు హరికృష్ణ, గొర్ల శ్రీనివాసులు, తిరుపతయ్య, మిద్దె యాదయ్య, సలేశ్వరం, ఉమ్మడ జిల్లా మాజీ డైరెక్టర్ బొందయ్య, సహదేవుడు, సైదులు, ఈర్ల శ్రీకాంత్, కాళ్ల లింగమయ్య, పిట్లల తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

# పోచమ్మ బోనాల భక్తులకు ఇబ్బందులు



**తోపులాట, పెనుగులాటతో అవస్థలు**

**చేతులు ఎత్తేసిన పూజారి**

**పట్టించుకోని పోలీసులు**

**కొమరం భీమ్ బాద్ జిల్లా బ్యూరో జులై 13 (జనం సాక్షి) :** పోచమ్మ బోనాల భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆషాడం మాసంలో 4 ఆదివారాలపాటు పోచమ్మ అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పిస్తారు. అయితే ఇక్కడ ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో రావడంతో తోపులాట, పెనుగులాట చోటుచేసుకుంది. ఆలయం చిన్నదిగా ఉండడంతో భక్తులు ఉక్క పూత , తోపులాటతో ఆదివారం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివరాలకు వెళ్తే కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని పోచమ్మ ఆలయం ( పోచమ్మ బస్తి) లో ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించడానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు. దీంతో అక్కడ ఆలయంలో నిర్వహణ లేక భక్తులు అవస్థలకు గురయ్యారు. ఆలయానికి కమిటీ లేకపోవడం, స్థానిక పోలీసులు సైతం దృష్టి పెట్టకపోవడంతో భక్తులు ఆలయ పూజారి, పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత ఇబ్బందులు పడుతుంటే పోలీసులు ఎక్కడ అంటూ..? పలువురు భక్తులు ఆవేశంగా ఊగిపోయారు. గత నెల 28 వ తేదీ నుండి బోనాల పండుగ ప్రారంభమైంది. వచ్చే ఆదివారం 20 వ తేదీ తో బోనాల ఉత్సవాలు ముగిస్తాయి. ఆదివారం తో పాటు మధ్యలో బుధవారం సైతం అమ్మవారికి భక్తులు నైవేద్యాలు బోనాలు సమర్పిస్తారు. వీటితోపాటు కొబ్బరికాయలు, కోళ్లు నైవేద్యంగా సమర్పిస్తారు. అసలే ఆలయం చిన్నదిగా ఉండడం, అందులో నిర్వహణ లేకపోవడం, అంతకుమించి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నత శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని భక్తుల కోరుతున్నారు.

**డయల్ 100 కు పోలీస్ స్పందన..!**

భక్తులు ఆలయంలో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఒక భక్తుడు డయల్ 100 కు కాల్ చేయగా .. పోలీసులు స్పందించారు. కేవలం ఇద్దరు పోలీసులు మాత్రమే అక్కడికి చేరుకొని నామాత్రంగా విధులు నిర్వహించారు. బోనాలు సమర్పించడానికి మహిళా భక్తులు ఎక్కువగా వస్తుంటారు. కానీ లేడీ కానిస్టేబుల్ లు రాకపోవడంతో.. పురుష కానిస్టేబుల్ ఆలయం వెలుపల ఉండిపోయారు. మహిళా కానిస్టేబుల్లు వచ్చి భక్తుల రద్దీని క్రమబద్ధీకరిస్తే భక్తులకు అవస్థలు తప్పేవని... ఇకమీదటైనా మహిళా కానిస్టేబుల్ లను ఏర్పాటుచేసి భక్తులకు ఇబ్బందులు కలవకుండా చూడాలని పట్టణ ప్రజలు, భక్తులు కోరుతున్నారు

# యూరియా సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..**




**వరంగల్ ప్రతినిధి , జూలై 13 (జనంసాక్షి):** యూరియా సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూరియా నిల్వలు, సరఫరా, రైతులకు అందుబాటు వంటి అంశాలపై వ్యవసాయ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీజన్లో రైతులకు అవసరమైన పరిమాణంలో యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా యూరియా నిల్వలు డిమాండ్ సరఫరా వివరాలను సమగ్రంగా విశ్లేషించి సమయానికి ఎరువులు అందేలా చూడాలని అధికారులను సూచించారు. అలాగే నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేలా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఈ అంశం లో వ్యవసాయ శాఖ అధికారులు ముందుండి పని చేయాలన్నారు. రైతులు ఎరువుల కొరత లేకుండా చూడాలని, అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల ద్వారా సరిపడా యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ణయించిన ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈపాస్ విధానం ద్వారానే యూరియా సరఫరా చేయాలన్నారు. యూరియా సరఫరా నివేదిక ప్రతిరోజు సమర్పించాలన్నారు. యూరియా సరఫరా సజావుగా జరుగుటకు గ్రామాల వారిగా మ్యాపింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే రైతులను రద్దీ తగ్గించుటకు ముందుగానే టోకెన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సంబంధిత అధికారులు తరచుగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, జిల్లా సహకార అధికారి ఇన్చార్జ్, జిల్లా ఉద్యానవనాధికారి శ్రీనివాస రావు, వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల ఉద్యానవనాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# నిర్మల్‌లో ఘనంగా బోనాల పండుగ

**నిర్మల్ బ్యూరో, జూలై 13(జనం సాక్షి):** బోనాల పండుగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బంగాల్పేట్ మహాలక్ష్మి దేవాలయం తో బుధవార్పేట్,ప్రియదర్శిని నగర్, ధ్యాగవాడ,బేస్తవార్ పేట్,ప్రియదర్శినినగర్ వివిధ కాలనీలలో బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు.ఉదయం నుండి మహిళలు, పురుషులు బ్యాండ్ మేళాలు,డిజే చప్పుళ్ళతో నృత్యాలు చేస్తూ బోనాలు నెత్తిన పెట్టుకుని మహాలక్ష్మి,పోచమ్మ లకు నైవేద్యం తో మొక్కులు తీర్చుకున్నార.వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా శివసత్తులు,ఆటా పాటలతో పండుగ వాతావరణంలో జాతరను మైపరిపించేలా జరుపుకున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



**ఖానాపూర్ జూలై 13 (జనం సాక్షి) :** పట్టణ పొలిమేరలోని కొమురం భీమ్ చౌరస్తా వద్ద బాసర మంచిర్యాల ప్రధాన రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్ ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జన్నారం మండలం ఇంధన్ పల్లి గ్రామానికి చెందిన చొప్పదండి లక్ష్మణ్ (25) పడిగెల జస్వంత్ (19) ఇద్దరు యువకులు లక్ష్మణ్ వివాహ వేడుకను పురస్కరించుకొని వివాహ ఆహ్వాన పత్రికలను బంధుమిత్రులకు అందజేసేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో కొమురం భీమ్ చౌరస్తాకు సమీపంలో గల మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్ ను ఢీకొని చెట్ల పొదల్లో పడిపోయింది. ఇద్దరు యువకులకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు జస్వంత్ తల్లి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కాగా ఘటనా స్థలాన్ని సిఐ సిహెచ్.అజయ్ పరిశీలించారు.

# వర్షాలు పడాలని కప్పతల్లి ఆట



**బచ్చన్నపేట జూలై 13 ( జనం సాక్షి):** వర్షాలు లేక పునాస పంటలు ఎండిపోవడం. వరి నాట్లు పడకపోవడంతో మండలంలోని ఆలింపురం గ్రామంలో మహిళలతోపాటు పిల్లలు పురాతనం నుండి వస్తున్నా ఆచారం ప్రకారం కప్పను రోకలి బండకు కట్టి గ్రామంలో ప్రతి వాడ తిరుగుతూ కప్పపై నీళ్లు పోయిస్తూ ఉంటారు అందువల్ల వర్షాలు బాగా కురుస్తాయని నమ్మకం ఆదివారం ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ మాజీ ఎంపీటీసీ మసూద్ కప్పతల్లి పై నీళ్లు పోసి వర్షాలు బాగా కురవాలని కోరుకున్నారు

# కరాటేలో రాణిస్తున్న అక్కాచెల్లెలు



**చెన్నారావుపేట, జూలై 13 (జనం సాక్షి):** మండలంలోని తిమ్మరాయిని పహాడ్ గ్రామంలోని చంద్రు తండాకు చెందిన బానోతు జాన్వి, గీతిక అనే అక్కా చెల్లెలు కరాటేలో రాణిస్తున్నారు. ఆరేళ్ల వయసు నుండే కరాటేలో రాణించాలని చిన్నారుల తల్లిదండ్రులు బానోతు శ్రీను, సుశీలలు కలలుగన్నారు. కరాటే మాస్టర్ రమేష్ శిక్షణకై తమిళనాడు అవడికి జాన్వి, గీతికలను పంపించారు.ఇక అంతే ఓవైపు చదువులో రాణిస్తూనే మరోవైపు కరాటేలో సైతం తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును పొందుతున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని అవడిలో ఆదివారం జరిగిన 5వ అలన్ తిలక్ ఈస్ట్ తిరువలూరు డిస్టిక్ కరాటే ఛాంపియన్ షిప్ 2025 పోటీలలో సైతం ఇద్దరు పాల్గొని తమ అతి తమ ప్రతిభను కనబరిచి పతకాలు, ప్రశంస పత్రాలను సాధించారు. అతి చిన్న వయసులోనే అందరిచేత మన్ననలను పొందుతున్నారు. ప్రస్తుతం జాన్వి 4వతరగతి, గీతిక 2వతరగతి చదువుతున్నారు. తమ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మరింతగా కరాటేలో రాణించేందుకు తమిళనాడు అవడిలో శిక్షణ పొందుతున్నారు. ప్రస్తుతం చిన్నారులు మొబైల్ ఫోన్ లకు అతుక్కుపోతున్న క్రమంలో తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేసేందుకు పాటుపడుతున్న వారి కృషి అభినందనీయం. ఇప్పటికే ఎన్నో పథకాలు, అవార్డులను సాధించిన జాన్వి, గీతికలు భవిష్యత్తులో భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పడమే తమ ముందున్న లక్ష్యంగా తెలిపారు. జాన్వి, గీతికలకు కరాటే నేర్పించే గురువు రమేష్ మాట్లాడుతూ జాన్వి, గీతికలో ఉన్న క్రీడా స్ఫూర్తి నేటి చిన్నారులకు ఆదర్శనీయమని జాన్వి, గీతికలు మరిన్ని పతకాలు సాధించేందుకు ప్రస్తుతం తాను శిక్షణ అందిస్తున్నానని తెలిపాడు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే..**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల నియంత్రణకు స్వీయ అప్రమత్తత, అవగాహన కలిగిఉండటం అవసరమని తెలిపారు. ప్రజలు డిజిటల్ అరెస్ట్ అనగానే భయపడవద్దని, నిర్భయంగా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే యువత బెట్టింగ్ యాప్ ల జోలికి వెళ్ళవద్దని హెచ్చరించారు. అంతేకాకుండా సోషల్ మీడియా ద్వారా వచ్చే లింకులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాటిని క్లిక్ చేసి మోసపోవద్దని తెలిపారు. ఈ మధ్య కాలంలో కొంత మంది సైబర్ నేరగాళ్లు నకిలీ పీఎం కిసాన్, ఎస్ బిఐ రివార్డ్ అనే ఏపీకే ఫైల్స్ వాట్సప్, టెలిగ్రామ్, సోషల్ మీడియా ద్వారా పంపిస్తున్నారని, పొరపాటున ఇలాంటి లింక్స్ క్లిక్ చేసి అప్లికేషన్ ఇన్ స్టాల్ చేశారంటే మీ ఫోన్ హ్యాక్ అయి వినియోగదారుడి ఫోన్ లో గల ఓటీపీలు, బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత వివరాలు చోరికి గురై సైబర్ నేరగాళ్ల అధీనంలోకి వెళతాయని, ఆపై బాధితుడి వాట్సప్ ఖాతాను హైజాక్ చేసి, అదే నకిలీ లింక్ ను అతని ఫోన్ లో ఉన్న కాంటాక్ట్స్ లకు ఆటోమేటిక్ గా పంపిస్తుందనీ, ఈ మోసాల ద్వారా బాధితులు ఆర్థిక నష్టాలు, డేటా చోరికి గురవుతారని, ఇలాంటి నకిలీ ఏపీకే ఫైల్స్ మోసాల బారిన పడకుండ ఉండాలంటే ప్రజలు వాట్సప్ లో అనుమానస్పద లింక్ లను క్లిక్ చేయరాదని అన్నారు. ఇలాంటి పీఎం కిసాన్ యోజన, లేదా ఎస్ బిఐ రివార్డ్స్ పేరుతో ఏపీకే లింక్స్ వచ్చినప్పుడు వాటిని వెంటనే తొలగించాలని పేర్కొన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు లేదా ఓటిపిలు ఎవరితోనూ షేర్ చేయకుండా ఉండాలని తెలిపారు. ఇలాంటి సమాచారం ప్రభుత్వ సంస్థలు అడగవని, ఇలాంటి సంఘటనలు జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబరు కు కాల్ చేసి రిపోర్ట్ చేయాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు.



# భద్రాద్రిలో కోటి గోటి తలంబ్రాల విత్తనాలకు పూజలు

**గణపురం, జూలై 13( జనం సాక్షి):** భద్రాచల సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించే 2026 శ్రీరామనవమి స్వామివారి కళ్యాణ మహోత్సవంలో వినియోగించే కోటి గోటి తలంబ్రాల తయారీకి జయశంకర్ భూపాలపల్లి జిల్లా శ్రీరామదాసు భక్త మండలి వారు ఆదివారం వేదబ్రాహ్మణుల మంత్రోచ్చారణల నడుమ వడ్ల పూజ నిర్వహించి కార్యక్రమానికి అంకురార్పణ చేశారు.ఈ వడ్లను రామదాసు తిరుపతమ్మ-తిరుపతి పుణ్య దంపతులు స్వంత క్షేత్రంలో పలుమార్లు పూజలు నిర్వహించి పండిస్తారు. ఇలా పండించిన వడ్లను భక్తుల సహకారంతో అత్యంత భక్తిశ్రద్ధలతో గోటితో ఒలిపించి సీతారాముల కల్యాణానికి వినియోగిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమాన్ని 9 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని రామదాసు తిరుపతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు భక్తులు పాల్గొన్నారు.

# అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్



**శాయంపేట, జూలై 13 ( జనం సాక్షి) :** శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామంలో వైభవోపేతంగా సాగుతున్న మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యనారాయణ కు నాయకులు ఆలయంలోకి స్వాగతం పలికారు, అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణలో బోనాలకు ఒక ప్రత్యేక స్థానం ఉందని, దేవతలను పూజించేందుకు బోనం ఎత్తే సంప్రదాయం రాష్ట్ర వ్యాప్తంగా ఉందని తెలిపారు. మహంకాళీ అమ్మవారి అనుగ్రహంతో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, గట్లకానిపర్తి గ్రామస్తులంతా ఐకమత్యంగా ఉండాలని, గ్రామానికి అవసరమైన అన్ని అభివృద్ధి పనులు చేసేందుకు తన వంతుగా సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, చల్ల చక్రపాణి, మండల నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రధమ కంటైనర్ అదనపు ఆరోగ్య ఉప కేంద్రం ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తి

**2984 మందికి వైద్య సేవలు**

**కొడిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.పవన్ కుమార్**



**ములుగు/తాడ్వాయి,జూలై13(జనం సాక్షి):** ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కోడిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మారుమూల ప్రాంతమైన పోచాపూర్ గ్రామం నందు పంచాయతీరాజ్ మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు దనసరి సీతక్క మారుమూల గ్రామాలలోని గిరిజన ప్రజలకు వైద్య సదుపాయాలు అందించాలనే దృక్పథంతో మరియు జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్ అప్పటి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్.అప్పయ్య ప్రత్యేక చోరువతో కంటైనర్ వైద్య సదుపాయం లోని భాగంగా, అదనపు ఆరోగ్య- ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొని సంవత్సరం అయిన సందర్భంగా ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామని,కొడిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మరియు జిల్లా అసంక్రమిక వ్యాధుల నియంత్రణ ప్రోగ్రాం అధికారి డాక్టర్.పవన్ కుమార్ తెలిపారు. ఈ కంటైనర్ వైద్య సదుపాయము అనేది రాష్ట్రంలో ప్రథమంగా ఇక్కడే ఏర్పాటు అయిందని తెలుపుతూ,ఏర్పాటు చేసి ఒక్క సంవత్సరం కాలం అయిన సందర్భంగా, ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించమని డాక్టర్ పవన్ కుమార్ తెలిపారు.పోచాపూర్ కంటైనర్ అదనపు ఉపకేంద్రం ద్వారా 2984 మందికి వైద్య సేవలు అందించామని దీనిలో 457 మందికి జ్వర పీడితులు ఉన్నారని వీరందరికీ ఆర్డిటి రక్త పరీక్షలు నిర్వహించగా 8 మలేరియా పాజిటివ్ కేసులను గుర్తించామని వారందరికీ చికిత్సను అందజేసి నయం చేశామని దానితోపాటు 12 గర్భిణీ స్త్రీలకు రెగ్యులర్ గా పరీక్షలు నిర్వహిస్తున్నామని,(7) ఏడుగురు పాలు ఇచ్చి తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి మరియు పిల్లలకు వ్యాధి నిరోధకట్టికాలు ఇస్తున్నామని వైద్యాధికారి డాక్టర్ పవన్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కొడిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ బాలు,ఫార్మసీ ఆఫీసర్ వెంకట్, ఆరోగ్య కార్యకర్త సీతారామరాజు,ఏఎన్ఎం కృష్ణవేణి,ఆశా కార్యకర్తలు సులోచన, పుష్పలత,శ్యామల మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ పూజలు



**కాళేశ్వరం, జూలై 13 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం కుటుంబ సమేతంగా శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.వారికి దేవస్థానం అర్చకులు, వేద పండితులు మర్యాదపూర్వక స్వాగతం పలికి స్వామి వారితో అభిషేకం, అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహింపచేశారు.అనంతరం దేవస్థానం సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ వారికి స్వామివారి శేష వస్త్రములు అందజేయగా అర్చక స్వాములు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు ఇచ్చినారు. అంతకుముందు ఆయన సరస్వతీ పుష్కర ఘాటులో కాలసర్ప పూజలు నిర్వహించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
14 జూలై 2025

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**ఖమ్మం, జూలై 13 (జనం సాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీ యూజేఏసీ) రాష్ట్ర నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. హైద్రాబాద్ లోని అసెంబ్లీ ఎదుట ఉన్న అమర వీరుల స్థూపం వద్ద నూతన కమిటీతో తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కమిటీకి గౌరవ సలహాదారులుగా తెలంగాణ సీనియర్ ఉద్యమ నాయకుడు డాక్టర్ చెరుకు సుధాకర్ తొలి అమరుడు శ్రీకాంతా చారి తల్లి కసోజు శంకరమ్మ అన్వర్ పటేల్ లను సలహాదారులుగా నియమించారు. ఈ రాష్ట్ర కమిటీ ఛైర్మెన్ గా సుల్తాన్ యాదగిరి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బత్తుల సోమయ్య మరొక ప్రధాన కార్యదర్శిగా సంగిశెట్టి క్రిస్టాఫర్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా సయ్యద్ రసీద్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్.రాజేంద్రప్రసాద్ వైస్ ప్రెసిడెంట్ గా పాలకుర్తి కృష్ణ, కోయ వెంకట నారాయణ తునికిపాటి చారి అన్నిజిల్లాల నుంచి మరో పది మందిని ఎన్నుకున్నారు.మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా కోతి మాధవి రెడ్డి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా డోలక్ యాదగిరి ప్రధాన కార్యదర్శిగా షేక్ పక్రుద్దీన్ కార్యదర్శులుగా అంబాల రామారావు అంగిడి బిక్షం కొత్త వెంకట రెడ్డి ఉల్లంగి పద్మ షేక్ అఫ్జల్ ఉల్లోజు వెంకన్న రామాంజనేయులు జంపని అంజయ్య బొల్లికొండ పాపయ్య కుక్క సత్యం వడిత్యా రాజేష్ నాయక్ చెరుకూరి శ్రీలక్ష్మి కాలింగ్ గురువయ్య మందడి వెంకటేశ్వర్లు కుర్రి ముత్తయ్య తదితరులను రాష్ట్ర కమిటీకి తీసుకున్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



డాక్టర్ బత్తుల సోమయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎందరో వీరులు బలయ్యారని వారి ప్రాణత్యాగాలు పాలకులకు కానరావడం లేదా అని అన్నారు. చేతికందిన బిడ్డలు ప్రాణాలు కోల్పోయి దిక్కులేని స్థితిలో ఉన్న తల్లిదండ్రులకు పట్టెడు మెతుకులు దొరకడం లేదనీ సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తరిమికొట్టిన స్వతంత్ర సమరయోధులను సత్కరించుకున్న దేశం మనదని స్వరాష్ట్ర సాధన కోసం చేసిన ప్రాణ త్యాగాలు సరిపోవా..? అని సాధించుకున్న తెలంగాణలో కూడా ఇంకా ప్రాణ త్యాగాలు చేయాలా అని ప్రశ్నించారు. కత్తి మనవాడి చేతిలో ఉంటది కానీ ఆంధ్రా వాడు వచ్చి పొడిచిపోతాడు అన్న చందంగా మిగులు బడ్జెట్ ఉన్న మన రాష్ట్రాన్ని కేసీఆర్ ఆగం చేసిండని కాళేశ్వరం సంగతి కూడా అంతే జరిగిందని డబ్బు మనదైతే ఆంధ్రా కాంట్రాక్టర్ వచ్చి మొత్తం కూలిపోయేలా కట్టి పోయారని సోమయ్య ఆరోపించారు.కేసిఆర్ పైన వచ్చిన వ్యతిరేకత కారణంగా కాంగ్రెస్ పార్టీకి పట్టం కడితే రేవంత్ రెడ్డి వచ్చి తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలను మార్చేశారని తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ముక్కలు చెక్కలు చేశారని రానున్నరోజుల్లో మూసి సుందరీకరణ కోసం చేయనున్న పనులను ఆంధ్రా కాంట్రాక్టర్లకు ఇచ్చి ఆగం చేయడని గ్యారంటీ ఉందా? అని బత్తుల సోమయ్య ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. పక్కనే ఉన్న జార?ండ్ రాష్ట్రంలో పోరాడిన కుటుంబాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేశారని స్వరాష్ట్రం సాధించుకుని 12 ఏళ్లు కావస్తున్నా ఉద్యమకారుల కన్నీళ్లు తూడిచిన పాపాన పోలేదని సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అమరవీరుల తల్లిదండ్రుల ఆక్రందన పాలకులకు వినిపించడం లేదా? అని ప్రశ్నించారు. మేము మీ ఆస్థులేమన్నా అడుగుతున్నామా..? మా హక్కులే కదా అడిగేది అని బత్తుల అన్నారు. మీరు వృథా చేస్తున్న ప్రజాధనంతో పోల్చుకుంటే మాకు కేటాయించాల్సిన బడ్జెట్ ఎంత? అని అన్నారు. ఉద్యమ కారులంటే ఎంత చులకనగా చూస్తున్నారని గడ్డిపోచల్లా తీసిపారేయకండని గడ్డిపోచలన్నీ ఏకమైతే ఏం జరుగుతుందో చూపిస్తామని ఈ సందర్భంగా సోమయ్య హెచ్చరించారు. సామరస్యంగా సౌమ్యంగా అడుగుతున్నాం. ఇప్పటికైనా ఓ ప్రకటన చేయాలని ఇప్పటిదాకా సంయమనం పాటించామని తెలంగాణ ప్రజల ఓపిక నశిస్తే ఏమి జరిగిందో ఎలా తిరుగుబాటు చేశారో ఒక్కసారి గుర్తు చేసుకోవాలని బత్తుల సోమయ్య హితవుపలికారు.

## ఉపాధ్యాయుడు పొన్న కిషన్‌కు కేయూ డాక్టరేట్ ప్రదానం



**చేర్యాల, జూలై 12 (జనంసాక్షి) :** పెద్దమ్మ గడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)గా పనిచేస్తున్న శ్రీ పొన్న కిషన్‌కు డాక్టరేట్ లభించింది. వివరాల్లోకి వెళితే హన్మకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయంలో జూలై 7, 2025న వైభవంగా జరిగిన 23వ స్నాతకోత్సవంలో గవర్నర్ విష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా పొన్న కిషన్ తన పిహెచ్.డి పట్టాను అందుకున్నారు. శారీరక విద్య (ఫిజికల్ ఎడ్యుకేషన్) రంగంలో ఆయన చేసిన విశేష పరిశోధనకు గాను విశ్వవిద్యాలయం ఆయనకు ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఒక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే, ఉన్నత విద్యపై ఆసక్తితో పరిశోధన పూర్తి చేసి పి హెచ్ డి సాధించడం ఎందరికో ఆదర్శమని పలువురు కొనియాడారు. ఈ ఘనత సాధించిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బండ నాగమణి తోటి ఉపాధ్యాయులు పొన్న కిషన్‌ను శనివారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. ఆయన పట్టుదల, అంకితభావం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎంతో స్ఫూర్తిదాయకమని వారు కొనియాడారు. ఈ సందర్భంగా పొన్న కిషన్‌ను జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సహోద్యోగులు, విద్యార్థులు, మిత్రులు అభినందనలతో ముంచెత్తారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## కలెక్టర్ సుడిగాలి పర్యటన



**పాపన్నపేట, జూలై 13 (జనంసాక్షి) :** ప్రభుత్వ శాఖల అధికారుల విధులు,ప్రజలకు మెరుగైన సేవలు అందించే సరళిని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం పాపన్నపేట మండలంలో సుడిగాలి పర్యటనలో పరిశీలించారు.పొడిచన్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.డెంగ్యూ,మలేరియా జ్వరాలు,గర్భిణీలకు మాత్రల పంపిణీ,రిజిస్టర్ పరిశీలించి వైద్య సిబ్బంది కీ తగు సూచనలు చేశారు.విద్యుత్ సరఫరా గూర్చి ఆశాఖ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.సరఫరాకు అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని వారికీ ఆదేశించారు.విద్యుత్ అంతరాయం ఏర్పడితే వినియోగదారులు 1912 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలన్నారు.లక్ష్మీనగర్ లోని ఫర్టిలైజర్ దుకాణం ను పరిశీలించారు. లక్ష్మీనగర్ ఫర్టిలైజర్ షాప్‌లో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వ,అమ్మకాలు ఈపాస్ యంత్రంలో నమోదు వివరాలను పరిశీలించారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువులతో పాటు పొటాష్ అందుబాటులో ఉన్నాయన్నారు.జిల్లాలో 4675.89 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని,విక్రయ కేంద్రాల నిర్వాహకులు తగు ధరలకు రైతులకు అందించాలన్నారు.ఈసందర్భంగా వైద్య అధికారి దీక్ష,సిబ్బంది అనుసూయ, రహీమ్ తదితరులు ఉన్నారు.

## బెల్టుషాపులు నిర్వహించవద్దని యువకులు తీర్మానం



**మర్పల్లి, జూలై 13 (జనంసాక్షి) :** నర్సాపూర్ గ్రామంలో బెల్ట్ షాపులు జోరుగా కొనసాగడంతో వయస్సుతో సంబంధం లేకుండా మద్యానికి బానిసావుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, కూలి పని చేసుకుని వచ్చే డబ్బులను సైతం మద్యానికి ఖర్చు చేసి అప్పుల పాలు అవుతున్నారని నర్సాపూర్ గ్రామ యువకులు పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామ యువకులు గ్రామంలో మద్యం అమ్మకాలు చేయరాదని తీర్మానం చేశారు. ఇకనుంచి నర్సాపూర్ గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయాలు చేస్తే చర్యలు తీసుకోవాలని మర్పల్లి ఎస్సై గఫర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు శ్రీనివాస్, శ్రీకాంత్, పవన్ కుమార్, రమేష్, అరవింద్, శాంతి కుమార్, కుమార్, ప్రమోద్, ప్రవీణ్, సురేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి భారతీయుడు రాజ్యాంగం చదవాలి

**బోడుప్పల్, జూలై 13 (జనంసాక్షి) :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 334వ ఆదివారం జ్ఞానమాల ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిపిసిసి ఉపాధ్యక్షులు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ రాపోలు రాములు,బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నరసింహారెడ్డి,మాజీ కార్పొరేటర్లు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొని అంబేద్కర్ కు నివాళులర్పించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తన జీవితాన్ని త్యాగం చేసి రూపొందించిన మన రాజ్యాంగం ఫలితంగానే ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా భిన్నత్వంలో ఏకత్వంగా, స్వేచ్ఛగా ప్రజాస్వామ్యతంగా సమాన హక్కులను కలిగి ఉన్నామని, అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ఫలితంగానే మనకు తెలంగాణ రాష్ట్రం



సిద్ధించిందని,నేటి యువకులు రాజకీయ నాయకులు ప్రతి భారతీయుడు రాజ్యాంగమే తప్పనిసరిగా చదవాలని సూచిస్తూ 334 వారాలుగా విజయవంతంగా అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పిస్తూ ఆయన ఆశయాల కోసం కృషి చేస్తున్న నత్తి మైసయ్యను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు బండారి సాయి,గరుగుల యాకయ్య,సవరపు బయన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ పోచమ్మకు ఘనంగా బోనాలు



**కౌడిపల్లి, జూలై 13 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా కౌడిపల్లిలో ఆషాడ మాసం పురస్కరించుకొని ఆదివారం రోజు గ్రామస్తులందరి సహకారంతో ఎల్లమ్మ పోచమ్మలకు బ్రహ్మాండంగా బోనాల కార్యక్రమం నిర్వహించారు. సర్పంచుల పదవీకాలం ముగిసిన అనంతరం గ్రామస్తుల నడుమ కుల సంఘాల సహకారంతో కులమత బేధం లేకుండా చేయి చేయి కలిపి ఈ యొక్క బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి, మాటూరి శాఖయ్య, చంద్రం కృష్ణ గౌడ్, లు మాట్లాడుతూ... ప్రతి ఏటా నిర్వహించే ఈ బోనాల పండుగ కార్యక్రమానికి ఈసారి గ్రామస్తులందరు సహకారం అందించడం గ్రామానికి చూడముచ్చటగా ఉందన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో కుల మత భేదం చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ బోనాల కార్యక్రమంలో గ్రామస్తులు వేల సంఖ్యలో పాల్గొనడం చూసే వారందరినీ కనువిందు చేసిందన్నారు. డీజే చప్పుల్ల మధ్య పోతరాజుల విన్యాసాలతో గ్రామస్తులందరూ బోనాలను అందంగా అలంకరించి తమ ఇంటి నుండి బయలుదేరి ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ పెద్దలు గ్రామపంచాయతీ పాలకవర్గం, తదితరులు పాల్గొన్నారు.

## సిగాచి యాజమాన్యం అత్యాశే 52 మంది ప్రాణాలు తీసింది



**పటాన్‌చెరు, జూలై 13 (జనంసాక్షి) :** నిపుణులైన కార్మికులు విధులు నిర్వర్తించాల్సిన చోట దినసరి కూలీలతో విధులు నిర్వహించడం మూలంగానే సిగాచి పరిశ్రమలో ప్రమాదం చోటుచేసుకుందని.. యాజమాన్యం అత్యాశ, మూలంగా 52 మంది కార్మికులు మృతి చెందడంతో పాటు.. మరో 30 మంది కార్మికుల జీవితాలు అగమ్య గోచరంగా మారాయని. ఈ దుర్ఘటనకు కారణమైన సిగాచి పరిశ్రమ యాజమాన్యంతో పాటు.. దినసరి కార్మికులను ప్రమాదకర విధులకు పంపిన సంబంధిత కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి.. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రవీందర్ రెడ్డిని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. శనివారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో డిసిఎల్ రవీందర్ రెడ్డి తో ఎమ్మెల్యే జిఎంఆర్ పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా పటాన్చెరు నియోజకవర్గంలోని పారిశ్రామికవాడలలో గల పరిశ్రమలలో జరుగుతున్న కార్మికుల హక్కుల ఉల్లంఘున పై చర్చించారు. ప్రధాన పరిశ్రమల తో పాటు చిన్న, మధ్య తరహా కెమికల్, ఫార్మా పరిశ్రమలలోని అత్యంత ప్రమాదకరమైన విభాగాల్లో అత్యంత శిక్షణ పొందిన ఉద్యోగుల స్థానంలో కాంట్రాక్ట్, క్యాజువల్ కార్మికులతో పాటు దినసరి కూలీలతో విధులు నిర్వర్తిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కూలీలకు విధులకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధిక డబ్బులు ఇస్తామంటూ కాంట్రాక్టర్లు కార్మికులను ప్రమాదాల్లోకి నెట్టేస్తున్నారని తెలిపారు. ప్రమాదాలు సంభవించినప్పుడు మాత్రమే ఈ అంశాలు వెలుగు లోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ప్రాథమిక హక్కులైన ఈఎస్ఐ, పీఎఫ్, సేఫ్టీ షూస్ లాంటివి సైతం కల్పించకపోవడంతో పాటు. వారికి సంబంధించిన ఎటువంటి రికార్డులు నమోదు చేయకుండా ప్రమాదకర విధుల్లోకి పంపిస్తున్నారని తెలిపారు. యాజమాన్యాల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ల అత్యాశ వేలాది మంది కార్మికుల కుటుంబాల జీవితాలను ప్రమాదంలోకి నెట్టి వేస్తోందని తెలిపారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తో పాటు కార్మిక శాఖ విభాగం అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తే ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోవడం తగ్గుతాయని తెలిపారు. భవిష్యత్తులో సిగాచి లాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండాలంటే నిరంతర తనిఖీలతోపాటు లేబర్ కాంట్రాక్టర్లపై నిఘా ఉంచాలని కోరారు.

## వైభవంగా మహంకాళి బోనాలు



**యాచారం, జూలై 13 (జనం సాక్షి) :** మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామంలో ఆదివారం మహంకాళి అమ్మవారి బోనాలు ఘనంగా జరిగాయి. ఊరదేవతకు శివ సత్తుల పూనకాలతో పోతు రాజుల ఆటల విన్యాసాలతో డప్పు దరువులతో బోనాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి యాచారం మండల అధ్యక్షుడు కొమ్ము సురేష్,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి అమీర్పేట బుగ్గ రాములు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శి కంబాలపల్లి ప్రభాస్, అమీర్పేట శ్రీను, కావలి కిరణ్ ,బుడియాలు పాండు, అమీర్పేట రాజు, సొల్లేటి శీను ,అమీర్పేట గణేష్, బిఆర్ఎస్ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి గడల శ్రీనివాస్, కారోబార్ లింగం , తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల లో ఘనంగా పోచమ్మ బోనాలు



**చేవెళ్ల, జూలై 13 (జనంసాక్షి) :** చేవెళ్లలో బోనాల సందడి నెలకొన్నది. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని చేవెళ్ల మున్సిపాలిటీలోని రంగారెడ్డి నగర్, చంద్రారెడ్డి నగర్, వీరభద్ర నగర్, సాయి నగర్ కాలనీలలో అదివారం ప్రజలు బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు అలరించాయి. ఉదయం నుంచే దేవాలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి.ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి ఒడిబియ్యంతోపాటు నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పలు బోనాల పండగ ఉత్సవాల్లో భాగంగా చంద్రా రెడ్డి నగర్ కాలనీలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ దేవర సమతవెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...అంటువ్యాధుల బారి నుంచి ప్రజలను కాపాడు తల్లీ అంటూ పోచమ్మను భక్తి శ్రద్ధలతో కొలిచారు. ప్రజలందరు సుఖ శాంతులతో వర్ధిల్లాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి సుభిక్షంగా ఉండాలని పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సున్నపు వసంతం, చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర వెంకటరెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజా ఆగిరెడ్డి, మర్పల్లి కృష్ణా రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బేగరి రాములు, బీజేపీ మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, డా. వైభవ్ రెడ్డి, దేవుని శర్వలింగం, మాజీ ఎంపీటీసీ గుండాల రాములు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● **ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు**

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూలై 13 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలనీ, రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు తెలి పారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఆదివారం ప్రజలకు రోడ్డు భద్రత నియమాల పై, దొంగత నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగల పట్ల జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు మాట్లాడుతూ ప్రజలు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించా లని తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించడా నికి అవకాశం ఉంటుందని



తెలిపారు. ప్రజలు దొంగత నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వివిధ గ్రామాల నుండి సంతకు వచ్చే సమ యంలో ఇంట్లో ఒకరు తప్ప కుండా ఉండేలా చూసుకోవాలని లేని యెడల బంగారు విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో దాచుకోవాలని సూచించారు. షాపింగ్కు, బ్యాంక్ కు వచ్చే సమయంలో అప్రమత్తంగా ఉంటూ తమ విలువైన వస్తువులను డబ్బు లను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు అనేక రూపాలలో ప్రజలను మోసం చేస్తున్నారని ముఖ్యంగా బ్యాంక్ ఖాతాల వివరాలు ఓటీపీలు, ఆధార్, పాన్ వంటి వ్యక్తిగత సమాచారం పొంది ఖాతాలో డబ్బులు కాజేస్తు న్నారనీ తెలిపారు. సోషల్ మీడియా ఫోన్ కాల్స్, ఫేక్ లింక్స్ ద్వారా మోసాల పాల్ప డుతున్నారనీ. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఒకవేళ సైబర్ నేరా నికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు అత్యవసర సమ యంలో డయల్ 100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ , ఇమానియల్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ బోనాల్లో ఎమ్మెల్యే పూజలు



**రాజేంద్రనగర్, జూలై 13 (జనం సాక్షి) :** ఆషాడ బోనాలు పురస్కరించుకొని శంషాబాద్ మున్సిపాలిటీలో పలు వార్డులలోని దేవాలయాలలో వైభవంగా బోనాల పండుగ నిర్వహించారు. బోనాల పండుగలో దేవాలయాల్లోని అమ్మవార్లకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దర్శించుకుని పూజలు నిర్వహించి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ఆకాంక్షించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు చంద్రారెడ్డి,మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా, మాజీ నార్సింగ్ ఏఎంసీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్, నీరటి తన్వి రాజు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## వేలు పెట్టినా నో షాక్!


### ఇంట్లో పవర్‌ట్రాక్..



**జనంసాక్షి:**పొరపాటున సాకెట్‌లో వేలు పెడితే ఏమవుతుంది? దిమ్మతిరిగి.. మైండ్ బ్లాక్ అవుతుందా లేదా! అదేనండి.. షాక్ కొడుతుంది కదా! వంటగదిలోని పవర్ సాకెట్ అదీ..రెండు, మూడు ప్లగుల్ని పెడితే చిటపట మెరుపులు.. షార్టుసర్క్యూట్లు. ఇలాంటి సమస్యలన్నింటికీ ఓ చక్కటి పరిష్కారం పవర్ ట్రాక్. ఎక్స్‌టెన్షన్ బాక్స్‌కు సరికొత్త రూపమే ఈ పవర్ ట్రాక్. దీని సాయంతో 5 నుంచి 13 విద్యుత్తు ఉపకరణాల్ని ఒకేచోట ఏర్పాటు చేయవచ్చు. ఏకకాలంలో ఇన్నింటిని వాడినా షార్టుసర్క్యూట్ అవుతుందనే భయమే అక్కర్లేదు.వంటింట్లో అయినా, ఆఫీసులో అయినా.. కరెంటు తీగల నుంచి కంప్యూటర్ వైర్ల వరకూ పవర్‌ట్రాక్‌లో బిగించొచ్చు. పవర్‌ట్రాక్ అంటే ఇదేదో కొత్త పరికరం అనుకునేరు. రెండు, మూడు ప్లగ్గులు పెట్టాల్సి వస్తే ఎక్స్‌టెన్షన్ బాక్సులు, పవర్‌స్ట్రిప్‌ల వాడకం తెలిసిందే కదా! సరిగ్గా ఇది కూడా అలాంటిదే అన్నమాట. అయితే వాటితో పోలిస్తే రెండు, మూడు రెట్లు ఎక్కువ సంఖ్యలో విద్యుత్తు ఉపకరణాలు ఏర్పాటు చేసుకునే వీలు ఇక్కడుంటుంది. ఇదే ఈ పరికరం ప్రత్యేకత.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బహుముఖ అవసరాల్ని తీర్చే పవర్‌ట్రాక్ రెండు రకాలు. గృహావసరాలకు ఉపయోగపడే కాంపాక్ట్ ట్రాక్, ఆఫీసుల్లో ఉపయోగించే డాటా ట్రాక్, పవర్‌ట్రాక్‌ను గోడకు బిగించడం వల్ల చూడటానికి చక్కటి లుక్కు వస్తుంది. వైర్ల గజిబిజి ఉండదు. పైగా పూర్తి సురక్షితం. అందుకే వీటికి గిరాకీ అధికం. వంటగది, స్టడీరూమ్, లివింగ్‌రూమ్‌లతో పాటు ఆఫీసుల్లోనూ వీటిని విరివిగా వాడొచ్చు.సైజును బట్టి ఒక పవర్‌ట్రాక్ ద్వారా ఐదు నుంచి పదమూడు విద్యుత్తు ఉపకరణాల్ని ఏకకాలంలో వాడుకోవచ్చు. 500 మిల్లీమీటర్లు, 600 మిల్లీ మీటర్లు, 1,300 మిల్లీమీటర్ల పొడవుతో దొరుకుతాయి. పైన అల్యూమినియం, లోపల థర్మోప్లాస్టిక్ రబ్బర్ మెటీరియల ఉపయోగించే పవర్‌ట్రాక్‌ల ధర రూ.5 వేల నుంచి రూ.7వేల వరకు ఉంది. సాకెట్లు.. ఎక్స్‌టెన్షన్ బాక్సుల్లో ఒక్కోసారి ప్లగ్గులు సరిగా దూరవు. ఫలితంగా ప్లగ్ పిన్నును పెట్టగానే సాకెట్ నుంచి చిటచిట మెరుపులు వస్తుంటాయి. ప్లగ్‌ని పైకి ఎత్తిపట్టుకుంటే కానీ మిక్సర్ తిరక్కపోవచ్చు. ఇలాంటి సమస్యలు పవర్‌ట్రాక్‌లో కన్పించవు.ఒక్కోసారి చిన్నపిల్లలు తెలీక ప్లగ్గుల్లో చెంచాలు, ఇనుపముక్కలు, వేళ్లు పెట్టి షాక్‌కు గురవుతుంటారు. పవర్‌ట్రాక్‌తో అలాంటి భయమే అక్కర్లేదు. లోపల వేళ్లు పెట్టినా ఇబ్బందే ఉండదు. 100 శాతం షాక్‌ప్రూఫ్ ఇది.స్విచ్‌బోర్డు అయితే సాకెట్ అమర్చిన చోటే ప్లగ్ పెట్టాల్సి ఉంటుంది. ఒకవైపు అందకపోవడం, ఉపకరణాల్ని అటూఇటూ జరపడం వంటి ఇబ్బందులుంటాయి. ఇందులో అలాకాదు.

# ఫ్లోరింగ్.. అదరహో..


**జనంసాక్షి:**శుభ్రం చేయడమెంతో తేలిక. దీర్ఘకాలపు మన్నిక.. ఎలాంటి మరకలైనా తుడవగానే మాయం. నిర్వహణలో కన్పించని సమస్యలు. పైగా ఇంటికే సరికొత్త అందం. ఇలాంటి అనేకానేక ప్రత్యేకతల కారణంగా వెదురు గచ్చు(బ్యాంబూ ఫ్లోరింగ్)కి రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది.భూతాపాన్ని తగ్గించడానికి ప్రపంచం దృష్టి సారిస్తున్న నేపథ్యంలో.. పర్యావరణ ప్రియుల దృష్టి వెదురు గచ్చు మీద పడింది. ఇతర రకాల కలప కంటే దృఢంగా ఉండటం.. చూడ్డానికి చక్కగా కన్పించడం.. తదితర కారణాలతో వెదురు గచ్చుకి గిరాకీ పెరుగుతోంది. వెదురు గచ్చులో ఎలిగెంట్, ఎలైట్ అనే రెండు రకాలు లభిస్తాయి. వీటి తయారీ ప్రక్రియల్లో చాలా తేడా ఉంటుంది. కత్తిరించిన చిన్నచిన్న బ్యాంబూని అతికించేది ఎలిగెంట్ అయితే.. దీనికి భిన్నంగా బ్యాంబూ ఫైబర్‌తో చేసేది ఎలైట్ రకం. ఇదెంతో దృఢంగా ఉంటుంది. మొత్తం మూడు వర్ణాల్లో ఈ కలప లభిస్తుంది. ఆరేళ్ల పాటు చెక్కు చెదరకుండా ఉండటం కోసం గచ్చుకి ఆరు లేయర్ల పాలియురేథెన్ కోటింగ్ వేస్తారు. ప్రస్తుతం ఈ తరహా కలపను చైనా నుంచి దిగుమతి చేస్తున్నారు. దీనితో ఇంటిని అలంకరించాలంటే.. చదరపు అడుగుకి రూ.200–350 దాకా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అంటే ఓ వంద చదరపు అడుగుల గదికి సుమారు రూ.20 వేలు అవుతుందన్నమాట. మార్కెట్లో లభించే ఇతర కలపతో తయారైన ఫ్లోరింగ్ కోసం చదరపు అడుగుకి రూ.300 దాకా అవుతుంది. వెదురు కలపను ఇంట్లో వేయడానికి విడిగా చార్జీలుంటాయి. చదరపు



అడుగుకి రూ.15 దాకా తీసుకుంటారు. ఆసక్తికర విషయం ఏమిటంటే.. మీ ఇంట్లో ప్రస్తుతం ఎలాంటి గచ్చు ఉన్నా.. దానిపై బ్యాంబూ ఫ్లోరింగ్‌ను సులువుగా వేసుకోవచ్చు. పైగా ఒక్కరోజులో పని పూర్తవుతుంది. వెదురు గచ్చు ప్రత్యేకతలు అన్నీ ఇన్నీ కావు. దీనిపై గీతలు కన్పించవు. కాలిపోవడమంటూ ఉండదు. కొన్నాళ్ల తర్వాత రంగు వెలిసిపోతుందన్న దిగులక్కర్లేదు. నిర్వహణలో శ్రమపడక్కర్లేదు. సిరాను పీల్చుకునే గుణం వెదురు గచ్చుకి ఉండటం వల్ల.. చాలామంది తమ బుడతల గదుల్లో వాడుతున్నారు. చిన్నారులు కిందపడినా దెబ్బలు తగలవు. హోమ్ థియేటర్లు, పడక గదుల్లోనూ ఈ తరహా గచ్చును కోరుకునేవారి సంఖ్య పెరుగుతోంది. సంపన్న గృహాల్లోని బయటి ప్రాంతాల్లోనూ ఈ రకం కలపతో అలంకరిస్తున్నారు. ఉద్యానవనాలు, బాల్కనీలు, స్విమ్మింగ్‌పూల్, పోర్టికోల వద్ద విరివిగా ఉపయోగిస్తున్నారు. ఇందుకోసం చదరపు అడుగుకి రూ.400 వరకూ అవుతుంది. అన్నిరకాల వాతావరణానికి ఎదురొడ్డి నిలబడం వల్ల వెదురు గచ్చు మీద ప్రత్యేక మక్కువ పెరుగుతోంది.

## ఈ క్రెడిట్ కార్డు.. ప్రపంచంలోనే అత్యంత ఖరీదు

ఈరోజుల్లో దాదాపు ప్రతిఒక్కరి దగ్గర ముఖ్యంగా ముఖ్యంగా వర్కింగ్ ప్రొఫెషనల్స్ అందరి దగ్గరా క్రెడిట్ కార్డులు ఉన్నాయి. కొందరి దగ్గరైతే రెండు, మూడుకు మించి కూడా క్రెడిట్ కార్డులు ఉంటున్నాయి.క్రెడిట్ సదుపాయంతోపాటు ఆకర్షణీయమైన ప్రయోజనాల కోసం చాలా మంది క్రెడిట్ కార్డులను వినియోగిస్తుంటారు. అయితే ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన క్రెడిట్ కార్డు గురించి తెలుసా? దీని కోసం ఎంత ఖర్చవుతుందో తెలిస్తే నోరెళ్లబెడతారు..నేటి ప్రపంచంలో క్రెడిట్ కార్డులు రోజువారీ జీవితంలో భాగంగా మారాయి. చాలా మంది ఒకటి కంటే ఎక్కువ క్రెడిట్ కార్డులను కలిగి ఉంటారు. అసరమైనప్పుడు ఖర్చు చేసేందుకు మాత్రమే కాకుండా సినిమా టిక్కెట్లపై డిస్కౌంట్లు, రివార్డ్ పాయింట్లుక,ఉచిత ఎయిర్ పోర్ట్ లాంజ్ యాక్సెస్ వంటి ప్రయోజనాలను కూడా క్రెడిట్ కార్డులు. ఈ ప్రయోజనాలు పరోక్షంగా డబ్బు ఆదా చేయడానికి సహాయపడతాయి. అయితే క్రెడిట్ కార్డులను జాగ్రత్తగా ఉపయోగించకపోతే మాత్రం ఆర్థిక ఒత్తిడికి దారితీస్తుంది. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన క్రెడిట్ కార్డు ఒకటి ఉంది. దీని



పేరు అమెరికన్ ఎక్స్ ప్రెస్ సెంచూరియన్ కార్డ్. సింపుల్‌గా అమెక్స్ బ్లాక్ కార్డ్ అని పిలుస్తారు. దీనిని అమెరికన్ ఎక్స్ ప్రెస్ బ్యాంక్ జారీ చేస్తుంది.ఈ కార్డు ఖరీదైనది మాత్రమే కాదు. చాలా ప్రత్యేకమైనది కూడా. ఇది అందరికీ అందుబాటులో ఉండదు. సాధారణ కార్డుల మాదిరిగా దీనికి దరఖాస్తు చేయలేము. నివేదికల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా కేవ లం లక్ష మందికి మాత్రమే ఈ కార్డు ఉంది. భారత్ లో అయితే కేవలం 200 మంది దగ్గర మాత్రమే ఈ కార్డు ఉందని చెబుతున్నారు. ఇది 2013లో భారత మార్కెట్లోకి ప్రవేశించింది.

**రూ.10 కోట్లు ఖర్చు చేసే సామర్థ్యం ఉండాలి**

అమెక్స్ బ్లాక్ కార్డు ఆహ్వానం ద్వారా మాత్రమే ఇస్తారు. అది కూడా చాలా అధిక ఆదాయం, ఖర్చు అలవాట్లు ఉన్నవారికి. అర్హత సాధించాలంటే రూ.10 కోట్ల వరకు ఖర్చు చేసే సామర్థ్యం ఉండాలి. దీన్నిబట్టి ఈ కార్డు కేవలం ధనవంతుల కోసమేనని స్పష్టమవుతోంది. అమెరికన్ ఎక్స్ ప్రెస్ సెంచూరియన్ కార్డ్‌తో ప్రపంచ స్థాయి హోటళ్లలో బస, ప్రైవేట్ జెట్ సేవలు, ఎయిర్‌పోర్ట్‌లలో వీఐపీ ట్రీట్‌మెంట్ వంటి అల్ట్రా లగ్జరీ సదుపాయాలు లభిస్తాయి.

## కొత్త ఇన్సూరెన్స్ ప్లాన్..

**100 ఏళ్ల వరకూ బీమా రక్షణ**



బంధన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ వినూత్నమైన బీమా ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో 100 ఏళ్ల వయసు వరకు జీవిత బీమాను తీసుకోవచ్చు. పాలసీ కాలవ్యవధిలోపు పాలసీదారు మరణించినట్టయితే వారసులకు ఏక మొత్తం బీమా పరిహారాన్ని చెల్లిస్తుంది.అంతేకాదు అక్కడి నుంచి క్ర మం తప్పకుండా ఆదాయాన్ని చెల్లిస్తుంటుంది. గడువు తీరిన మెచ్యూరిటీ ప్రయోజనాలు కూడా లభిస్తాయి.కనీసం మూడు నెలల వయసు నుంచే ఈ పాలసీ తీసుకోవచ్చు. ఇలా తల్లిదండ్రులు, సంరక్షకులు చిన్న వయసు నుండే తమ పిల్లల కోసం ఆర్థిక రక్షణ కల్పించేందుకు వీలుం టుంది. విద్య, వివాహం లేదా ఇల్లు కొనుగోలు వంటి అవసరాలకు ఈ పాలసీ సహాయపడుతుంది. ఈ ఇన్సూ రెన్స్ ప్లాన్ అనువైన చెల్లింపు ఎంపికలతోపాటు మహిళా పాలసీదారులకు అదనపు రాబడిని కూడా అందిస్తుంది. స్వల్ప, దీర్ఘకాలిక ఆర్థిక అవసరాలను తీర్చేలా ఈ ప్లాన్‌ను రూపొందించారు. కస్టమర్లు తమకు సౌకర్యవంతమైన ఆదాయ చెల్లింపు ఎంపికలను ఎంచుకోవచ్చు లేదా తరువాతి దశలో ఆదాయాన్ని కూడబెట్టి ఉపసంహరించుకోవచ్చు. రోజువారీ ఖర్చులను నిర్వహించడం, అత్యవసర నిధిని నిర్మించడం లేదా భవిష్యత్తు లక్ష్యాల కోసం పొదుపు చేయడం, ప్రణాళిక వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా ఉంటుంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.60 | ₹ 5.62 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
|---|---|
| ₹ 91,400 | ₹ 99,710 |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,25,000

## అమర్‌నాథ్ యాత్రలో ప్రమాదం.. 10 మందికి గాయాలు

**జనంసాక్షి:**అమర్‌నాథ్ యాత్రలో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో గాయపడిన తొమ్మిది మంది యాత్రికులను సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక వైద్య సహాయం అందించి, తదుపరి చికిత్స కోసం అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాల (జీఎంసీ)కు తరలించారు.కుల్గాం జిల్లాలోని ఖుద్వానీ ప్రాంతంలోని టాచ్లూ క్రాసింగ్ సమీపంలో యాత్రా కాన్వాయ్‌లోని మూడు బస్సులు ఒకదానికొకటి ఢీకొనడంతో పది మందికి పైగా యాత్రికులు గాయపడ్డారు. గాయపడిన యాత్రికులను అనంతనాగ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్య అధికారులు తెలిపారు. ఈ ఘటన తాత్కాలికంగా అంతరాయం కలిగించినప్పటికీ, యాత్ర కార్యకలాపాలు తిరిగి ప్రారంభమయ్యాయి. స్థానిక అధికారులు పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.



# రాధిక చేసిన మిస్టేక్ అదే..

### హిమాన్షిక సంచలన వ్యాఖ్యలు

గురుగ్రామ్: టెన్నిస్ ప్లేయర్ రాధికా యాదవ్ హత్య కేసుకు సంబంధించి కొత్త కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. కూతుర్ని ఆంక్షల నడుమ బంధించడానికి యత్నించే క్రమంలోనే ఈ హత్య జరిగినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.ఈ క్రమంలో రాధిక ప్రాణ స్నేహితురాలు స్పందిస్తూ.. సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆమె తల్లిదండ్రులు.. రాధికను నియంత్రించారని పేర్కొంది. రాధికను తనకు నచ్చిన విధంగా జీవించనివ్వలేదని తెలిపారు. రాధిక ప్రాణ స్నేహితురాలు హిమాన్షిక సింగ్ తాజాగా మాట్లాడుతూ.. రాధిక నాకు 2012 నుంచి తెలుసు. రాధిక ఎంతో సున్నితమైన మనసు కలిగి ఉంది. రాధిక కుటుంబ సభ్యులు.. ఆమెను నియంత్రించే వారు. ఆమె నాతో వీడియో కాల్‌లో ఉన్నప్పుడు, ఆమె ఎవరితో మాట్లాడుతుందో తల్లిదండ్రులకు చూపించాల్సి వచ్చింది. టెన్నిస్ అకాడమీ తన ఇంటి నుంచి కేవలం 15 నిమిషాల దూరంలో ఉన్నప్పటికీ, ఆమె ఎప్పుడు తిరిగి రావాలన్న దానిపై డెడ్‌లైన్ ఉండేది. రాధికది సంప్రదాయ కుటుంబమని, దాదాపు ప్రతి దానితోనూ సమస్యలు ఉండేవని తెలిపింది. ప్రతి




విషయంలోనూ నియంత్రణ విధిస్తూ రాధిక జీవితాన్ని ఆమె తండ్రి దుర్భరం చేశాడు.బయటకు వెళ్లాక పలానా సమయంలో తిరిగి ఇంటికి రావాలని ఆంక్షలు విధించేవారు. రాధిక కదలికలను ఇంట్లోవారు నియంత్రించారు. అతను తన నియంత్రణ, ప్రవర్తన, నిరంతర విమర్శలతో కుమార్తె జీవితాన్ని సంవత్సరాలుగా దుర్భరంగా మార్చాడు. షార్ట్స్ ధరించినందుకు, అబ్బాయిలతో మాట్లాడినందుకు, తన సొంత నిబంధనల ప్రకారం జీవించినందుకు వారు ఆమెను అవమానించారు. క్రమంగా వీడియోలు చిత్రీకరించడం వంటి ఆమె అభిరుచులన్నీ కనుమరుగయ్యాయి. ఆమె ఇంట్లో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. కుటుంబంపై సామాజిక ఒత్తిడి ఉంది. ప్రజలు ఏమనుకుంటారో అని తల్లిదండ్రులు ఎల్లప్పుడూ ఆందోళన చెందేవారు. ఇంట్లోని ఆంక్షలతో ఆమె ఊపిరాడనట్టు ఉండేది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవన్నీ రాధిక హత్యకు కారణమని తెలిపారు. రాధిక.. తన పేరెంట్స్‌కు నచ్చని కొని పనుల కారణంగానే హత్యకు గురైందని చెప్పుకొచ్చారు.ఇదిలా ఉండగా.. రాధికా యాదవ్ టెన్నిస్ కోచ్‌లలో ఒకరైన అజయ్ యాదవ్ కూడా ఆమె హత్యపై స్పందించారు. ఈ సందర్భంగా యాదవ్ మాట్లాడుతూ..'ఇంట్లోని కొన్ని పరిమితులు, ఆంక్షలతో రాధిక సతమతమైనట్లు వెల్లడించారు. తనకు వాట్సాప్ చాట్ టెక్స్ట్ మెసేజ్‌లు, వాయిస్ చాట్‌లలో ఆమె చెప్పిన కొన్ని విషయాలను జాతీయ మీడియాకు చూపించారు. కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు.



# బంగారం ధరలు తగ్గనున్నాయా?

**జనంసాక్షి:**రోజురోజుకూ పెరిగిపోతున్న బంగారం ధరలతో కొనుగోలుదారులు బేజారవుతున్నారు. తులం (10 గ్రాములు) పసిడి ఇప్పటికే లక్ష రూపాయాలకు అటు ఇటుగా ధర పలుకుతోంది.ఈ క్రమంలో పసిడి ప్రియులకు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ చల్లని కబురు చెప్పింది. రానున్న నెలల్లో బంగారం ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వెల్లడించింది.ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ, వాణిజ్య ప్రమాదాలు తగ్గితే బంగారం ధర మధ్యంతర బలహీనతను అనుభవించవచ్చు లేదా యూఎస్ డాలర్, ట్రెజరీ ఈల్డ్స్ పెరిగితే అధిక అవకాశాల వ్యయాలను అనుభవించవచ్చని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ విడుదల చేసిన నివేదిక తెలిపింది. సెంట్రల్ బ్యాంక్ బంగారం కొనుగోలు, రిటైల్ ఇన్వెస్ట్‌మెంట్ డిమాండ్ మందగించడం కూడా మధ్యకాలిక బంగారం ధర సర్దుబాటుకు దారితీస్తుందని డబ్ల్యూజీసీ తెలిపింది. దేశంలో ప్రస్తుతం బంగారం 10 గ్రాముల ధర (24 క్యారెట్లు) రూ.99,860 వద్ద కొనసాగుతోంది. ఇటీవలి గోల్డ్ బుల్ రన్ విపరీతమైన దృష్టిని ఆకర్షించింది. 2022 నవంబర్ 3న పడిపోయిన తరువాత నుండి బంగారం ధర రెట్టింపు అయింది. ఔన్సుకు 1,429 డాలర్ల నుండి 3,287 డాలర్లకు ఎగిసింది. అంటే ఏడాదికి 30% చొప్పున పెరుగుతూ వచ్చింది. ఓ వైపు కేంద్ర బ్యాంకు కొనుగోళ్లతో పాటు పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఇటీవలి వాణిజ్య అనిశ్చితులు దీనికి కారణమవుతున్నాయి.బంగారం ధర ఎప్పకప్పుడు కొత్త గరిష్టాలను తాకుతుండటంతో ఇన్వెస్టర్లు రిస్క్ ల పట్ల అప్రమత్తంగా ఉన్నారు. ఈ క్రమంలో బంగారం ధరల్లో మునుపటి ఒడిదుడుకులను అధ్యయనం చేసిన మీదట మధ్య లేదా ధీర్ఘ?కాలిక క్షీణతకు దారితీసిన సందర్భాలు కనిపించాయి. అయితే "మేము వీటిని పరిగణనలోకి తీసుకోనప్పటికీ, దీర్ఘకాలిక ఉపసంహరణలు మరింత స్థిరమైన, నిర్మాణాత్మక డిమాండ్ మార్పుల నుండి రావచ్చు. ఇది సంస్థలు, రిటైల్ పెట్టుబడిదారుల నుండి బంగారం పెట్టుబడి డిమాండ్‌లో గణనీయమైన క్షీణతకు, సరఫరాలో వేగవంతమైన పెరుగుదలకు దారితీస్తుంది" అని డబ్ల్యూజీసీ తన నివేదికలో పేర్కొంది.

## దలైలామా వారసుడి ఎంపిక.. భారత్‌తో బంధంలో సమస్యగా మారింది

భారత విదేశాంగ నిపుణులు టిబెట్‌కు సంబంధించిన సమస్యల సున్నితత్వాన్ని పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. దలైలామా పునర్జన్మ, వారసత్వం పూర్తిగా చైనా అంతర్గత వ్యవహారమని..ఇందులో భారత్ కల్పించుకోవడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు.2020లో గల్వాన్ ఘటనతో ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ చైనాలో తొలిసారి పర్యటించనున్నట్లు ఇటీవల ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యితో జైశంకర్ బీజింగ్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముందని తెలిపాయి. ఈ నేపథ్యంలో చైనా రాయబార కార్యాలయం నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడడం గమనార్హం.దాదాపు ఆరు దశాబ్దాలుగా టిబెట్ నియంత్రణపై చైనాతో టిబెట్ బౌద్ధగురువు దలైలామాకు వివాదం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఇటీవల మాట్లాడుతూ..చైనా బయటే తన వారసుడు జన్మిస్తాడని పేర్కొన్నారు.అది భారత్‌లో కూడా కావచ్చని వ్యాఖ్యానించారు.

## ప్రియుడితో భార్య జంప్.. పాల స్నానంతో భర్త సంబరాలు

భార్య నుంచి విడాకులు పొందానన్న ఆనందంతో ఓ భర్త సంబరాలు చేసుకున్నాడు.. అక్కడితో ఆగలేదు.. ఇక తాను స్వేచ్ఛాజీవినంటూ 40 లీటర్ల పాలతో స్నానం చేశాడు. విడాకులను నాలుగు బకెట్ల పాల స్నానంతో వేడుక చేసుకన్న ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.అస్సాంలోని నల్బాడీ జిల్లాలోని ముకల్మువా ప్రాంతానికి చెందిన మాణిక్ అలీకి భార్యతో విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆ భార్యభర్తలకు కోర్టు విడాకులు మంజూరు చేసింది. కోర్టు తీర్పు వచ్చిన వెంటనే ఇంటికి చేరుకున్న భర్త.. పాలతో స్నానం చేసి సంతోషంతో ఎగిరి గంతేశాడు.తన భార్యకు ఓ ప్రియుడు ఉన్నాడంటూ చెప్పుకొచ్చిన మాణిక్ అలీ.. తనతో పెళ్లై ఓ బిడ్డ జన్మించినా కానీ.. ఆమె తీరు మారలేదని.. తన ప్రియుడితో వివాహేతర బంధం కొనసాగించిందని తెలిపాడు.. తనను, తన బిడ్డను వదిలేసి ఆమె ప్రియుడితో వెళ్లిపోయిందని.. ఇలా.. ఒక్కసారి కాదు రెండు సార్లు అలాగే వెళ్లిపోయిందన్నాడు.మొదటిసారి తప్పు చేసినప్పుడు తన బిడ్డ కోసం ఆమెను క్షమించానని చెప్పాడు. మా కుటుంబం శాంతి కోసం తాను మౌనంగా ఉన్నానని.. మళ్లీ అదే తప్పు చేయడంతో భరించలేక విడాకులు తీసుకున్నానని మాణిక్ అలీ తెలిపారు. విడాకులు తీసుకున్నాక.. కొత్త జన్మ ఎత్తినట్లుగా ఉందని.. ఈ రోజు నుండి తాను విముక్తి పొందానని.. కొత్త జీవితం ప్రారంభానికి గుర్తుగా పాలతో స్నానం చేశానంటూ మాణిక్ అలీ చెప్పాడు.

## భాష ఏదైనా 'హాయ్ మివి' అంటే చాలు..



**జనంసాక్షి:**కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ మివి కొత్తగా కృత్రిమ మేథ ఆధారిత ఏఐ బడ్స్‌ను ప్రవేశపెట్టింది. సెటింగ్స్ ఏవీ మార్చకుండానే తెలుగు, హిందీ సహా ఎనిమిది భారతీయ భాషలను ఇది అర్థం చేసుకుని, ప్రతిస్పందిస్తుంది.యూజర్ల ప్రాధాన్యతలను గుర్తుపెట్టుకుని, సందర్భానుసారంగా వ్యవహరించేలా దీన్ని రూపొందించినట్లు సంస్థ కో–ఫౌండర్ మిధులా దేవభక్తుని తెలిపారు. 40 గంటల బ్యాటరీ లైఫ్, 3డీ సౌండ్‌స్టేజ్, స్పష్టత కోసం క్వాడ్ మైక్ మొదలైన ప్రత్యేకతలు ఉన్నాయి. దీని ధర రూ. 6,999గా ఉంటుంది.ఏఐ బడ్స్ లో మివి ఏఐ అనే ప్రొప్రైటరీ వాయిస్ అసిస్టెంట్ ఉంది. "హాయ్ మివి" అంటే చాలు ఈ వాయిస్ అసిస్టెంట్ ప్రతిస్పందిస్తుంది. ఇది ఎనిమిది భారతీయ భాషలకు సపోర్ట్ చేస్తుంది. అవి హిందీ, తమిళం, తెలుగు, బెంగాలీ, మరాఠీ, కన్నడ, మలయాళం, గుజరాతీ. లాంగ్వేజ్ సెట్టింగ్ ల మార్చుకునే పనిలేకుండానే వినియోగదారులు ఏ భాషలోనైనా ప్రశ్నలు అడగవచ్చు లేదా సహాయాన్ని అభ్యర్థించవచ్చు.

అసిస్టెంట్ అవతార్ ల ద్వారా మివి ఏఐ బడ్స్ వివిధ పనులకు సహకారం అందిస్తుంది. ఇవి ప్రీ డిఫైన్డ్ మాడ్యూల్స్.జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలకు గురు అవతార్ సమాధానాలు చెబుతుంది.ఇంటర్వ్యూవర్ అవతార్ మాక్ ఇంటర్వ్యూలు, ఫీడ్ బ్యాక్ అందిస్తుంది.చెఫ్ అవతార్ వంట చేయడంలో మార్గనిర్దేశం చేస్తుంది.వెల్ నెస్ కోచ్ అవతార్ సంభాషణల సమయంలో యూజర్ ఇన్ పుట్ లకు స్పందిస్తుంది.న్యూస్ రిపోర్టర్ అవతార్ యూజర్ ఆసక్తుల ఆధారంగా న్యూస్ అప్ డేట్స్ అందిస్తుంది.గూగుల్ ప్లే స్టోర్లో అందుబాటులో ఉన్న మివి ఏఐ యాప్ ద్వారా యూజర్లు ఏఐ సెట్టింగ్స్, ఫీచర్లను మేనేజ్ చేసుకోవచ్చు.

## మరాఠీ మాట్లాడని ఆటో డ్రైవర్‌పై దాడి

**జనంసాక్షి:**మహారాష్ట్రలో బాషా వివాదాలు ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదు. తాజాగా విరార్ ప్రాంతంలో ఇటువంటి ఘటనే జరిగింది. శివసేనలోని ఉద్ధవ్ థాక్రే వర్గానికి చెందిన కార్యకర్తలు మరాఠీలో మాట్లాడేందుకు నిరాకరించిన ఆటో డ్రైవర్‌పై దాడి చేశారు.ఆ డ్రైవర్ గతంలో ఒక వీడియోలో తాను హిందీ, భోజ్‌పురిలో మాట్లాడటం కొనసాగిస్తానని ప్రకటించాడు. ఇది కొన్నివర్గాలకు ఆగ్రహాన్ని తెప్పించింది.శనివారం సాయంత్రం విరార్ రైల్వే స్టేషన్ సమీపంలో ఉద్ధవ్ థాక్రే వర్గానికి చెందిన కార్యకర్తలు ఆ డ్రైవర్‌ను వెతికి పట్టుకుని, అతనిపై దాడి చేశారు. తరువాత మరాఠీ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శివసేన (యూబీటీ) విరార్ నగర చీఫ్ ఉదయ్ జాదవ్ ఈ చర్యను సమర్థించారు. 'ఎవరైనా మరాఠీ భాషను, మహారాష్ట్రను, మరాఠీ ప్రజలను అవమానించే ప్రయత్నం చేస్తే, వారికి శివసేన తనదైన శైలిలో సమాధానం ఇస్తుందని జాదవ్ హెచ్చరించారు. కాగా పలువురు ఈ దాడిని ఖండించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరైనదికాదన్నారు. కాగా ఈ ఘటనపై పోలీసులు ఎటువంటి అధికారిక ఫిర్యాదును నమోదు చేయలేదు. మహారాష్ట్రలో భాషా రాజకీయాలపై తీవ్ర ఉద్రిక్తతల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్‌ఎస్) ఇటువంటి వివాదాల్లో చిక్కుకున్న దరిమిలా.. ఇప్పుడు ఉద్ధవ్ థాక్రే వర్గం కూడా ఇలాంటి దూకుడు చర్యలకు పాల్పడుతోందనే మాట వినిపిస్తోంది.



జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
14 జూలై 2025
తెలంగాణ

# రేవంత్‌రెడ్డి పాలనలో తిరోగమనంలో తెలంగాణ

- రైతులకు నీళ్లవ్వడం చేతకాకపోతే కేసీఆర్‌కు కాళేశ్వరాన్ని అప్పగించండి
- మూడు రోజుల్లో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం : మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి



**గోదావరిఖని, జనంసాక్షి :**
తెలంగాణ రాష్ట్రంలో రైతంగానికి సాగునీళ్లు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ అన్నదాతలను గోస పెడుతుందని.. ప్రస్తుతం రైతాంగానికి సాగునీరు అందించేం దుకు కాళేశ్వరం జోన్ పరిధిలో ఉన్న ప్రాజెక్టులు సిద్దంగా ఉన్నాయని.. రైతంగానికి నీళ్లవ్వడం చేతకాక పోతే కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్టు అప్పగిస్తే మూడు రోజుల్లో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అన్నారు.అదివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని మాజీ ఎమ్మెల్యే చందర్ నివాసంలో ఏర్పాటు సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కోరుకంటి చందర్‌తో కలసి మంత్రి మాట్లాడారు.కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధిలో ముందుకుసాగి సుభిక్షంగా ఉంటే..అజ్ఞాని రేవంత్ పాలనలో తెలంగాణ రాష్ట్రం తిరోగమనంలో వెళ్తుందన్నారు. మూర్ఖపు పాలనలో ప్రజలు విసిగిపోతున్నారన్నారు. తెలంగాణ ప్రాంతాన్ని కేసీఆర్ సుభిక్షంగా ఉంచితే ఇప్పుడున్న సీఎం రేవంత్‌రెడ్డి అప్పలపాలు చేస్తున్నాడన్నారు. కాంగ్రెస్ సర్కారు రైతాంగానికి కావాలనే నీళ్లు అందించడం లేదన్నారు.. లక్షలాది ఎకరాలకు కావలసిన సాగునీరు సిద్దంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్లు, కంపుమాటలతో కాలం వెళ్లదీస్తుందన్నారు.
సీఎం రేవంత్‌రెడ్డి, నీళ్ల మంత్రి అజ్ఞానంగా వ్యవహరిస్తున్నారని కేసీఆర్ పాలనలో సుభిక్షంగా ఉన్న తెలంగాణ ప్రాంతాన్ని రేవంత్‌రెడ్డి అప్పులపాలు చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు జోన్ పరిధిలో మెడిగడ్డ, అన్నారం, సుందిళ్ల కన్నెపల్లి బ్యారేజీలకు ఎలాంటి ఇబ్బందులు లేవని లక్షలాది ఎకరాలకు నీళ్లందించేందుకు సిద్దంగా ఉన్నాయన్నారు. అజ్ఞాని ముఖ్యమంత్రి రేవంత్ నీళ్ల మంత్రికి సాధారణ వర్షపాతం లేన్నప్పుడు బ్యారేజీలోని నీటినిల్వలు వాడుకోవాలన్న సోయిలేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు కౌశిక హరి, నడిపెల్లి మురళీధర్‌రావు, పి.టి.స్వామి, పెంట రాజేష్, బొడ్డు రవీందర్,నారాయణదాసు మారుతి, చిలకలపల్లి శ్రీనివాస్, అచ్చే వేణు, నూతి తిరుపతి, ఇంజపూరి నవీన్, జిట్టవేన ప్రశాంత్, ఇరుగురాళ్ల శ్రావణ్, బుర్ర వెంకటేష్, చింటూ, పాల్గొన్నారు.

# అనుమతి పత్రం వట్టిదేనా?

- వేములవాడలో స్కూళ్ల పేర్ల మాయాజాలం ...
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ...
- పాతికేళ్లుగా కొన్ని..కొత్తగా మరికొన్ని..




**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 13 (జనంసాక్షి) :**
రాష్ట్ర మొత్తంలో విద్య విధానం వేరుగా ఉంటే వేములవాడలో విద్యా విధానం కొత్త పోకడలకు పోతుంది. విద్యాశాఖ అధికారుల నుండి పాఠశాలకు ఇచ్చిన అనుమతి పత్రాలపై ఉన్న పేర్లను విద్యాలయాల నిర్వాహకులు బేఖాతర్ చేస్తూ తమ ఇష్టారీతిగా మార్చుకున్నారు.
పాతికేళ్లుగా కొన్ని విద్యాలయాలు కార్పొరేట్, హైదరాబాద్, న్యూమరాలజీ పేరిట పేర్లు పెట్టుకుని అసలు అధికారులు ఇచ్చిన అనుమతి పత్రాలనే వట్టివంటు ప్రగల్బాలకు పోతున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న పాఠశాలలకు అనుమతి లభించక పోవడంతో గతంలో వేములవాడలో ఉన్న పాత పాఠశాల గుర్తింపులను తీసుకుని విద్యా సంవత్సరాన్ని ప్రారంభించడంతో జిల్లాలో జరుగుతున్న వింత విద్యా వ్యాపారం వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఓ నాలుగు పాఠశాలలకు అనుమతులు లేవంటూ జిల్లా విద్యాశాఖ అధికారితో పాటు మండల విద్యాధికారి ఆకస్మిక తనిఖీలకు రావడంతో అసలు వేములవాడలోని ఏ పాఠశాల విద్యాశాఖ నిబంధనలను పాటించడం లేదని విషయం బహిర్గతం అయింది.

**కాగితంపై ఒకటి.. కనబడేది మరొకటి...**
పాఠశాల ప్రారంభానికి అవసరమైన నిరభ్యంతర (ఎన్ఓసీ) లను సమర్పించి, పాఠశాల పరిసరాలకు సంబంధించిన ఫోటోలను నిర్ణీత నమూనాలో విద్యాశాఖకు అప్పగిస్తే విద్యాశాఖ అధికారులు పాఠశాల నిర్వహణకు ఒక పేరును కేటాయిస్తూ అనుమతి పత్రాలను అందజేస్తారు. కానీ ఇక్కడ అలాంటి పత్రాలను సమర్పించకుండానే డబ్బులు చెల్లించి అనుమతులు తెచ్చుకున్న వారు కొందరైతే, అసలు కనీస సౌకర్యాలు లేకుండా పాతిక సంవత్సరాలుగా పాఠశాల నడుపుతున్న వారు మరికొందరనే విమర్శలు ఉన్నాయి. ఇవే కాకుండా పాఠశాల అనుమతిని ఏదో రకంగా సాధించిన పేరును కాగితాలకే పరిమితం చేస్తూ రాష్ట్రంలోని కార్పొరేట్ హైదరాబాద్ విద్యాలయాల పేరును చెబుతూ విద్యార్థుల నుండి డబ్బులను దండుకుంటున్నారు. ఏ పాఠశాలలోనూ ఐఐటి, మెడిసిన్, జేఈఈ విద్యాబోధన లేకున్నా వాటిని బోధిస్తున్నామంటూ ప్రకటనలు చేస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నారు. అసలు రెగ్యులర్ విద్యా విధానం కాకుండా ఐఐటి,మెడిసిన్ ఫౌండేషన్ బోధించడానికి అనుమతులు ఎంత మేరకున్నాయో అధికారులు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**కొత్త పాతల గొడవతో..**
గత పాతిక సంవత్సరాలుగా ఏదో విధంగా విద్యాలయాలు వేములవాడలో నడుస్తున్నాయి. కొత్తగా ప్రారంభించిన నాలుగు పాఠశాలలపై పాఠశాల యజమానులు వారి బాధ్యులు జిల్లా విద్యాధికారికి పదేపదే ఫిర్యాదులు చేస్తూ వాటిని మూసివేయాలని పట్టుపట్టారు. అప్పటికి సంయమనం పాటించాలని అధికారులు చెప్పిన అవేవీ పట్టించుకోకుండా బేషరుతుగా నాలుగు పాఠశాలలను మూసివేయాలని జిల్లా కలెక్టర్ కు మళ్లీ ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలనకు డిఇఓతో పాటు ఎంఈఓ సంబంధిత పాఠశాలకు వెళ్లగా అసలు కొత్త పాఠశాల భవనాల్లోనే వసతులు ఉన్నాయని పాఠశాల బాధ్యులు తెలిపారు. పాతికేళ్లుగా నడుస్తున్న పాఠశాలలకు కనీస ఆటస్థలం లేదని, పిల్లలకు నడిచేందుకు దారి లేదని,మూత్రశాలలు లేవని,వారి పాఠశాల బోర్డులపై ఉన్న పేర్లకు ప్రభుత్వ అధికారులు ఇచ్చిన అనుమతి పత్రాలకు సంబంధం లేకుండా నడుస్తున్నాయని ఈ విషయంలో తాము బహిరంగ చర్చకు సిద్ధమని తెలపడంతో ఇన్నాళ్లు నిగూఢంగా ఉన్న వసతుల డొల్లతనం బహిర్గతమైంది. ఇప్పటికైనా అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించి అధికారిక పత్రాలు, అనుమతి పొందేందుకు సమర్పించ పత్రాలను పరిశీలించి విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

### తెలంగాణ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం



**నిజామాబాద్ జిల్లా బ్యూరో జులై 13 (జనం సాక్షి) :**
ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బాన్సువాడ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహాన్ని ఆదివారం అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన హాస్టల్ వసతులపై మరియు భోజనం గురించి విద్యార్థినులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం అయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటూ వసతి గృహల్లో ఉంటున్న విద్యార్థినీ, విద్యార్థుల విషయంలో వార్డెన్ లు, వసతి గృహల ఇంచార్జిలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి బోనమెత్తిన పోచారం

**నిజామాబాద్ జిల్లా బ్యూరో :** జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలో ఆశాడమాస బోనాల పండుగ సందర్బంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి స్వయంగా బోనం ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అదేవిదంగా కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణ కేంద్రంలోని సంగమేశ్వర కాలనీలో ఆషాఢ మాసం బోనాల పండుగలో పోచారం శ్రీనివాస రెడ్డి-పుష్ప, పాల్గొన్నారు.







# న్యాయ వ్యవస్థ పట్ల ప్రజా విశ్వాసం సంరక్షణకు కృషి చేయాలి

- రాష్ట్ర హై కోర్టు జడ్జి అండ్ పెద్దపల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కే. లక్ష్మణ్
- ప్రతి పౌరుడికి అందుబాటులో న్యాయ వ్యవస్థ
- ఎండింగ్ కేసులు పరిష్కారానికి అందరూ సహకరించాలి
- ఓదెల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర హైకోర్టు జడ్జి

**సుల్తానాబాద్,జూలై 13(జనంసాక్షి) :** న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని సంరక్షించే దిశగా మనమంతా కృషి చేయాలని రాష్ట్ర హై కోర్టు జడ్జి పెద్దపల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కే. లక్ష్మణ్ అన్నారు.ఆదివారం ఓదెల మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవిష్కరించేందుకు రాష్ట్ర హై కోర్టు జడ్జి పెద్దపల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కే. లక్ష్మణ్, హై కోర్టు జడ్జీలు ఎన్.వి. శ్రావణ్ కుమార్, ఈ.వి.వేణు గోపాల, జే. శ్రీనివాస్ రావు లతో కలిసి విచ్చేశారు.రాష్ట్ర హైకోర్టు జడ్జిలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీతా కుంచాల, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝ సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మేకల తిరుపతి రెడ్డిలు స్వాగతం పలకగా, పండి తులు వేదమంత్రాల మధ్య పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రాష్ట్ర హైకోర్టు జడ్జి జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించి సర్వమత ప్రార్థనలు నిర్వహించారు.రాష్ట్ర హై కోర్టు జడ్జి పెద్దపెల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కే. లక్ష్మణ్ మాట్లాడు తూ ఓదెల మండలంలో జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఏర్పడటం చారిత్రాత్మిక అంశమని, దీని వల్ల ప్రజల సమీపంలో న్యాయం అందే అవకాశాలు మెరుగవుతాయని అన్నారు.పెద్దపల్లి జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో అనేక కేసులు పెండింగ్ లో ఉన్నాయని, న్యాయవ్యవస్థలో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి మౌలిక వసతుల మెరుగుదల, నూతన కోర్టుల ఏర్పాటు వంటి చర్యలు తీసుకుంటున్నామని, న్యాయవాదులు, ప్రజలు సైతం సహకరించాలని ఆయన కోరారు.న్యాయ వ్యవస్థలో రూల్ ఆఫ్ లా అందరికీ సమానంగా అమలు కావాలని, సమాజంలోని ప్రతి పౌరునికి, వెనుకబడిన వర్గాల ప్రజలకు సమాంతరంగా న్యాయ సేవలు తప్పనిసరిగా అందాలని తెలిపారు. న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకునే దిశగా మనమంతా సమిష్టిగా పనిచేయాలని, కోర్టు లో న్యాయవాదులు, జడ్జిల ప్రవర్తన మార్గదర్శకాలు మేరకు మర్యాద పూర్వకంగా ఉండాలని ఆయన సూచించారు.ఓదెల మండలంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని తయారు చేసేందుకు సహకరించిన జిల్లా కలెక్టర్, అధికార యంత్రానికి హై కోర్టు జడ్జి అభినందనలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర హైకోర్టు జడ్జిలను సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని న్యాయ మూర్తులు, కోర్టు సిబ్బంది, జిల్లాలోని బార్ అసోసియేషన్ సభ్యులు, డిసిపి కరుణాకర్, ఆర్డీవో గంగయ్య, తహసిల్దార్ ధీరజ్, ప్రజా ప్రతినిధులు, న్యాయాధికారులు, న్యాయవాదులు, పోలీస్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.





# అట్టహాసంగా అల్ఫోర్స్ "రివయాత్"

**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 13 (జనంసాక్షి) :**
సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తాయని ముఖ్యంగా వారు ఒత్తిడి నుండి ఉపశమనం పొందవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక దేశరాజ్ పల్లిలోని ఒక ప్రైవేటు వేడుక మందిరంలో అట్టహాసంగా వేడుకగా నిర్వహించినటువంటి అల్ఫోర్స్ జూనియర్ కళాశాలల రివయాత్ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రారంభంనికి ముందు వారు సరస్వతి మాత విగ్రహానికి పూజా కార్యక్రమం నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని శోభయమానంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల విస్తృతంగా అవగాహన కల్పించాలని, వాటిలో పాల్గొనేందుకు తగిన ప్రోత్సాహకాలను అందించాలని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎదుర్కొనటువంటి ఒత్తిడి నుండి ఉపశమనం కలిగించడానికి తప్పనిసరిగా సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనాలని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సంస్కృతి సాంప్రదాయం పరిరక్షించడమే కాకుండా దేశ కళల ఔన్నత్యాన్ని ఇతరులకు చాటి చెప్పవచ్చని వారు అభిప్రాయపడ్డారు.సాంస్కృతిక కార్యక్రమాలకు విద్యా ప్రణాళికలో ప్రత్యేకత ఇవ్వాలని తద్వారా విద్యార్థులకు చదువుకునేందుకు ఆసక్తి పెంపొందించుకుంటారని అభిప్రాయపడ్డారు. వేడుకలలో భాగంగా విద్యార్థుల ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక ప్రదర్శనలు, నాటికలు ఆలోచింపచేసాయి. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు ఇటీవల కాలంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహింపబడిన ఐఐటి , నీటి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రతిష్టాత్మక ఐఐటీ, ఎన్ఐటి, ఐఐఐటీ, మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధించిన, సాధించబోయే విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రైతులని ఆదుకోవాలి

**వరద కాలువ నీటిని తక్షణమే విడుదల చేయాలి**

**కథలాపూర్ :** మండలంలోని వరద కాలువలో నీటిని తక్షణమే నింపాలి, వరదకాలువలో నీళ్లు అడగంటి పోయాయని తక్షణమే మోటార్లు ఆన్ చేసి నీటిని నింపాలి అని జగిత్యాల జిల్లా రైతు ఐక్య వేదిక నాయకులు బద్దం మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు కాలువ లో నీటు లేక వరి నారు మళ్ళు కూడా పారలేని పరిస్థితి ఉందని మొక్కజొన్న పంటలు ఎండి పోతుందని కావున నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని లేకుంటే రైతు ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఉద్యమాలు ఉవ్వెత్తున లేస్తాయని స్పష్టం చేశారు పురుకుటపు గంగారెడ్డి,జవిడి తిరుపతి రెడ్డి, బద్దం మహిపాల్ పాల్గొన్నారు



## లక్కీడ్రా వెంచర్లలో దగా!

**ఆర్మూర్ జులై 13 (జనం సాక్షి) :**
పది ఏళ్ల పాటు కష్టించి సామాన్యుడి బీజం,ఇల్లు కట్టాలన్న ఆకాంక్ష ప్లాటు కొనుగోలుతోనే మొదలవుతుంది. దినదిన అభివృద్ధి భూమి విలువ పెరుగుతూ పోతుంటే దానికి అనుగుణంగా లేఅవుట్ యాజమానుల మోసాలు,దగా కూడా ఎక్కువ అవుతున్నాయి.ఆర్మూర్ మున్సిపాలిటీ లేఅవుట్ వెంచర్ల యజమానులు డిటిసిపి అనుమతి ఉందంటూ లక్కీ డ్రాలు నిర్వహించి మోసగించిన దాఖలాలు కోకొల్లలు ఉన్నాయి. డిటిసిపి నిబంధనల ప్రకారం మొదటి రెండు సంవత్సరాల అనుమతిని వెంచర్ యజమానులు అన్ని అనుమతులు ఉన్నాయంటూ ప్లాట్లను విక్రయించారు.పూర్తి స్థాయిలో వెంచర్ కి ఫైనల్ అప్రూవల్ రాక ముందే లక్కీ డ్రా పేరిట వాయిదాల పద్ధతిలో ప్రతినెల డబ్బులు చెల్లించి కొనుగోలు చేయించారు. వాయిదా పద్ధతిలో చెల్లించిన డబ్బులు సమయం కాస్త లేట్ అయిన డబ్బులు కట్టి చూపించిన ప్లాటును అమ్మేశామంటూ కొత్తరకం మోసం చేస్తారు.రేటు,డిమాండ్ పెరిగిందంటూ ఇంకాస్త డబ్బులు గుంజేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తారు.ఇదిలా ఉంటే వెంచర్ యజమానులు పూర్తి సౌకర్యాలు కల్పించాక అమ్మవలసిన ప్లాట్లను లేఅవుట్ ఫైనల్ అప్రూవల్‌చేయకముందే అంటగడతారు. డబ్బులు చెల్లించిన తర్వాత రిజిస్ట్రేషన్లు చేయక పోవడంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో అరకొర వసతులతో వెంచర్లు చాలానే వెలిశాయి. ఇలాంటి వాటిపై మున్సిపల్ అధికారులు పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

# ఎల్లారెడ్డి రేంజ్‌లో.. అడవి తల్లిపై గొడ్డలి వేటు

**నిజామాబాద్ జిల్లా బ్యూరో జులై 13 (జనంసాక్షి) :**
కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి అటవీ రేంజ్ పరిధిలోని కళ్యాణి బీట్ పరిధిలో గల రత్నాపూర్ గ్రామ శివరులోని అటవీ ప్రాంతంలో చెట్ల నరికివేత భారీగా కొనసాగుతోంది. అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫారెస్ట్ రేంజ్ అధికారులు అటవీ ప్రాంతాన్ని పరిశీలించినప్పటికి అడవి ప్రాంతంలో చెట్ల నరికివేత కొనసాగుతూనేవుంది. ఇదిలా ఉండగా ఎల్లారెడ్డి మండలం రత్నాపూర్ గ్రామ పరిధిలో ఫారెస్ట్ భూముల్లో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలు స్థానికులలో ఆందోళన కలిగిస్తున్నాయి. పోడు వ్యవసాయం పేరిట చెట్ల నరికివేత కొనసాగుతోంది. ఆటవీ ప్రాంతంలో కలపను నరికి ఇటుక బట్టీలకు తరలించి ఇటుకలు కాల్చడం వంటి పనులను అనునిత్యం కొనసాగిస్తున్నప్పటికీ అటవీ శాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రత్నాపూర్ పరిధిలో ఉన్న ఫారెస్ట్ భూముల్లో ఇటుకల కోసం మట్టి తవ్వడం, చెట్లను నరకడం, వాటికి కావాల్సిన కట్టెలు అక్కడికక్కడే కాల్చడం జరుగుతోందని గ్రామస్థులు చెబుతున్నారు. ఫోటోలు, వీడియోల రూపంలో ఆధారాలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు, రేంజ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. 2018లో లక్ష్మాపూర్ గ్రామ పరిధిలో అరుదైన వృక్షాలను నరికిన ఘటనలో ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో వాటి విలువ రూ.4 లక్షల రూపాయలుగా అంచనా వేసిన అటవి శాఖే ఇప్పుడు అదే ప్రాంతంలో జరుగుతున్న చెట్ల నరికివేత జరుగుతున్నా అధికారులు మౌనంగా ఉండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నెలలోనూ ఎల్లారెడ్డి ఫారెస్ట్ రేంజ్ అధికారి సస్పెండ్ అయ్యారు. ఇంచార్జీ అధికారి పాలనలో రేంజ్ పరిధిలో ఫారెస్ట్ భూములపై గుట్టలు ఆక్రమణలు జరుగుతున్నాయి. రేంజ్ పరిధిలో బీట్ అధికారులు ఉన్నప్పటికీ వారి కనుసన్నులలోనే అక్రమంగా కలప, నిర్మాణ సామాగ్రి తరలింపు, చెట్ల నరికివేత యుదేచ్చగా జరుగుతున్నాయనీ ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పోడు వ్యవసాయ భూములకు పట్టాల విషయం ఇచ్చినప్పటికి ఎలాంటి ప్రకటన జారీ చేయలేదు. కాని పోడు పేరిట అడవి నరికివేత సాగుతోంది. ఇకపొతే రిజర్వు ప్రాంతానికి ఆనుకుని ఉన్న ఇటుక బట్టీలకు ఎలాంటి అనుమతులు లేకుండానే కలప నరికి ఇటుక బట్టీలలో కాల్చుతున్నా కూడా అధికారుల నుండి ఎలాంటి చర్యలు లేవు. నిర్మాణాలకు, ఫర్నిచర్ కోసమని విలువైన టేకు చెట్లను కూడా నరికి వేస్తున్నారు. రెంజ్ పరిధిలో సెక్షన్ ఆఫీసర్ లు, బీట్ ఆఫీసర్ లు ఉన్నప్పటికి పెట్రోలింగ్ సాగుతుండగా అటవి ప్రాంతాలలో చెట్ల నరికివేతపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

- జై బాపు జై భీమ్ జై సంవిధాన్ ర్యాలీ
- రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం
- కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు




కోరుట్ల జూలై (జనం సాక్షి ):
మెట్ పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా వెల్లుల్ల గ్రామంలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ప్రతిజ్ఞ చేయించి వెల్లుల్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు నుండి ప్రజలు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు విచ్చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా వెల్లుల్ల గ్రామంలో వాడ వాడల పాదయాత్ర చేపట్టడం జరుగుతుందని రాజ్యాంగాన్ని అత్యంత పవిత్రమైనదిగా ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగంగా భావిస్తామని సార్వభౌమత్వ సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగ నిర్మించుకోవడానికి సాంఘిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని ఆలోచన భావ ప్రకటనను అంతస్తులును అవకాశాల్లోనూ మానవత్వాన్ని కల్పించడానికి కులమత ప్రాంత వర్మ లింగ ధనిక పేద లాంటి ఏ రకమైన భేదాలు లేకుండా అందరికీ సమాన హక్కులు బాధ్యతలు రాజ్యాంగ కల్పించిందని ఇటీవల పరిమాణాలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ రాజ్యాంగ విలువలను కాలరాస్తూ సమాజంలో అసాధ్యులే నెలకొల్పుతున్నాయని విభేదాలు సృష్టిస్తూ రాజకీయ మనగడ కోసం విద్వేషాలు రెచ్చగొడుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ 200 రూపాయల వరకు ఉచిత విద్యుత్ ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం రైతు రుణమాఫీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు కావున రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని కాబట్టి ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి గ్రామంలో ర్యాలీ నిర్వహించాలన్నారు కాంగ్రెస్ పార్టీ అంటేనే పేద ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేసే పార్టీ అని అన్నారు కాంగ్రెస్ పార్టీ చేపట్టే అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు తో పాటు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు వెల్లుల్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# 'బేటీ బచావో.. బేటీ పడావో'

## నినాదానికి అర్థం ఏమిటి? : ది గ్రేట్ ఖలీ



హరియాణాకు చెందిన రాష్ట్రస్థాయి టెన్నిస్ క్రీడాకారిణి రాధికా యాదవ్ (25)ను ఆమె తండ్రి దీపక్ యాదవ్ (49) హత్య చేసిన ఘటనపై 'ది గ్రేట్ ఖలీ'గా ప్రసిద్ధి చెందిన డబ్ల్యూడబ్ల్యూఈ స్టార్, భాజపా నేత దలీప్ సింగ్ రాణా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం ఓ కార్యక్రమంలో మహిళా సాధికారత గురించి మాట్లాడుతూ, ఈ హత్య గురించి ప్రస్తావించారు. తన సొంత కుమార్తెను ఒక తండ్రి హత్య చేయడం అత్యంత దురదృష్టకరమని, ఇలాంటి ఘటనలు జరుగుతుంటే 'బేటీ బచావో.. బేటీ పడావో' నినాదం యొక్క ఉద్దేశ్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సామాజిక మనస్తత్వాలు, పరిస్థితులు మారకపోతే దేశం ఎంత అభివృద్ధి చెందినా విశ్వగురువుగా మారలేమని దలీప్ సింగ్ అన్నారు. స్త్రీలు ఏ విషయంలోనూ పురుషుల కంటే తక్కువ కాదని, తల్లిదండ్రులు తమ కుమార్తెలను అన్ని రంగాలలో ప్రోత్సహించాలని సూచించారు. భవిష్యత్తులో మరింత మంది మహిళలు క్రీడల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. గురుగ్రామ్‌లో కుటుంబంతో నివసిస్తున్న రాధికా యాదవ్‌ను గురువారం ఆమె తండ్రి దీపక్ యాదవ్ వంట చేస్తుండగా వెనక నుంచి తుపాకీతో కాల్చి హత్య చేశాడు. నిందితుడు పోలీసుల కస్టడీలో నేరాన్ని అంగీకరించాడు. రాధిక తన సంపాదనపై ఆధారపడి జీవిస్తున్నారని అవహేళన చేసిందని, అందుకే ఈ హత్య జరిగిందని మొదటి నివేదికలు తెలిపాయి. అయితే, కుటుంబ పరిచయస్తులు ఈ వాదనలో నిజం లేదని చెబుతున్నారు. రాధిక మ్యూజిక్ రీల్స్ చేయడం తండ్రికి ఇష్టం లేకపోవడం కూడా హత్యకు ఒక కారణం కావొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# సంపన్న క్రికెటర్లపై పెనాల్టీలు ప్రభావం చూపవు: మైఖెల్ వాన్



లార్డ్స్‌లో జరుగుతున్న భారత్-ఇంగ్లాండ్ రెండో టెస్ట్ మ్యాచ్‌లో తొలి రోజు భారత్ కేవలం 83 ఓవర్లు మాత్రమే వేసింది, రెండో రోజు ఇరు జట్లు కలిపి 75 ఓవర్లు వేశాయి. ఈ స్లో ఓవర్ రేటుపై ఇంగ్లాండ్ మాజీ ఆటగాడు మైఖెల్ వాన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. "మొదటి, రెండో, మూడో, నాలుగో రోజుల్లో ఆట ఎందుకు నెమ్మదిగా సాగుతోందో నాకు అర్థం కావడం లేదు. కేవలం మ్యాచ్ చివరి రోజు మాత్రమే కాకుండా, ఇరు జట్లు అన్ని రోజులూ వేగంగా ఆడాలి. అప్పుడే అంపైర్లు కూడా చురుగ్గా ఉంటారు, డ్రింక్ బ్రేక్‌లు తగ్గుతాయి. ఎందుకంటే, రోజుకు 90 ఓవర్లు వేయాలని జట్లకు తెలుసు. జట్లు పూర్తి కోటా ఓవర్లు వేయడం ప్రారంభిస్తే, టెస్ట్ మ్యాచ్‌లలో జీవం వస్తుంది. 90 ఓవర్లు వేస్తే మ్యాచ్‌లు మెరుగవుతాయని గ్యారెంటీగా చెబుతాను," అని వాన్ అన్నాడు. భారత కెప్టెన్ శుభ్మన్ గిల్, ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్‌లను సంపన్న క్రికెటర్లుగా పేర్కొన్న వాన్, స్లో ఓవర్ రేటుకు పెనాల్టీలు విధించడం వారిపై పెద్దగా ప్రభావం చూపదని తెలిపాడు. "పెనాల్టీలు ప్రభావం చూపుతాయని నేను అనుకోను. ఈ క్రికెటర్లు చాలా సంపన్నులు. నగదు జరిమానాలు వారిని ప్రభావితం చేస్తాయని అనుకోవడం కష్టం. స్లో ఓవర్ రేటు టెస్ట్ మ్యాచ్‌లలో ఒక సమస్యగా మారింది. వేడి ఎక్కువగా ఉన్నప్పటికీ, ఆటగాళ్లు గాయాలతో బాధపడుతున్నప్పటికీ, ఐదో రోజు 90 ఓవర్లు వేసి తీరాలి. జట్లు ఈ విషయంలో కచ్చితత్వం పాటిస్తే, టెస్ట్ క్రికెట్‌లో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది," అని వాన్ పేర్కొన్నాడు.



## త్రిసభ్య కమిటీ ఏర్పాటు

### బాక్సింగ్ సమాఖ్య ఎన్నికలపై ఉత్కంఠ

భారత బాక్సింగ్ సమాఖ్య ఎన్నికల్లో నెలకొన్న అనిశ్చితికి త్వరలోనే పరిష్కారం లభించనుంది. కార్యవర్గం పదవీ కాలం ఫిబ్రవరి 2, 2025న ముగిసినప్పటికీ, ఐదు నెలలు గడిచినా కొత్త ఎన్నికలు నిర్వహించకపోవడంపై భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఆదివారం ఆమె త్రిసభ్య కమిటీని నియమించారు. "ప్రస్తుత కార్యవర్గం పదవీ కాలం ముగిసినప్పటికీ ఎన్నికలు జరగకపోవడం వల్ల బాక్సింగ్ పోటీల నిర్వహణ, బీఎఫ్ఐ పనితీరుపై ప్రతికూల ప్రభావం పడుతోంది. అందుకే, ఎన్నికలకు అడ్డంకులైన అంశాలను పరిశీలించి, వారం రోజుల్లో నివేదిక సమర్పించేందుకు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశాం," అని పీటీ ఉష తెలిపారు. ఈ కమిటీలో ఐఓఏ కోశాధికారి సహదేవ్ యాదవ్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు భూపేందర్ సింగ్ భజ్వా, న్యాయవాది పాయల్ కక్రా సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఎన్నికల నిర్వహణ, పదవీ కాలం ముగిసిన వెంటనే ఎన్నికల ప్రక్రియ చేపట్టడంపై సూచనలు అందించనుంది. జూలై 5న క్రీడా మంత్రిత్వ శాఖ ఈ విషయంలో చొరవ తీసుకోవాలని పీటీ ఉషకు లేఖ రాసింది. దీంతో, ఆలస్యం చేయకుండా సమస్య పరిష్కారానికి కమిటీ ఏర్పాటుతో ఐఓఏ చీఫ్ ముందడుగు వేశారు.





**ఇంగ్లండ్ గడ్డపై తొలి టీ20 సిరీస్‌ను 3-2 తేడాతో కైవసం చేసుకుని భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. అయితే, ఐదో మరియు ఆఖరి టీ20 మ్యాచ్‌లో ఉత్కంఠభరిత పోరులో 5 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఓపెనర్ షఫాలీ వర్మ (75) అర్ధ శతకంతో రాణించినప్పటికీ, మిడిలార్డర్ వైఫల్యం కారణంగా భారీ స్కోరు సాధ్యం కాలేదు. సిరీస్‌లో 10 వికెట్లతో అద్భుత ప్రదర్శన కనబరిచిన తెలుగమ్మాయి శ్రీ చరణి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును అందుకుంది.**

**రాబోయే వన్డే సిరీస్**

**టీ20 సిరీస్ కోల్పోయిన ఇంగ్లండ్ జట్టు, జూలై 16 నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్‌కు గట్టి పోటీ ఇవ్వాలని భావిస్తోంది. ఈ సిరీస్‌లో భారత జట్టు తమ విజయ పరంపరను కొనసాగించేందుకు సిద్ధంగా ఉంది.**

# విజయం వరించినా!

## తెలుగమ్మాయికి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్

ఇంగ్లండ్‌లో తొలి టీ20 సిరీస్‌ను 3-2 తేడాతో కైవసం చేసుకుని చరిత్ర సృష్టించిన భారత మహిళల క్రికెట్ జట్టు, ఐదో టీ20లో ఓటమి చవిచూసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (75) అర్ధ శతకంతో రాణించినప్పటికీ, మిడిలార్డర్ వైఫల్యం కారణంగా భారీ స్కోరు సాధ్యం కాలేదు. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 5 వికెట్ల తేడాతో ఓదార్పు విజయం సాధించింది. అయినప్పటికీ, హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టు సిరీస్‌ను గెలుచుకుంది. సిరీస్‌లో 10 వికెట్లతో అద్భుతంగా రాణించిన తెలుగమ్మాయి శ్రీ చరణి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును అందుకుంది.

నామమాత్రమైన ఐదో టీ20లో భారత జట్టు నిరాశపరిచింది. ఓపెనర్ స్మృతి మంధాన (8) విఫలమైనప్పటికీ, షఫాలీ వర్మ (75) దూకుడుగా ఆడి జట్టుకు శుభారంభం అందించింది. ఆమె ఆటతీరుతో భారీ స్కోరు సాధ్యమనిపించినా, ఇంగ్లండ్ బౌలర్ చార్లీ డీన్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చి పరుగుల వేగాన్ని అడ్డుకుంది. జెమీమా రోడ్రిగ్స్ (1), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (15), హర్లీన్ డియోల్ (4) తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. రీచా ఘోష్ (24), రాధా యాదవ్ (14) పోరాడినప్పటికీ, భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 167 పరుగులు మాత్రమే చేసింది.

168 పరుగుల మోస్తరు లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ ఓపెనర్లు సోఫీ డంక్లె (46), డానిల్ వ్యాట్ హెడ్జే (56) సెంచరీ భాగస్వామ్యంతో బలమైన పునాది వేశారు. రాధా యాదవ్ ఈ జోడీని విడదీసినప్పటికీ, కెప్టెన్ టమ్మీ బ్యూమంట్ (30), వికెట్ కీపర్ అమీ జోన్స్ (10) దూకుడుగా ఆడి ఇంగ్లండ్‌కు 5 వికెట్ల తేడాతో విజయాన్ని అందించారు. సిరీస్ కోల్పోయిన ఇంగ్లండ్ జట్టు, జూలై 16 నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్‌కు సవాలు విసరాలని భావిస్తోంది.





# ఇంగ్లండ్ ఆలౌట్

## వాషింగ్టన్ సుందర్ దెబ్బ, భారత్ విజయ ఆశలు

బర్మింగ్‌హామ్‌లో సంచలన విజయంతో సిరీస్‌ను 1-1తో సమం చేసిన భారత జట్టు, లార్డ్స్ టెస్ట్‌లోనూ విజయానికి చేరువైంది. నాలుగో రోజు భారత బౌలర్ల ధాటికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 192 పరుగులకే కుప్పకూలింది. వాషింగ్టన్ సుందర్ (4/22) సంచలన బౌలింగ్‌తో ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను చాపచుట్టేస్తే, మహ్మద్ సిరాజ్ (2/31) మరియు జస్‌ప్రీత్ బుమ్రా (2/38) కీలక వికెట్లతో ఆతిథ్య జట్టును ఆలౌట్ అంచున నిలిపారు. ఈ గెలుపుతో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా సిరీస్‌లో 2-1 ఆధిక్యం కోసం 193 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు సిద్ధమైంది.

మొదటి రోజు ఇంగ్లండ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని 387 పరుగులు చేసింది. జో రూట్ (100), జేమీ స్మిత్ (184) రాణించగా, బుమ్రా ఐదు వికెట్లతో భారత బౌలింగ్‌ను నడిపించాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్ (100), రిషబ్ పంత్ (74), రవీంద్ర జడేజా (72) స్కోర్‌ను సమం చేశారు. నాలుగో రోజు ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో సిరాజ్ పేస్ ధాటికి బెన్ డకెట్ (12), ఓలీ పోప్ (4) తొలి సెషన్‌లోనే ఔటయ్యారు. నితీశ్ కుమార్ రెడ్డి జాక్ క్రాలీ (22)ను బౌల్డ్ చేయగా, ఆకాశ్ దీప్ హ్యారీ బ్రూక్ (23)ను స్కూప్ షాట్‌లో బౌల్డ్ చేసి ఇంగ్లండ్‌కు షాకిచ్చాడు.

లంచ్ తర్వాత జో రూట్ (40), బెన్ స్టోక్స్ (33) 67 పరుగుల భాగస్వామ్యంతో ఇంగ్లండ్‌ను ఆదుకున్నారు. అయితే, వాషింగ్టన్ సుందర్ స్వీప్ షాట్ ఆడుతున్న రూట్‌ను లెగ్ స్టంప్‌కు బౌల్డ్ చేసి ఈ జోడీని విడదీశాడు. ఆ తర్వాత జేమీ స్మిత్ (8)ను ఆఫ్ స్టంప్‌ను కొట్టి క్లీన్ బౌల్డ్ చేసిన సుందర్, ఇంగ్లండ్‌ను 154/6 వద్ద కష్టాల్లోకి నెట్టాడు. టీ బ్రేక్ అనంతరం స్టోక్స్‌ను కూడా సుందర్ బౌల్డ్ చేయగా, బుమ్రా యార్కర్లతో టెయిలెండర్లను ఔట్ చేశాడు. చివరగా షోయబ్ బషీర్‌ను సుందర్ బౌల్డ్ చేసి ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను 192 వద్ద ముగించాడు. 193 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన భారత్‌లో యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్ ఆధారంగా విజయం సాధించేందుకు సిద్ధంగా ఉంది. ఈ విజయం సిరీస్‌లో 2-1 ఆధిక్యాన్ని అందిస్తుంది. నాలుగో టెస్ట్ జూలై 23 నుంచి ఓల్డ్ ట్రాఫర్డ్‌లో, ఐదో టెస్ట్ జూలై 31 నుంచి ఓవల్‌లో జరగనుంది. ఈ సిరీస్ 2025-27 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగం.

**యశస్వీ డకౌట్ :**

స్వల్ప ఛేదనలో భారత జట్టుకు రెండో ఓవర్లోనే షాక్ తగిలింది. విధ్వంసక ఓపెనర్ యశస్వీ జైస్వాల్(0)ను ఆర్చర్ డకౌట్ చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో అతడి ఓవర్లోనే వెనుదిరిగిన యశస్వీ.. ఈసారి షార్ట్ పిచ్ బంతికి పెద్ద షాట్ ఆడబోయి వికెట్ కీపర్ స్మిత్ చేతికి దొరికాడు. దాంతో, 5 పరుగుల వద్ద భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ప్రస్తుతం కేఎల్ రాహుల్(5), కరుణ్ నాయర్(2)లు జాగ్రత్తగా ఆడుతూ భాగస్వామ్యం నిర్మించే పనిలో ఉన్నారు. ఇంకా గిల్ సేన విజయానికి 186 రన్స్ కావాలి.

### వాషింగ్టన్ సుందర్ దెబ్బ

నాలుగో రోజు ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో లంచ్ వరకు 87/4తో కొంత పటిష్టంగా కనిపించింది. జో రూట్ (40) మరియు బెన్ స్టోక్స్ (27 నాటౌట్) 67 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. టీబ్రేక్‌కు ముందు వాషింగ్టన్ సుందర్ రెండు కీలక వికెట్లతో ఇంగ్లండ్‌ను కుదేలు చేశాడు. మొదట జో రూట్‌ను స్వీప్ షాట్ ఆడుతుండగా లెగ్ స్టంప్‌కు బౌల్డ్ చేసిన సుందర్, ఆ తర్వాత విధ్వంసక బ్యాటర్ జేమీ స్మిత్ (8)ను ఆఫ్ స్టంప్‌ను కొట్టి క్లీన్ బౌల్డ్ చేశాడు. స్మిత్ ఊహించిన స్పిన్ లేకపోవడంతో బంతి నేరుగా స్టంప్ ను తాకింది. సుందర్ ఏడు ఓవర్లలో 2/13 గణాంకాలతో భారత్‌కు ఆధిపత్యాన్ని అందించాడు.





**ఆస్ట్రేలియా పర్యటనలో సారథిగా చిరస్మరణీయ విజయాలు అందించిన అజింక్యా రహానే జట్టుకు దూరమై రెండేళ్లు కావొస్తుంది. అతడు చివరిసారిగా వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో వైట్ జెర్సీ వేసుకున్నాడు. దేశవాళీ టోర్నీలు, ఐపీఎల్‌లో అదిరిపోయే బ్యాటింగ్‌తో చెలరేగుతున్న ఈ మాజీ కెప్టెన్ మరోసారి టెస్టుల్లో ఆడాలనుకుంటున్నాడట. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వీడ్కోలుతో తనకు అవకాశం ఇవ్వాలని సెలెక్టర్లను కోరుతున్నాడు రహానే.**

# ఓయూలో సీజేఐ బీఆర్ గవాయ్ ప్రసంగం

- రాజ్యాంగం ఆత్మగా ఆర్టికల్-32, అంబేడ్కర్ దార్శనికతపై వెలుగు





**హైదరాబాద్, జులై 14, (జనం సాక్షి):** భారత రాజ్యాంగం పౌరుల హక్కులను కాపాడే కవచంగా, ఆత్మగా నిలిచి ఆర్టికల్-32 ద్వారా న్యాయాన్ని అందిస్తోందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో జులై 12, 2025న జరిగిన "భారత రాజ్యాంగం: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సహకారం" సదస్సులో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ భవిష్యత్ అవసరాల ను దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగ సవరణలను అనుమతించారని, ఆ స్ఫూర్తితో పని చేయాలని ఆయన పేర్కొన్నారు. ఆర్టికల్-32 ద్వారా పౌరులు తమ హక్కులకు భంగం కలిగితే సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చని, ఇది రాజ్యాంగ ఆత్మ అని, లేకుంటే రాజ్యాంగం నిష్ప్రయోజనమవుతుందని అంబేద్కర్ చెప్పారని ఆయన గుర్తు చేశారు. 1946 డిసెంబర్ 17న అంబేద్కర్ రాజ్యాంగ సభలో ఈ ఆర్టికల్ ప్రాముఖ్యతను నొక్కిచెప్పారని ఆయన చెప్పారు.

అంబేద్కర్ ఒక దేశం - ఒక రాజ్యాంగం సిద్ధాంతంతో రాజ్యాంగాన్ని రూపొందించారని, ఇది భారత ఐక్యతకు కీలకమైందని జస్టిస్ గవాయ్ తెలిపారు. అమెరికా వంటి దేశాల్లో రాష్ట్రాలకు ప్రత్యేక రాజ్యాంగాలు, ద్వంద్వ పౌరసత్వం ఉన్నప్పటికీ, భారత్‌లో ఒకే రాజ్యాంగం, ఒకే పౌరసత్వం ఉండాలని అంబేడ్కర్ నిర్ణయించారని, 75 ఏళ్లలో ఈ రాజ్యాంగం దేశాన్ని ఐక్యంగా నిలబెట్టిందని ఆయన అభినందించారు. డైరెక్టివ్ ప్రిన్సిపల్స్ ఆఫ్ స్టేట్ పాలసీ న్యాయవంతమైన సమాజ నిర్మాణానికి మార్గదర్శకాలుగా ఉన్నాయని, ప్రాథమిక హక్కులతో సమతుల్యత సాధించడం రాజ్యాంగ లక్ష్యమని ఆయన తెలిపారు. చట్ట విద్యార్థులకు విదేశీ డిగ్రీల వెంట పరుగెత్తకుండా భారతీయ చట్ట విద్యను బలోపేతం చేయాలని, శ్రేష్ఠత బలమైన పునాదిలో ఉంటుందని సలహా ఇచ్చారు. సదస్సులో తెలంగాణ హైకోర్టు ఆక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్, సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. జస్టిస్ గవాయ్, తెలంగాణ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ పి. విద్యాసాగర్ రెడ్డితో కలిసి 'బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ - కాన్స్టిట్యూఎంట్ అసెంబ్లీ - కాన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా' స్మారక కవర్, 'ఆర్ట్ అండ్ కాలిగ్రఫీ ఇన్ ది కాన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా' పోస్ట్‌కార్డులను ఆవిష్కరించారు. రాజ్యాంగం సామాజిక, ఆర్థిక న్యాయాన్ని సాధించే జీవన దస్తావేజని, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ విలువలతో మహిళలు, వెనుకబడిన వర్గాలను ప్రధాన స్రవంతిలోకి తెచ్చిందని ఆయన అభినందించారు.

## విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను

# కళ్లారా చూసి చలించిన రాజన్న







- కస్తూరి బా విద్యార్థుల దీనగాధ కథనానికి.. మునుగోడు ఎమ్మెల్యే స్పందన
- సొంత ఖర్చులతో నాలుగు గదులు మరియు మౌలిక వసతులు నిర్మాణానికి రాజన్న హామీ
- వెంటనే నిర్మాణ పనులకు ఆదేశం తక్షణమే తన వ్యక్తిగత ఇంజనీర్ కు ఫోన్ చేసి రేపటినుండే నిర్మాణ పనులు
- తమ సమస్యలు పరిష్కరించిన రాజన్నకు కృతజ్ఞతలు తెలుపడానికి పోటీ పడ్డ విద్యార్థులు

**మర్రిగూడ, జూలై 13 (జనంసాక్షి) :**
నల్లగొండ జిల్లా, మునుగోడు నియోజకవర్గం, మర్రిగూడ మండలం కేంద్రంలోని కస్తూరి బా పాఠశాలలో గురించి ఆదివారం ఎమ్మెల్యే గారు చూడండి... కస్తూరిబా విద్యార్థుల దీనగాథ ఇరుకైన గదులలో విద్యాబోధన, ఇంటర్ విద్యను ప్రవేశపెట్టారు కానీ గదులను నిర్మించడం మరిచారు అనే శీర్షిక ప్రచురితమైంది, దేనికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెంటనే స్పందించి ఆదివారం కస్తూరిబా పాఠశాలను సందర్శించారు, మర్రిగూడ కేజీబీవీకి వెళ్లిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి సిబ్బంది విద్యార్థులు ఘన స్వాగతం పలికారు కేజీబీవీ అంతా కలియతిరిగి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు... విద్యార్థినుల సంఖ్య ఎక్కువగా ఉండడం సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు లేవని సిబ్బంది విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వీటిలో ప్రధానమైనవి బాత్రూమ్స్ సమస్య, డార్మిటరీ హాల్స్ సమస్య.. విద్యార్థినులు పడుకోవడానికి సరిపడా రూములు లేవని ఒక్కో రూములో 60 మంది విద్యార్థినులు పడుకోవాల్సి వస్తుందని సిబ్బంది ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. వేంటనే విద్యార్థినుల సమస్యకు పరిష్కారం చెప్పారు, తన సొంత నిధులతో ఖాళీగా ఉన్న ఫస్ట్ ఫ్లోర్ పై నాలుగు రూములు నిర్మించి ఇస్తానని బాత్రూమ్స్ కూడా సరిపడా వెంటనే నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చి... తక్షణమే తన వ్యక్తిగత ఇంజనీర్‌కు ఫోన్ చేసి రేపటినుండే నిర్మాణ పనులు మొదలుకావాలని ఆదేశించారు.వంటశాలకు వెళ్లి వండిన భోజనాన్ని తనిఖీ చేసి సరిగ్గా వండుతున్నారా లేదా అని ఆరా తీశారు.. తరగతి గదులకు వెళ్లి డార్మెటరీ హాల్స్ ను పరిశీలించి విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లారా చూశారు.

అలాగే కస్తూరిబా బాలికల విద్యాలయంలో 2024-2025 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థినికి 15000 రూపాయలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థినికి 10000 రూపాయలు, తృతీయ స్థానం సాధించిన విద్యార్థినికి 7500 రూపాయల నగదు బహుమతిని అందించి, శాలువాతో సన్మానించి మెమెం టో అందించారు, తమ సమస్యలు పరిష్కరించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలుపడానికి పోటీపడ్డారు,



## 108లో ప్రసవించిన మహిళా

**మల్హర్,జులై 13(జనం సాక్షి) :** మండల పరదిలోని నాచారం గ్రామానికి చెందిన కేతవేణి కేతక్కకి పురిటి నొప్పులు రాగా వారు 108 కి కాల్ చేయగానే టేకుమట్లలో ఉన్నటువంటి 108 అంబులెన్స్ అక్కడికి వెళ్లి వారిని నాచారం నుంచి భూపాలపల్లి డిస్టిక్ హాస్పిటల్ తీసుకువస్తుండగా దారి మార్గ మధ్యలోనే పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లో ఉన్నటువంటి టెక్నీషియన్ గమనించి కొంపల్లి తండా గ్రామ శివారులో రోడ్డు పక్కన ఆపి నార్మల్ డెలివరీ చేయడం జరిగింది. వారికి మగ బిడ్డ జన్మించడం జరిగింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారు. వారిద్దరిని భూపాలపల్లి డిస్టిక్ హాస్పిటల్‌కి తీసుకువెళ్లి అడ్మిట్ చేశారు. 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ బొమ్మ హరి ప్రసాద్, పైలట్ చేరి రవీందర్, గర్భిణీ మహిళా కేతక్క భర్త కుమార్ ఉన్నారు. ప్రజలు 108 సేవలు వినియోగించుకోవాలి అని 108 జిల్లా మేనేజర్ మేరుగు నరేష్ అన్నారు.

## జమియాతె ఉలేమా ఏ హింద్ ఆధ్వర్యంలో

# నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ



**తాండూరు జులై 13(జనంసాక్షి) :** తాండూరు పట్టణంలో నిరుద్యోగ యువత కు ఉపాధి కల్పించే లక్ష్యంగా జమియాతె ఉలేమా ఏ హింద్ వికారాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రఖ్యాత ట్రైనర్ మొహమ్మద్ జుబైర్ నిరుద్యోగం యువతకు వివిధ కంపెనీలలో ఉద్యోగం ఏ విధంగా సాధించవచ్చు వాటి పై అవగాహన నైపుణ్యాన్ని వివరించారు. ముఖ్యంగా ఈఎల్వి, నెట్ వర్కింగ్, సీసీటీవీ, ఐపి టెక్నాలజీ, ఫైర్ అలారం సిస్టంలో ఏ విధంగా నైపుణ్యాన్ని ప్రదర్శించాలి ఏ విధంగా ఉపయోగించాలి అనే వాటిపై వివరంగా వివరించారు. అదేవిధంగా నూతనంగా ఏఐ టెక్నాలజీ ద్వారా విదేశాలలో కూడా ఉపాధి అవకాశాలు నిండుగా ఉన్నాయని విటిలో కూడా నైపుణ్యానికి పెంపొందించుకోవాలని తెలిపారు. అనంతరం జమియాతె ఉలేమా ఏ హింద్ వికారాబాద్ ప్రతినిధులు అధ్యక్షులు, కార్యదర్శిలు, మౌలానా ముహమ్మద్, అబ్దుర్రహ్మాన్ అథ్హర్ ఖాస్మీ మాట్లాడుతూ దాదాపు నిరుద్యోగులు 150 మంది యువత ఇందులో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. యువతకు ఈ శిక్షణ ట్రైనింగ్ ఇవ్వడంతో ముఖ్య ఉద్దేశం నేటి సమాజంలో యువత అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. నిరుద్యోగ యువకులు ముఖ్యంగా ఉపాధి ఉద్యోగాలను సంపాదించి జీవితంలో పైకి ఎదగాలని అన్నారు నేటి సమాజంలో యువత వ్యసనాలకు అలవాటు పడకుండా సోషల్ మీడియా కు దూరంగా ఉండాలని అన్నారు. నిరుద్యోగ యువకులకు ఉద్యోగ ఉపాధి కల్పించాలని లక్ష్యంగా జమియాతె ఉలేమా ఏ హింద్ లక్ష్యం గా పని చేస్తుందని అన్నారు. ఉపాధి అవకాశాలు ఏమి ఉన్నా కూడా యువకులకు అన్ని విధాలుగా సహాయక సహకారాలు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువకులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
14 జూలై 2025

# మహిళలను కోటీశ్వరులు చేస్తాం

**మహిళలకు సంవత్సరానికి 20వేల కోట్ల వడ్డీ లేని రుణం**

**ప్రజల కోసమే ప్రతి రూపాయి ఖర్చు చేస్తాం**

**ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపడుతాం**

**విద్య, వైద్య రంగాల అభివృద్ధికి పెద్దపీట**

**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**



**మంచిర్యాల ప్రతినిధి జూలై 13 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని , కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంగా మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం వడ్డీలేని రుణాలు ఇచ్చి కోటీశ్వరులను చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం నాడు మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఆబ్కారీ-మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి-జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ - ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జి.సి.సి. చైర్మన్ కొట్నాక తిరుపతి, కనీస వేతన బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం ఎల్లవేళలా కృషి చేస్తుందని అందులో భాగంగానే ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల ఏర్పాటు, నవీకరణ కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా లక్షెట్టిపేట మండల కేంద్రంలో 8 కోట్ల 50 లక్షల రూపాయల ప్రభుత్వ నిధి, 1 కోటి రూపాయల సింగరేణి నిధులతో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం కొరకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండల కేంద్రంలో 10 కోట్ల 20 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్., డి.ఎం.ఎఫ్.టి. నిధులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థిని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచి నూతన మెనూ ఖచ్చితంగా అమలు చేస్తూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ఉపాధ్యాయుల నియామకం ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడం జరుగుతుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాల ద్వారా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామంలో ఇందిరా మహిళా శక్తి సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలకు చేయూతనిస్తూ దండేపల్లి మండలం అందుగులపేట (వెల్గనూర్) గ్రామంలో 4 ఎకరాల విస్తీర్ణంలో 3 కోట్ల రూపాయల వ్యయంతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, 90 శాతం బ్యాంకు రుణం, 10 శాతం గ్రామ సంఘాల వాటాతో రోజుకు సుమారు 4 వేల 500 నుండి 5 వేల యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి జరిగి సంవత్సరానికి దాదాపు 51 లక్షల రూపాయల రాబడి వస్తుందని తెలిపారు. నర్సింగపూర్ గ్రామంలో 1 కోటి 63 లక్షల రూపాయల సి. ఎస్. ఆర్. నిధులతో 2/200 కి.మీ. నుండి 3/100 కి.మీ. కొరకు 900 మీటర్ల మేర సి.సి. రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 80 లక్షల రూపాయల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో 4 గ్రామపంచాయతీ భవనాలు, 48 లక్షల రూపాయలతో 4 అంగన్వాడి భవనాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. లక్షెట్టిపేట మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో 1 కోటి రూపాయలతో ఎస్.సి.ఎస్.డి.ఎఫ్. క్రింద సి. సి. రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. హాజీపూర్ మండలం చిన్న గోపాల్ పూర్, ర్యాలీ గ్రామాలలో 2 కోట్ల 50 లక్షల రూపాయల ఎస్.టి.ఎస్.డి.ఎఫ్., ఎస్.సి.ఎస్.డి.ఎఫ్ నిధులతో నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వేంపల్లి, పోచంపహాడ్ శివారులలో 212 ఎకరాల భూమి విస్తీర్ణంలో 30 కోట్ల రపాయల వ్యయంతో అత్యాధునిక సదుపాయాలతో ఐటి/ ఇండస్ట్రియల్ పార్క్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా ఆర్థిక అభివృద్ధి కోసం సంవత్సరానికి 20వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణంగా అందించేందుకు చర్యలు తీసుకుంటామని, మొదటి సంవత్సరం 21 వేల 632 కోట్ల రూపాయలు అందించడం జరిగిందని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆర్. టి. సి. బస్సులు నడిపించేందుకు 600 బస్సుల ప్రతిపాదనలో 150 బస్సులను ఇవ్వడం జరిగిందని, త్వరలో 450 బస్సులను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ....మంచిర్యాల జిల్లాను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులో 212 ఎకరాలలో 30 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఇండస్ట్రియల్ పార్క్, ఆటోనగర్ ఏర్పాటు కొరకు భూమి పూజ నిర్వహించారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు ద్వారా రాబోయే రోజులలో 2 వేల మందికి ఉపాధి లభిస్తుందని, పెద్ద మొత్తంలో పరిశ్రమలు ఏర్పాటు అవుతాయని తెలిపారు. అటవీ శాఖ సంబంధించిన నూతన వాహనాలను ప్రారంభించి వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిను పరామర్శించిన మహేశ్ బిగాల



**హైదరాబాద్ (జనం సాక్షి) :** ఇటీవల శస్త్ర చికిత్సకు గురై కోలుకుంటున్న జనగామ శాసన సభ్యుడు పల్లా రాజేశ్వర్ రెడ్డిని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల హైదరాబాద్‌లోని వారి స్వగృహంలో పరామర్శించారు. ఈ సందర్భంగా మహేశ్ బిగాల మాట్లాడుతూ..పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా పూర్తి ఆరోగ్యాన్ని సాధించి, ప్రజాసేవలో మరింత ఉత్సాహంతో కొనసాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. అలాగే పల్లా రాజేశ్వర్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ ఎన్ఆర్ఐల తరపున ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## కేపీహెచ్‌బీ పోలీసు స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటున్న ఓ యువతి అదృశ్యమైన సంఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారంలో నివాసం ఉండే కేసు రత్నం కూతురు ఎం.సునీత (21) భర్తతో విడిపోయి తల్లిదండ్రులతో నివసిస్తుంది. జూన్ 6న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిన యువతి మరునాడు ఇంటికి వచ్చి... తాను కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్‌లోని హాస్టల్లో ఉంటున్నట్టు చెప్పింది. కూతురుతో కలిసి హాస్టల్ చూడడానికి వచ్చిన తండ్రిని సర్వీస్ రోడ్డులో వదిలేసి ఆ యువతి వెళ్లిపోయింది. బంధుమిత్రులను విచారించిన ఫలితం లేకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## సీఎం నివాసంలో పుస్తకావిష్కరణ

**బచ్చన్నపేట జూలై 13 (జనంసాక్షి) :** వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రచయిత జిల్ల నరేష్ రచించిన వనజీవి రామయ్య జీవిత చరిత్ర పుస్తకం వనజివికి వందనం ' విత్తనం నుండి మహా వృక్షం దాకా ' అనే పుస్తకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో రాష్ట్ర రెవెన్యూ సమాచార గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతులమీదుగా రాష్ట్ర విప్ డిప్యూటీ స్పీకర్ రామచంద్ర నాయక్. మహబూబాద్ ఎంపీ బలరాం నాయక్. వాస్విక్ ఫౌండేషన్ ఛైర్మన్ నిడిగొండ నరేష్ కుమార్. వైస్ ఛైర్మన్ నూకల భాస్కర్ రెడ్డి సమక్షంలో అట్టహాసంగా ఆవిష్కరించడం జరిగిందని నరేష్ కుమార్ తెలిపారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నేటి యువతకు నవ సమాజానికి స్ఫూర్తి దయకమైన వ్యక్తి వనజీవి రామయ్య ఆశయాలను కొనసాగిస్తూ వారి భావాలను ప్రపంచవ్యాప్తంగా చాటేలా వారి జీవిత చరిత్రనీ పుస్తక రూపంలో అందిస్తున్న వాస్విక్ ఫౌండేషన్ యాజమాన్యానికి మనస్ఫూర్తిగా అభినందలు తెలుపుకుంటూ మీరు ఇలాగే స్వచంద సేవ కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ రామచంద్ర నాయక్ మరియు ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ వనజీవి లెగసీ నీ కొనసాగిస్తునందుకు వాస్విక్ ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తేజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# రాజ్యాంగంపై బిజెపికి నమ్మకం లేదు

**మాజీ ఎంపీ సుభాషిణి ఆలీ**




**హైదరాబాద్ (జనంసాక్షి) :** భారత రాజ్యాంగంపై బీజేపీ నమ్మకం లేదని అందుకనే రాజ్యాంగం అమలులో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నదని మాజీ ఎంపీ సుభాషిణి ఆలీ అన్నారు.ఆవాజ్ రాష్ట్ర 3 వ మహాసభల సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని మక్కా మసీదు నుండి ర్యాలీ ప్రారంభించి, పట్టణ పుర విధులలో ర్యాలీ నిర్వహించి, తేరు మైదానంలో ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికూర్ రెహమాన్ సభాధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ బిజెపికి రాజ్యాంగం పట్ల నమ్మకం లేదని అందుకే, రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి అమలులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీఏఏ, ఎన్ఆర్సీ చట్టం వల్ల మైనార్టీ హక్కులకు భంగం కలిగిందని,అందుకనే పరదచాటున ఉన్న మైనార్టీ మహిళలు తమ హక్కుల కోసం రోడ్ల పైకి వచ్చి ఉద్యమాలు చేస్తున్నారని అన్నారు.మైనారిటీ ల దేశభక్తిని ఎవరు గుర్తించవలసిన అవసరం లేదని, తాము భారతదేశ పౌరులమని అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా తమకు సర్వ హక్కులు కల్పించారని అన్నారు.స్వశక్తి తో అన్ని రంగాలలో మహిళలు ముందుకు వెళుతుంటే బీజేపీ మాత్రం మహిళ హక్కులను నిరాకరిస్తున్నదని, విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాతంత్ర హక్కులను హరిస్తే తిరగబడతామని హెచ్చరించారు.భేటీ పడవో భేటీ బచావో అంటూ నినాదాలు ఇస్తున్న బీజేపీ తాను అధికారంలో ఉన్న యూపీ, బీహార్, మధ్యప్రదేశ్ తదితర రాష్టలలో ఆడ పిల్లల్లపై జరుగుతున్న అరాచకాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. దళిత, ఆదివాసి మహిళలపై దుర్మార్గలు ఆగడం లేదని బీజేపీ అధికారం లో ఉన్న రాష్టాలలో వారి దురాగాతలకు అంతం లేదని విమర్శించారు. ఉత్తరప్రదేశ్ లో యోగి ఆదిత్యనాథ్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆకలి, పేదరికం, నిరుద్యోగం పెరిగిందని వాటి నుండి తప్పించుకోవడానికి మతాన్ని అడ్డం పెట్టుకుంటున్నారని విమర్శించారు.మోడీ గారు అంబానీలు, ఆదానిలకు ఉద్యోగాలు ఇచ్చి, దేశ సహజ వనరులను దోచుకోవడానికి అవకాశం ఇచ్చారని , రైతులు కూలీలకు కార్మిక వర్గాన్ని మాత్రం దోపిడీ పిడనకు గురి చేస్తూ వారిని దోచుకుంటున్నారని విమర్శించారు. తమ ఆర్థిక రాజకీయ దోపిడీని కప్పిపుచ్చుకోవడానికి విద్వేష రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారని విమర్శించారు.రాజ్యాంగాన్ని అంతం చేసి మతోన్మాదాన్ని మనువాదాన్ని అమలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. మనుస్మృతి పుట్టినప్పటి నుండి మరణించే వరకు మహిళలకు హక్కులను నిరకరించిందని అన్నారు. ఎంత పేదరికంలో ఉన్న హక్కులకు భంగం వాటిల్లితే చూస్తూ ఊరుకోరాదని, ప్రజలు జాగృతం అయి సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు ఇచ్చారు. కులాలు, మతాలు, జాతుల మధ్య విభజన వాదాన్ని సృష్టించి తద్వారా రాజకీయ ప్రయోజనం పొందుతున్న బిజెపి ఆలోచనా విధానాలను ప్రజలు తెలుసుకోవాలన్నారు.అమాయక ముస్లిం మైనార్టీలపై అక్రమ కేసులు బనాయించి వారిని దేశద్రోహులుగా చిత్రికరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సెక్యులరిజం కోసం నిలబడాలంటే దమ్ము, ధైర్యం ఉండాలని మైనారిటీలుగా మేము నిలబడాతము మీకు ఆ దమ్ము ఉందా ? అని ప్రశ్నించారు. మైనారిటీలను ఎంత అనగదొక్కితే అంత ఉవ్వేతున్న దేశ భక్తి తో భారతదేశ అభివృద్ధి కోసం పనిచేస్తారని అన్నారు.ఈ సందర్భంగా ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్బాస్ మాట్లాడుతూ మైనార్టీలు విద్య ఆర్థిక రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్నారని, మైనార్టీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని, ఏ రాజకీయ పార్టీ వచ్చిన మైనార్టీలను ఓటు బ్యాంకు రాజకీయాలుగా వాడుకుంటున్నారని అన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో రిజర్వేషన్ లు కల్పించాలని అంబేద్కర్ రాజ్యాంగ ప్రకారం అందరికి సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. మైనారిటీ కార్పొరేషన్ నుండి యువకులకు, భిన్న కులాలకు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు బ్యాంకు లింకు లేకుండా రుణాలు ఇవ్వాలని వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలని డిమాండ్ చేసారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ల ఐక్యతను దెబ్బతియాలని చూస్తున్న బీజేపీ విధానాలను వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉండాలని కోరారు. ఈ సందర్బంగా తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ దేశంలో లౌకిక విలువల పరిరక్షణ కోసం,ప్రజల మధ్య ఐక్యత పెంచడం కోసం ఆవాజ్ రాష్ట్ర మహాసభలు జరగాలని ఆ దిశగా విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్బంగా కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జ్ సరితమ్మ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ పార్టీ సానుకూలంగా ఉన్నదని, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో జనాభా ప్రాతిపాదికన రాజకీయ అవకాశాలు కల్పించి,సంక్షేమ పథకాలు అమలుకు ప్రయత్నం చేస్తున్నదని అన్నారు.ఈ బహిరంగ సభకు గద్వాల జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాస్, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జబ్బార్, బి ర్ ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట రాములు, జేఏసీ నాయకులు మధుసూదన్ బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి ఆవాజ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రహమాతుల్ల, మాజీ కౌన్సిలర్ ఇస్సాక్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు తాహేర్, పాలమూరు అధ్యయన వేదిక ఇక్బాల్ పాషా, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు సుభాన్, టీపీఎఫ్ శంకర ప్రభాకర్, బి ఆర్ ఎస్ వి రాష్ట్ర నాయకులు కుర్వ పల్లయ్య, బి ఆర్ఎస్ నాయకులు గంజిపేట రాజు, సీఐటీయూ వివి నరసింహ, ఉప్పేర్ నరసింహ, మహిళా సంఘం నర్మదా, మౌలానా ఫహీం, పాస్టర్ వసంత్ కుమార్, టవర్ మక్బూల్, దౌలత్, గోపాల్ యాదవ్, గాజుల కృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, ముని, గంధం నాగరాజు, వివిధ సామాజిక ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇకపై పకడ్బందీగా బర్త్, డెత్ సర్టిఫికెట్స్

**గతంలోని లోపాల వల్ల చలామణిలో నకిలీ ధ్రువపత్రాలు**

**నకిలీ బర్త్ సర్టిఫికేట్లలో రోహింగ్యాలవే అధికంగా ఉన్నట్టు గుర్తించిన ఎన్ఐఏ**

**వీటిని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**

**కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఓఆర్‌జీఐ వెబ్‌పోర్టల్లో ఇకపై రిజిస్ట్రేషన్లు**




**హైదరాబాద్ (జనంసాక్షి) :** నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ధ్రువపత్రాల జారీకి జీహెచ్ఎంసీ ప్రస్తుతం వాడుతున్న సాఫ్ట్‌వేర్‌ను విడిచిపెట్టింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఆఫీస్ ఆఫ్ ది రిజిస్ట్రార్ జనరల్ ఇండియా (ఓఆర్‌జీఐ) వెబ్‌పోర్టల్‌ను ఉపయోగించేందుకు జీహెచ్ఎంసీ అనుమతులు తీసుకుంది. ఈ కొత్త విధానం త్వరలోనే అమల్లోకి రానుంది. అప్పటి నుంచి ధ్రువపత్రాల జారీకి ఆధార్ తప్పనిసరిగా ఉండాలి. ప్రస్తుతం పాత పోర్టల్లోనే దరఖాస్తు చేసుకుంటున్నారు. ఆయా ఆధార్ నంబర్లు నిజమైనవా కావా అని పరిశీలించే వ్యవస్థ మాత్రం బల్దియా దగ్గర లేదు. దీనివల్ల వేలాది నకిలీ సర్టిఫికెట్లు చలామణిలోకి వచ్చాయి. అందులో రోహింగ్యాలవి అధికంగా ఉన్నట్టు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) గుర్తించింది. కేంద్ర విధానాన్ని అందిపుచ్చుకోవాలన్న జీహెచ్ఎంసీ అభ్యర్థనను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది.

### తక్షణ సేవలకు బ్రేక్

జీహెచ్ఎంసీ అనుసరిస్తున్న విధానంలో జనన, మరణాల నమోదు చట్టం-1969లోని పది సెక్షన్లు ఉల్లంఘనకు లోనవుతున్నాయి. అందులో ఇన్‌స్టంట్ సేవలు ప్రధానమైనవి. ఆసుపత్రుల్లోని జనన, మరణాలకు జీహెచ్ఎంసీ ప్రస్తుతం 24 గంటల్లో సర్టిఫికెట్ ఇచ్చేస్తోంది. ఈ విధానం సామాన్య ప్రజలకు ఎంతగా ఉపయోగపడుతుందో కేటుగాళ్లకూ అంతే సహాయపడుతోంది. దీనిని వినియోగించుకుని పుట్టని పిల్లలకు పుట్టినట్టు సర్టిఫికెట్లు సృష్టిస్తున్నారు. బతికున్న వ్యక్తులకు చనిపోయినట్టు ధ్రువపత్రాలు ఇచ్చేస్తున్నారు. ఆస్తులను కాజేయడానికి, ఇతర దేశాల వారిని ఈ దేశస్థులుగా చేసేందుకు దీనిని వాడుకుంటున్నట్టు ఎన్ఐఏ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఆసుపత్రులు ఆన్‌లైన్‌లో నమోదు చేసే వివరాల ఆధారంగా సంబంధిత పత్రాలను పరిశీలించకుండా సర్టిఫికెట్లు జారీ చేసే ఇన్‌స్టంట్ విధానంపై ఎన్ఐఏ అభ్యంతరం వ్యక్తం చేసింది. తాజాగా కమిషనర్ కర్ణన్ చొరవ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించారు.

### ఓఆర్ఐజీతో ఉపయోగాలు

ఒకరికి రెండు ధ్రువీకరణపత్రాలు జారీ కావు. తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చే అధికారులు, వివరాలు ఇచ్చే వైద్యులు, ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటారు. మరణ ధ్రువీకరణ పత్రం దరఖాస్తులో గడువు ప్రకారం అధికారులు దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంటుంది. పకడ్బందీగా నమోదయ్యే గణాంకాలను దేశ భద్రత కోసం నిఘా సంస్థలు వాటిని ఉపయోగించుకుంటాయి. జన గణనకూ సమాచారం ఉపయోగపడుతుంది. మీసేవా కేంద్రాలపై ఆధారపడక్కర్లేదు.

## కోటా శ్రీనివాస్‌రావుకు మంత్రి వెంకటరెడ్డి నివాళి





**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రముఖ నటుడు కోటా శ్రీనివాస రావు మృతి పట్ల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రముఖ నటుడు కోటా శ్రీనివాసరావు మృతి బాధాకరమని, ఆయన మరణం నన్ను వ్యక్తిగతంగా కలిచి వేసిందని తెలిపారు. నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో విలక్షణ పాత్రలను ఆయన పోషించారన్నారు. 750 కు పైగా చిత్రాల్లో నటించి నటనలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరుచుకున్నారన్నారు. ఆయన ప్రతిభకు గుర్తింపుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న గొప్ప నటుడని కొనియాడారు. తొమ్మిది నంది పురస్కారాలు అందుకున్న కోటా..శాసన సభ్యునిగా ప్రజా సేవలో నిమగ్నం అయ్యారని, 1978లో ప్రాణం ఖరీదు సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసిన కోటా శ్రీనివాస రావు.. అహ నా పెళ్ళంట సినిమా తో తిరుగులేని నటుడుగా కొనసాగారన్నారు. ఆయన సినీ ప్రయాణంలో పిసినారిగా పొట్ట చెక్కలయ్యేలా నవ్విస్తూనే, విలన్గా ముచ్చెమటలు పట్టించి అన్ని వర్గాల ప్రజల ప్రజలను మెప్పించిన విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు అని, మధ్యతరగతి తండ్రి, అల్లరి తాతయ్య, అవినీతి నాయకుడు, కామెడీ విలన్, నవ్వించే పోలీసు, మాంత్రికుడు ఇలా ఎన్నో పాత్రలను తన నటనతో రక్తికట్టించాడని, ఇంతటి గొప్ప నటుడు మన మధ్య లేక పోవడం అత్యంత విషాదకరం..సినీ పరిశ్రమకు తీరని లోటు..వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370